అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

మంగళవారం 8-8-2017

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 3 సంచిక : 211 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

మార్పు వెనుక మతలబేంటి.?



జీఎస్టీపై నెల రోజుల్లోనే మాట మార్చిన సీఎం

- అప్పుడు లాభమే తప్ప నష్టం లేదని వాదించిన కేసీఆర్
- ఇప్పుడు న్యాయ పోరాటం చేస్తామంటూ కేంద్రానికి హెచ్చరిక
- ఆ మరుసటి రోజే వింత వైఖరి..మోడీకి లేఖపై వెనక్కి తగ్గినట్టేనా.?

'మాట తప్పితే తల నరుక్కుంటా...' అని ముఖ్యమంత్రి కేసీఆర్ అనేకసార్లు చెప్పి.. ఆ తర్వాత విస్మరించిన పదమిది. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) విషయంలోనూ కేసీఆర్ చేస్తున్న వ్యాఖ్యలు వారానికో విధంగా మారుతూ వస్తున్నాయి. ఇవే ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నెలరోజుల కిందట (జులై 3న) క్యాంపు కార్యాలయంలో జీఎస్టీపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో... 'జీఎస్టీ వల్ల స్థూలంగా చూస్తే రాష్ట్రానికి కొద్దో గొప్పో ప్రయోజనమే తప్ప ఏ మాత్రం నష్టం వాటిల్లే అవకాశం లేదు. పన్ను ఎగవేతదారులను గుర్తించి, వారి నుంచి పన్ను వసూలు చేయటానికి మాత్రం జీఎస్టీ కచ్చితంగా ఉపయోగపడుతుంది. దీని ద్వారా ప్రజలకు ఆదాయం సమకూరుతుంది, అలా వచ్చిన ఆదాయం చివరికి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల రూపంలో ప్రజలకే అందుతుంది...' అంటూ ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. ఆయన వ్యాఖ్యలతో కూడిన పత్రికా ప్రకటనను సాక్షాత్తూ ముఖ్యమంత్రి కార్యాలయమే మీడియాకు విడుదల చేసింది. అందుకు భిన్నంగా హఠాత్తుగా ఇప్పుడు సీఎం వైఖరిలో తీవ్రమైన మార్పు వచ్చింది. జీఎస్టీపై న్యాయపోరాటం చేస్తాం.. ఈ అంశంపై కేంద్రానికి లేఖ రాస్తామంటూ శనివారం ఆయన ప్రకటిం చారు. కానీ సోమవారం మళ్లీ ఆయన వైఖరిలో మార్పు కనబడింది. జీఎస్టీ అమలు, శ్లాబుల విషయంలో ప్రధానికి వినతులు అందుతున్నాయి.. దీనిపై మోడీ ఏం చేస్తారో చూడాలంటూ వెనక్కుతగ్గారు. ఇదే విషయం ఇప్పుడు అటు రాజకీయ వర్గాల్లోను, ఇటు ఆర్థిక వర్గాల్లోనూ చర్చనీయాంశమైంది. ప్రజాప్రయోగ నిర్మాణాలపై ...9లో



ఒక స్లిప్.. రెండు ట్రిప్పులు!

మంత్రి కేటీఆర్ ఇలాకాలో ఇసుకాసురులు మధ్యమానేరు నుంచి యథేచ్ఛగా ఇసుకను తోడేస్తున్నారు. అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే దందా సాగిస్తున్నారు. ఒక్కో స్లిప్‌పై ఒక ట్రిప్పు ఇసుక తరలించాల్సి ఉండగా... నిబంధనలకు తూట్లు పొడిచి రెండు ట్రిప్పులను తీసుకెళ్తున్నారు. దొరికిందే తడవుగా దోచుకునే ప్రయత్నంలో అభాగ్యుల ప్రాణాలను సైతం లెక్కచేయట్లేదు. ఎక్కువ ట్రిప్పులను తరలించే క్రమంలో ఇసుక లారీల అధిక వేగం వల్ల మూడు నెలల్లోనే ఎనిమిది మంది అమాయకులు చనిపోయారు. దీనిపై పోలీసులు కనీసం స్పందించలేదు. కండ్లెదుటే ఓ మనిషిని లారీ గుద్ది అట్లాగే పోతుంటే తట్టుకోలేక...ఊర్లోంత ఆవేదనతో, ఆక్రందనతో, ఆగ్రహంతో మూకుమ్మడిగా లారీలను తగులబెడితే మాత్రం పోలీసోళ్ల కోపం నశాలానికి అంటుకుంది. మాఫియాకు అడ్డొచ్చిన ఆ బిడ్డలను జీవితంలో కోలుకోకుండా చిత్ర హింసలు పెట్టారు. జాతీయ స్థాయిలో నేరెళ్ల ఘటన చర్చనీయాంశమవుతున్నా...మన ఏలికలు మాత్రం ఇంకా కప్పిపుచ్చుకునే యత్నమే చేస్తున్నారు. మాఫియాను రక్షణ నిలిచే ప్రయత్నాలు మొదలుపెట్టారు. 9లో

మధ్యమానేరులో తోడుకునోడికి తోడుకున్నంత

- అధికార పార్టీ కనుసన్నల్లోనే దందా
- ఇసుక లారీలకు మూణ్నెల్లలో 8 మంది బలి
- నేరెళ్ల ఘటనతోనైనా కండ్లుతెరవని సర్కారు
- బాధితులకు గాలం వేస్తున్న టీఆర్ఎస్ నేతలు



మైనారిటీ వైద్య కళాశాలల్లో సీట్ల భర్తీపై స్టే

- ఏ కేటగిరీ సీట్లు తగ్గించి... బీ కేటగిరీ పెంచడంపై హైకోర్టు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మైనారిటీ వైద్య విద్య కళాశాలల్లో సీట్ల భర్తీపై ఉమ్మడి హైకోర్టు స్టే విధించింది. ఆ కళాశాలల్లో 'ఏ' కేటగిరీ సీట్లు తగ్గించి.. 'బీ' కేటగిరీ సీట్లు పెంచడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై న్యాయస్థానం విచారించింది. గతంలో 'ఏ' కేటగిరీ కన్వీనర్ కోటా సీట్లు 60 శాతం.. 'బీ, సీ' కేటగిరీ యాజమాన్య కోటా సీట్లు 40 శాతం ఉండేవని, కానీ ఈ ఏడాది 'ఏ' కేటగిరీ సీట్లు తగ్గించి, 'బీ' కేటగిరీ సీట్లు పెంచడంతో 'ఏ' కేటగిరీలో 50శాతం, బీ కేటగిరీలో 50 శాతం మారాయని పిటిషనర్ తరపు న్యాయవాది రచనారెడ్డి న్యాయస్థానంలో వాదించారు. 'ఏ' కేటగిరీ ఫీజు ఏడాదికి రూ.60 వేలు ఉండగా, 'బీ' కేటగిరీలో రూ.14 లక్షలు ఉందని, దీంతో మైనారిటీ ఎంబీబీఎస్, బీడీఎస్ కళాశాలల యాజమాన్యాలకు సీట్లు అమ్ముకునే అవకాశం ఏర్పడిందని ఆమె వాదించారు. చట్ట విరుద్ధంగా సీట్ల కేటాయింపు నిష్పత్తి మార్చినందున జీవో 115, 117, 119లను నిలిపివేసి గతంలో మాదిరిగా 130 జీవో ప్రకారమే సీట్ల భర్తీ చేయాలని కోరారు. అన్ని రాష్ట్రాల్లో ఇదే విధానం ఉందని, ఇప్పటికే మొదటి విడత కౌన్సిలింగ్ కూడా పూర్తయిందని కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం హైకోర్టుకు తెలిపింది. దీనిపై స్పందించిన ఉన్నత న్యాయస్థానం మైనారిటీ విద్య,వైద్య కళాశా లల్లో తదుపరి సీట్ల భర్తీపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. పూర్తి వాదనల కోసం కౌంటర్లు దాఖలు చేయాలని కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయాన్ని ఆదేశించింది.

ఫ్రిజ్, బైక్ ఉంటే సంక్షేమం కట్



న్యూఢిల్లీ: పట్టణ ప్రాంతాల్లో ఉన్న మీకు ఫ్రిజ్, ద్విచక్ర వాహనం ఉన్నాయా...? అయితే మీరు సంక్షేమ కార్యక్రమాలకు అర్హులు కారంటూ కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. ప్రభుత్వం నియమించిన దేబ్రాయ్ కమిటీ ఈ మేరకు కేంద్రానికి నివేదిక అందజేసింది. నాలుగు గదుల ఇల్లున్నా, కారు, ఎయిర్ కండీషనర్, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్, ద్విచక్ర వాహనం ఉంటే సంక్షేమ పథకాలకు అనర్హులంటూ బిబేక్ దేబ్రాయ్ కమిటీ సిఫారసు చేసింది. ఇవి ఉన్నట్టు తేలితే... 9లో

జీఎస్టీపై వేచి చూద్దాం

పన్నుల శ్లాబుల్లో భిన్నాభిప్రాయాలు: ముఖ్యమంత్రి కేసీఆర్

- సీఎంతో ది హిందూ మాజీ ఎడిటర్ ఎన్.రామ్ భేటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జీఎస్టీ అమల్లో ఇబ్బందుల వల్ల చాలా దేశాలు వెనక్కి తగ్గాయని, మన దేశంలో ఏమవుతుందో వేచి చూడాలని ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు అన్నారు. ఆర్థిక సంస్కరణల్లో భాగంగా కేంద్రం జీఎస్టీ ప్రయోగం చేసిందని చెప్పారు. పన్ను శ్లాబుల విషయంలో కూడా భిన్నాభిప్రాయాలు న్నాయని దీనిపై కేంద్రం ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సి ఉందన్నారు. హిందూ దినపత్రిక మాజీ ఎడిటర్ ఇన్ చీఫ్, ప్రస్తుత కస్తూరీ అండ్ సన్స్ లిమిటెడ్ చైర్మెన్ ఎన్.రామ్ సోమవారం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశారు. ఆయన రాసిన 'వై స్కామ్స్ ఆర్ హియర్ టు స్టే' పుస్తకాన్ని సీఎంకు అందించారు. ఈ సందర్భంగా సమకాలీన అంశాలతో పాటు, తెలం గాణ ఉద్యమం, కొత్త రాష్ట్రం పయనిస్తున్న తీరుపై చర్చ జరిగింది. జీఎస్టీ విధానంపై అభిప్రాయం ఏమిటని రామ్ అడగ్గా కేసీ ఆర్ పై విధంగా స్పందించారు. గోదావరి, కృష్ణా నదుల్లో చాలినంత నీ రుంది, వాటిని సద్వినియోగం చేసుకోవడం వల్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు బాగుపడతాయని సీఎం చెప్పారు. సమైక్య ...9లో




సీఎం కేసీఆర్‌తో కరచాలనం చేస్తున్న రామ్

22న బ్యాంకు ఉద్యోగుల సమ్మె

తొమ్మిది సంఘాల పిలుపు

- 10 లక్షల మంది పాల్గొనే అవకాశం



10లో (ఫైల్)

శాంతి ప్రక్రియకు విఘాతం

జైట్లీ వ్యాఖ్యలపై బృందాకరత్ ఆగ్రహం




ధనాబాద్ (జార్ఖండ్): 'వినాశకర రాజకీయాల'కు స్వస్తి పలకాలంటూ కేరళలో అరుణ్‌జైట్లీ చేసిన వ్యాఖ్యలను సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్ ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన శాంతి ప్రక్రియకు విఘాతం కలిగించేలా జైట్లీ ప్రసంగాలు ఉన్నాయని ఆరోపించారు. సీపీఐ(ఎం) సమావేశంలో పాల్గొనేందుకు ధన్‌బాద్ వచ్చిన ఆమె విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ఆర్థిక మంత్రి చేసిన ప్రసంగం... ఆ హోదాకు తగ్గట్టులేదని, రాష్ట్రంలో అశాంతి నెలకొల్పడంతో పాటు ...9లో

సీసీ టీవీ ఫుటేజ్‌లు అదృశ్యం

బీజేపీ నేత తనయుడి లైంగిక వేధింపుల కేసులో

- మీడియా ప్రశ్నలకు సమాధానమివ్వకుండా..



ఛండీగఢ్: బీజేపీ హర్యానా సీనియర్ నేత తనయుడు మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడిన ప్రాంతంలో ఐదు ప్రదేశాల్లో అమర్చి ఉన్న సీసీటీవీ ఫుటేజ్‌లు అదృశ్యమయ్యాయి. దీన్ని ఎవరు మాయం చేశారు..? పోలీసులపై బీజేపీ నేతలే ఒత్తిడి తెచ్చారా..అన్న ...9లో

పీవోకే నుంచి చొరబాటుకు యత్నం, ఐదుగురు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్: పాక్ ఆక్రమిత కాశ్మీర్ నుంచి చొరబాటుకు యత్నించిన ఐదుగురు ఉగ్రవాదులను భారత సైన్యం హతమార్చింది. సోమవారం ఉత్తరకాశ్మీర్‌లోని కుప్వారా జిల్లా మచిల్ సెక్టార్‌లో ఈ సంఘటన జరిగింది. నియంత్రణ రేఖ వద్ద అనుమానిత వ్యక్తులను లొంగిపోవాల్సిందిగా భద్రతా దళాలు హెచ్చరించగా, వారు కాల్పులకు తెగబడ్డారని.. దాంతో, భద్రతా దళాలు ఎదురు కాల్పులు జరిపాయని అధికారులు తెలిపారు. మృతి చెందిన ఉగ్రవాదుల నుంచి ఐదు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఆ ప్రాంతంలో భద్రతా దళాల గాలింపు ఇంకా కొనసాగుతున్నట్టు అధికారులు తెలిపారు.

రాష్ట్రంలో ఖాకీ పాలన

- లారీలు దహనం చేస్తే థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారా?: ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ డిమాండ్



బాధితులను పరామర్శిస్తున్న మందకృష్ణ

నవతెలంగాణ-వేములవాడ

నేరెళ్ల ఘటనలో ఆగ్రహించిన గ్రామస్తులు లారీలను దహనం చేస్తే కేసులు నమోదు చేయాలిగానీ థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారా? అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ప్రశ్నించారు. రాష్ట్రంలో ఖాకీల పాలన సాగుతోందని దుయ్యబట్టారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని వెంకటేశ్వర నర్సింగ్‌హోంలో చికిత్స పొందుతున్న ఆరుగురు బాధితులను ఆయన సోమవారం పరామర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాధితులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, తీవ్రంగా హింసించిన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే సిరిసిల్లలో కేటీఆర్, రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం మూల్యం చెల్లించుకునే రోజులు వస్తాయని హెచ్చరిం చారు. బాధితు లకు అన్ని పార్టీలూ మద్దతు తెలుపుతుంటే మంత్రి కేటీఆర్ మాత్రం నోరెత్త కపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా బాధితుల పక్షాన కేటీఆర్ స్పందంచకపోతే సిరిసిల్లతోపాటు రాష్ట్రంలో ఎలా తిరుగుతాడో చూస్తామని హెచ్చరించారు. బాధితులపై సీఎం అపహాస్యపు మాటలు ...9లో




నయీమ్ కేసుపై రాజకీయ పడగ

ఎన్‌కౌంటర్ జరిగి ఏడాదైనా వీడని మిస్టరీ

- దొరకని గ్యాంగ్‌స్టర్ కుడిభుజం శేషన్న, అతని గ్యాంగ్
- పోలీస్ అధికారులు, రాజకీయ ప్రముఖుల పాత్రపై తీరని అనుమానాలు ..
- బాధితులకు జరగని న్యాయం

ఉమ్మడి తెలుగు రాష్ట్రాన్ని గడగడలాడించి, తన నేర సామ్రాజ్యాన్ని ఇతర రాష్ట్రాలకు సైతం విస్తరించిన గ్యాంగ్‌స్టర్ నయీమ్ ఎన్‌కౌంటర్ జరిగి ఏడాదైనా ఆ కేసు దర్యాప్తు ఇంకా పూర్తి కాలేదు. దీనిపై దర్యాప్తు చేపట్టిన స్పెషల్ ఇన్‌వెస్టిగేషన్ టీమ్(సిట్) తొలి ఆరు నెలల్లో దూకుడుగా ముందుకు సాగినప్పటికీ తర్వాత చల్లబడిపోయిందనే ఆరోపణలను ఎదుర్కొంటున్నది. నయీమ్ గ్యాంగ్ సభ్యులను పెద్దఎత్తున అరెస్టు చేసినప్పటికీ.. ఇంకా కుడిభుజం శేషన్న, అతని ముఠా సభ్యులు మాత్రం సిట్‌కు చిక్కక పోవడంతో నయీమ్ బాధితులను ఇంకా భయం వెంటాడుతున్నది. మరోపక్క నయీమ్‌తో అంటకాగిన రాజకీయ ప్రముఖులు, పోలీసు అధికారుల విషయంలో దర్యాప్తు స్పష్టత లేకుండా సాగడంపైనా అనేక విమర్శలున్నాయి.



వివరాలు 2లో

అభివృద్ధి పేరుతో కాలుష్యం

- ప్రజలకు ప్రశ్నించే హక్కుండాలి :

పర్యావరణ శాస్త్రవేత్త సునీత నారాయిన్



అమరావతి : కాలుష్యాన్ని వెదజల్లే పశ్చిమ దేశాల అభివృద్ధి నమూనా సరి కాదని ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త సునీత నారాయిన్ స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వాలు ఇలాంటి విషయాల్లో అసమ్మతి తెలిపే హక్కు లేకుండా ప్రజలకు లేకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త చుక్కపల్లి పిచ్చయ్య ఐదో స్మారక ప్రసంగ కార్యక్రమం సోమవారం సాయంత్రం విజయవాడలోని శేషసాయి కల్యాణ మండపంలో ఏర్పాటైంది. ఈ సభలో సునీత నారాయిన్ మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధికంగా ఇంధనాన్ని ఖర్చు చేయడమే అభివృద్ధికి నమూనాగా చెబుతున్నారని, కానీ ఆ తరహా అభివృద్ధి అనార్థలతో ఎప్పటికైనా కుప్ప కూలిపోతుందని హెచ్చ రించారు. వాతావరణం లోనూ అనేక మార్పులు వచ్చాయని, వర్షాలు అతిగా పడి వరదలు వస్తున్నాయని, ఎక్కువ కాలం వర్షాలు పడటం లేదని, రుతుపవనాల్లో మార్పొచ్చి వ్యవసాయ రంగంపై ఆ ప్రభావం పడుతోందని చెప్పారు. వాతావరణంలో పెరిగిపోతున్న తాపాన్ని తగ్గించేందుకు కాలుష్యాన్ని వెదజల్లుతున్న దేశాలు గతంలో కొన్ని ఒప్పందాలు చేసుకుంటే, ట్రంప్ దాన్నుండి బయటకు వచ్చారని గుర్తు చేశారు. ఇది ప్రమాదకరమైన పరిణామమన్నారు. ఢిల్లీ వంటి మహా నగరాల్లో వాహనాల రద్దీతో గాలి విషతుల్యమైందని తెలిపారు. అక్కడ 15 శాతం వాహనాలు 90 శాతం రోడ్డును ఆక్రమించాయని, అది 100 శాతానికి చేరితే ఢిల్లీలో పరిస్థితి మరింత భయానకంగా మారుతుందని వివరించారు. అక్కడ ఇంధన వాడకం లేకుండా సైకిళ్లకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉందని సూచించారు.

'498-ఎ దుర్వినియోగాన్ని అరికట్టాలి'

న్యూఢిల్లీ : భారత శిక్షా స్మృతిలోని గృహ హింస నిరోధక చట్టం (సెక్షన్ 498-ఎ) దుర్వినియోగం కాకుండా చూడాలని సుప్రీంకోర్టు పేర్కొన్నది. ఈ మేరకు పోలీస్ అధికారులు, న్యాయమూర్తులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని భార్య ఫిర్యాదు ఇవ్వగానే అత్తమామ, కుటుంబ సభ్యులు, భర్తపై పోలీసులు తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని అభిప్రాయపడింది. ఇకపై ఇలాంటి అక్రమ అరెస్టులను అరికట్టాలని సర్వోన్నత ధర్మాసనం ఆదేశించింది. గతనెల27న రాజేశ్వర్మ అండ్ అదర్స్ వర్సెస్ స్టేట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్ కేసుపై జస్టిస్ ఏకే గోయల్, జస్టిస్ యూయూ లలిత్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా డివిజన్ బెంచ్ పలు ఆదేశాలు జారీ చేసింది. 498-ఎ కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులపై ఫిర్యాదు అందగానే అరెస్ట్ చేయొద్దని పోలీస్ ఉన్నతాధికారులకు, న్యాయమూర్తులకు ఆదేశాలు జారీ చేసింది. తమ ఆదేశాలు బేఖాతరు చేసినట్టయితే కోర్టు ధిక్కరణ ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఫ్యామిలీ వెల్ఫేర్ కమిటీని ఏర్పాటు చేయాలని తెలిపింది. ఈ కమిటీలో ముగ్గురు సభ్యులుండాలి. ఈ కమిటీకి చైర్మెన్‌గా జిల్లా జడ్జీ వ్యవహరించాలి. కమిటీలో పారా లీగల్ వాలంటీర్లు, సామాజిక కార్యకర్తలు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, గృహిణులకు సభ్యత్వం కల్పించవచ్చని తెలిపింది. కమిటీ సభ్యులను ఎట్టి పరిస్థితుల్లోనూ సాక్షులుగా చేర్చొద్దని ఆదేశించింది. బాధితురాలి నుంచి అందిన ఫిర్యాదు కాపీని ఫ్యామిలీ వెల్ఫేర్ కమిటీకి పంపించాల్సిన బాధ్యత పోలీస్ అధికారులు, మెజిస్ట్రేట్ తీసుకోవాలని సూచించింది. 498-ఎ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి ఫిర్యాదుకు సంబంధించిన సమాచారం తెలియజేయాలి. ఫోన్, సామాజిక మాధ్యమాల్లోనూ సమాచారం అందజేయొచ్చని తెలిపింది. ఫిర్యాదు అందిన రోజు నుంచి నెలరోజుల్లో ఫ్యామిలీ వెల్ఫేర్ కమిటీ విచారణ చేపట్టి దానికి సంబంధించిన రిపోర్టును పోలీస్ ఉన్నతాధికారులకు, న్యాయమూర్తులకు అందజేయాలి. ఈ రిపోర్ట్ ఆధారంగా ఐవో (ఇన్వెస్టిగేషన్ అధికారి) విచారణ చేపట్టాలి. ఈ క్రమంలో కమిటీ ఇచ్చిన నివేదికను కూడా పరిశీలించాలి. 498-ఎ కేసులపై విచారణ చేపట్టే పోలీస్ అధికారులకు ప్రత్యేక శిక్షణ అందించాలి. బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్న నిందితులకు బెయిల్ మంజూరు చేయాలి. భరణం, పిల్లల సంరక్షణ తదితర అంశాలను ముడిపెడుతూ బెయిల్ మంజూరును నిరాకరించొద్దు. ఇతర దేశాల్లో ప్రవాసమంటున్న వారి పాస్‌పోర్టులను అప్పగించాలని ఒత్తిడి తీసుకురావొద్దు. ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్న కుటుంబ సభ్యులందరూ కోర్టులో హాజరుపర్చాల్సిన అవసరం లేదు. ట్రయల్ ముందుకు సాగేందు కోసం నిందితుడి కుటుంబ సభ్యుల వాంగ్మూలాన్ని వీడియో కాన్ఫరెన్స్‌లోనూ తీసుకోవచ్చు. బాధితురాలు, నిందితుడి మధ్య రాజీ కుదిరినట్లయితే జిల్లా జడ్జీ లేదా సీనియర్ న్యాయాధికారి ద్వారా నియమితులైన వారు తుది నిర్ణయం తీసుకోవచ్చు. కేసు ఉపసంహరణకు అనుమతించవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

రజనీకాంత్‌తో పూనమ్ మహాజన్ భేటీ



చెన్నై : ప్రముఖ సినీ నటుడు రజనీకాంత్‌తో బీజేపీ యువ మోర్చా జాతీయ అధ్యక్షురాలు పూనమ్ మహాజన్ సమావేశమవ్వడంలో ఎలాంటి రాజకీయం లేదని బీజేపీ అధిష్టానం స్పష్టం చేసింది. తమిళనాడు పర్యటనలో వున్న పూనమ్ మహాజన్ ఆదివారం రజనీకాంత్‌తో సమావేశమయ్యారు. ఈ విషయాన్ని ట్విటర్ ద్వారా ఆమె వెల్లడించారు. రజనీకాంత్‌ను కలుసుకోవడం చాలా ఆనందంగా వుందని అన్నారు. ఇటీవల కాలంలో రజనీకాంత్ రాజకీయాల్లో ప్రవేశిస్తారని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రజనీకాంత్-పూనమ్ మహాజన్ భేటీపై అనేక ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. రజనీకాంత్‌ను బీజేపీలోకి ఆహ్వానించడానికే పూనమ్ మహాజన్ సమావేశమయ్యారని వార్తలు వస్తున్నాయి. ఇటీవల 'సరైన సమయంలో యుద్ధానికి సిద్ధంగా వుండండి' అని రజనీకాంత్ తన అభిమానులకు పిలుపునిచ్చారు.

పన్నీరు వైపు కత్తితో దూసుకొచ్చిన వ్యక్తి

తిరుచ్చి ఎయిర్‌పోర్ట్‌లో ఘటన

అడ్డుకున్న భద్రతా సిబ్బంది

చెన్నై: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్ సెల్వం వద్దకు తిరుచ్చి విమానాశ్రయంలో ఒక వ్యక్తి కత్తితో దూసుకురావడం కలకలం రేపింది. ఉదయం 11 సమయంలో తిరుచ్చి విమానాశ్రయానికి చేరుకున్న సెల్వం పాత్రికేయులతో మాట్లాడుతూ ఉండగా, గుర్తు తెలియని వ్యక్తి ఆయనవైపుగా దూసుకొచ్చాడు. ఇది గమనించిన కేంద్ర పారిశ్రామికదళ భద్రతా అధికారి ఆయనను అడ్డుకున్నారు. అయితే ఆ కుదుపులో అతని ధోతిలో దాచిన కత్తి కిందపడింది. దీన్ని గమనించిన సెల్వం అనుచరులు ఆ వ్యక్తిని చితక బాదారు. ఇది రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఈ ఘటనలో నిందితుడు సౌరిరాజా(48)గా పోలీసులు గుర్తించారు.

ఢిల్లీలో వివాహిత దారుణ హత్య

న్యూఢిల్లీ : కట్టుకున్న భర్తే ఓ వివాహిత పాలిట కాలయముడయ్యాడు. ఉద్యోగం కోసం ప్రయత్నించమని ప్రాథేయపడిన భార్యను అతి కిరాతకంగా హతమార్చాడు. ఈ దారుణ ఘటన ఢిల్లీలోని బాదర్‌పూర్ ప్రాంతంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకున్నది. ఢిల్లీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ప్రవీణ్ (32), మీనాక్షి (30) ఇద్దరు భార్యాభర్తలు. గతకొంత కాలం నుంచి బాదర్‌పూర్ ప్రాంతంలో కాపురముంటున్నారు. ప్రవీణ్ ఏ ఉద్యోగంలోనూ నిలకడగా పనిచేసే వాడు కాదు. ఫలితంగా కుటుంబ సభ్యులు ఇబ్బందులుపడేవారు. మంచి ఉద్యోగం కోసం ప్రయత్నించమని మీనాక్షి పదేపదే బతిమిలాడేది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగేది. ఆదివారం రాత్రి ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. ప్రవీణ్ తన వెంట తెచ్చుకున్న కత్తితో మీనాక్షిని అతి కిరాతకంగా పొడిచి చంపాడు. అనంతరం ఆమె తలపై గ్యాస్ సిలిండర్‌తో మోదాడు. ఈ ఘటనను ప్రత్యక్షంగా వీక్షించిన చిన్నారులు భయాందోళనకు గురయ్యారు. తమ తండ్రే తల్లిని హత్య చేసినట్టు పోలీసులకు చెప్పారు. కేసు నమోదు చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు పోలీస్ అధికారులు తెలిపారు.

మైనారిటీ హోదా ఉపసంహరణకు కేంద్రం యోచన..?



న్యూఢిల్లీ: కేంద్రీయ విశ్వవిద్యాలయం జామియా మిలియా ఇస్లామియా (జేఎంఐ)మతపరమైన మైనారిటీ హోదాకు ఆమోదయోగ్యం కాదంటూ కేంద్రం త్వరలోనే సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయనున్నట్టు తెలుస్తోంది. కేంద్రీయ విశ్వవిద్యాలయంగా ఉన్న సంస్థలకు మైనారిటీ హోదా ఇవ్వలేమంటూ బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. బ్రిటీష్ చట్టసభ ద్వారా ఏర్పాటైన అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ విషయంలో మైనారిటీ హోదా చెల్లదంటూ సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును(1967లో అజీజ్‌బాషా కేసులో ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం) కేంద్రం తన వాదనకు మద్దతుగా జత చేయనున్నది. అందుకోసం మానవ వనరుల మంత్రిత్వశాఖ రంగం సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. జేఎంఐని పార్లమెంట్ చట్టం ద్వారా కేంద్రీయ విశ్వవిద్యాలయంగా గుర్తించి ప్రభుత్వ నిధులతో నడిపిస్తున్నట్టు కేంద్రం చెబుతోంది. జేఎంఐలో ప్రస్తుతం ముస్లిం విద్యార్థులకు 50 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. ఇందులో 30 శాతం ముస్లింల జనరల్ కోటాకు, 10 శాతం ముస్లిం మహిళలకు, 10 శాతం ముస్లింలలోని ఓబీసీలు,ఎస్టీలకు రిజర్వ్ చేశారు. వలస పాలకుల నిధులతో నడిచే విద్యాలయాలను బహిష్కరించాలన్న మహాత్మాగాంధీ పిలుపుతో జేఎంఐని ముస్లిం జాతీయవాదులు 1920లో అలీగఢ్‌లో ప్రారంభించారు. ఆ తర్వాత దానిని ఢిల్లీకి తరలించారు. 1962లో డీమ్డ్ యూనివర్సిటీగా గుర్తింపు పొందిన జేఎంఐని 1988లో కేంద్రం పార్లమెంట్ చట్టం ద్వారా కేంద్రీయ విశ్వవిద్యాలయంగా ప్రకటించింది.



తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్‌చౌహాన్ ఇంటి ముందు సోమవారం బైటాయించారు. రాఖీలను చేతుల్లో పట్టుకొని ఆందోళనకు దిగారు

సీపీఐ(ఎం)పై చెప్పాలని చిత్రహింసలు పెట్టారు...


మాతృసంస్థపై ఆరెస్సెస్ కార్యకర్త ఆరోపణ



కన్నూర్: రాష్ట్రంలో జరుగుతున్న హత్యలకు, హింసాకాండకు సీపీఐ(ఎం) కారణమని చెప్పాలంటూ తనను శారీరకంగా, మానసికంగా చిత్రహింసలకు గురి చేశారని కేరళలోని కన్నూర్ జిల్లాకు చెందిన ఆరెస్సెస్ కార్యకర్త ఒకరు వివరించారు. ఆత్మహత్యకు విఫల ప్రయత్నం చేసి ఆస్పత్రి పాలయిన ఆ కార్యకర్త విష్ణును ఇటీవల సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పి జయరాజన్, రాష్ట్ర కార్యదర్శి కొడియేరి బాలకృష్ణన్ పరామర్శించారు. అతడితో కొద్ది సేపు సంభాషించిన అనంతరం బాలకృష్ణన్ మీడియాతో మాట్లాడుతూ విష్ణు చేసిన ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. తాను 18 ఏళ్ల పాటు సేవలందించిన సంస్థ తన ఆత్మహత్యకు కారణం సీపీఐ(ఎం) నేత జయరాజన్ అంటూ సూసైడ్ లేఖ రాయమని వత్తిడి చేసిందని విష్ణు వారికి వివరించాడు. ఇందుకోసం తనను దాదాపు నెలరోజుల పాటు నిర్బంధించి మానసికంగా చిత్రహింసలకు గురి చేశారన్నాడు. తాను ఆరెస్సెస్ సంస్థలో 18 ఏండ్లుగా పనిచేస్తున్నానని, అయితే ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆ సంస్థలో తీవ్ర మార్పులు చోటు చేసుకున్నాయని వివరించాడు. ధనరాజ్ హత్య కేసులో నిందితుడైన కన్నన్ జిల్లాలో ప్రచారక్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి తనకు సమస్యలు ఎదురయ్యాయన్నాడు. తనతో పాటు సంస్థలోని మరికొందరు నేతలు, కార్యకర్తలు చెప్పేది వినిపించుకోకుండా తనకు ఎదురులేనట్టు వ్యవహరించేవాడన్నాడు. కన్నన్ గురించి తాను పోలీసులకు సమాచారం అందించినపుడు ఆరెస్సెస్ సంస్థ తనపై ఆగ్రహించిందని విష్ణు చెప్పాడు. గత డిసెంబర్ 15న కొంతమంది ఆరెస్సెస్ కార్యకర్తలు ఒక కారులో తనను కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారని చెప్పాడు. తనపై ఏదో జరుగుతోందని తెలుసుకున్నప్పటికీ తాను వారి నుండి బయటపడలేకపోయానన్నాడు. తనను తిరువనంతపురంలో ఆరెస్సెస్ నేతల వద్దకు తీసుకెళ్లారని, అక్కడ కన్నన్ గురించి పోలీసులకు చెప్పావా? అని వారడిగినపుడు అవునని చెప్పానని వెల్లడించాడు. దీనితో వారు తనను నిర్దాక్షిణ్యంగా దాదాపు నాలుగైదు గంటలసేపు చిత్రహింసలకు గురి చేశారన్నాడు. తనను దాదాపు 86 గంటలసేపు నిద్రకూడా పోనివ్వకుండా చిత్రహింసలు పెట్టారని, తాను కళ్లు మూసుకున్నపుడు మీద నీరు పోసి మరీ తనను కొట్టారని విష్ణు వాపోయాడు. 'నువ్వసలు బతికుండటానికి వీల్లేదు' అంటూ తనను బెదిరించారన్నాడు. కొంత సమయం తరువాత తనను ఆత్మహత్యా పత్రం రాయాల్సిందిగా వత్తిడి చేశారని, జయరాజన్ తనను మానసికంగా చిత్రహింసలకు గురిచేయటంతో వాటిని భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని రాయమన్నారని చెప్పారు. వారి మనస్తత్వం తెలిసిన తాను దానిని తప్పించుకునేందుకు ఉపయోగించుకున్నానని చెప్పాడు. వారు తనను అనేక ఆరెస్సెస్ ఆఫీసులకు ఇళ్లకుతిప్పారని, చివరికి ఒక ప్రాంతంలో ఉండగా.. వారి నుండి తప్పించుకున్నానని వివరించాడు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో బీజేపీ జెండాలను బీజేపీ-ఆరెస్సెస్ కార్యకర్తలే ధ్వంసం చేసి దానిని సీపీఐ(ఎం) పైకి నెట్టేవారన్నాడు. కొంత కాలం క్రితం తాను ఇతర ఆరెస్సెస్ కార్యకర్తలతో కలిసి అట్టింగల్ పెంతెకోస్తు చర్చిపై దాడి చేశామని, రంజాన్ సమయంలో ఎద్దులతో వచ్చిన వాహనాలను అడ్డుకున్నామని వివరించాడు. ఎందుకివన్నీ చేస్తున్నామని వారిని అడిగినపుడు వారి నుండి ఎటువంటి స్పందనా లేదన్నాడు. అనేక ప్రాంతాల్లో తాము బీజేపీ జెండాలను ధ్వంసం చేసి దానిని సీపీఐ(ఎం)పైకి నెట్టేవారిమని, అప్పుడు ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలు ఏర్పడేవని చెప్పాడు. విష్ణు చేసిన ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు కంట్రోల్ రూమ్ అసిస్టెంట్ కమిషనర్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కిడ్నాపింగ్, చిత్రహింసలు, అసాంఘిక కార్యకలాపాలు, దాడుల అభియోగాలతో కేసును నమోదుచేశారు.

దృష్టి మరల్చేందుకే

బీజేపీ హింసా రాజకీయాలపై కేరళ సీఎం



బెంగళూరు : తమ నేతలపై వచ్చిన అభియోగాల నుంచి ప్రజల దృష్టి మళ్ళించేందుకే బీజేపీ, ఆరెస్సెస్‌లు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో హింసను ప్రేరేపిస్తున్నట్టు నిఘా వర్గాల నుంచి తమకు సమాచారం అందిందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ చెప్పారు. గత నెలలో రాష్ట్ర బీజేపీ శాఖ పలు అవినీతి అభియోగాలను ఎదుర్కొందని గుర్తుచేశారు. ఆ అభియోగాలపై సీబీఐ దర్యాప్తు జరిపించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ కూడా సీబీఐ దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేసిందన్నారు. రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి ఎం.టి. రమేష్, కో ఆపరేటివ్ సెల్ కన్వీనర్ ఆర్.ఎస్. వినోద్‌లపై అవినీతి అభియోగాలున్నాయి. రాష్ట్రంలోని రెండు ప్రైవేటు కళాశాలలకు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) గుర్తింపు ఇప్పించేందుకు వారు రూ.5.6 కోట్లు లంచం తీసుకున్నట్టు బీజేపీ నిర్వహించిన అంతర్గత దర్యాప్తు నివేదిక వెల్లడించిందని విజయన్ తెలిపారు. ఈ నివేదిక వివరాలను పత్రికలు వెల్లడించడంతో వారిని బీజేపీ నుంచి సస్పెండ్ చేశారన్నారు. కేరళలో సీపీఐ(ఎం), బీజేపీల మధ్య దశాబ్దాల కాలంగా సిద్ధాంతపరమైన వైరుధ్యాలు కొనసాగుతున్నాయని, పలు మార్లు హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయని ప్రభుత్వ నివేదిక వెల్లడించింది.

హర్యానా బీజేపీ నేతపై కేసు

అంబులెన్స్‌ను అరగంట సేపు ఆపడంతో రోగి మృతి

ఛండీగఢ్ : హర్యానా బీజేపీ నేత దర్శన్ నాగ్‌పాల్‌ను అరెస్ట్ చేసినట్టు ఫతేహాబాద్ ఇన్స్‌పెక్టర్ తెలిపారు. నవీన్ అనే రోగిని అంబులెన్స్‌లో తరలిస్తుండగా నాగ్‌పాల్ కారు, అంబులెన్స్ ఢీకొన్నాయి. ఈక్రమంలో అంబులెన్స్ డ్రైవర్, నాగ్‌పాల్ మధ్య వాగ్వాదం జరిగింది. అంబులెన్స్‌లో ఉన్న రోగిని అత్యవసరంగా ఆస్పత్రికి తరలించకపోతే చనిపోతాడని డ్రైవర్ ఎంతగా బతిమలాడినా నాగ్‌పాల్ పట్టించుకోలేదు. పైగా, డ్రైవర్‌పై దాడికి పాల్పడ్డారు. దాదాపు అరగంట సేపు అంబులెన్స్‌ను కదలనివ్వలేదు. దీంతో, ఓ నిండు ప్రాణం బలైంది. తన భర్త మృతికి నాగ్‌పాలే కారణమని ఆరోపిస్తూ భార్య ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని ఘటనపై విచారణ చేపట్టినట్టు ఇన్స్‌పెక్టర్ తెలిపారు.

సీఎం కాన్వాయ్ కోసం.. అంబులెన్స్‌ను ఆపారు

చెన్నై : తమిళనాడు సీఎం పళనిస్వామి కాన్వాయ్‌కు దారి ఇచ్చేందుకు చెన్నై ట్రాఫిక్ పోలీసులు ఏకంగా ఓ అంబులెన్స్‌ను ఆపారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ట్రాఫిక్ పోలీసు అధికారుల తీరు పట్ల నెటిజన్లు మండిపడుతున్నారు. అత్యవసర సేవల కోసం అంబులెన్స్ ప్రయాణిస్తున్నదనే విషయాన్ని కూడా పోలీసులు విస్మరించడాన్ని విమర్శిస్తున్నారు. ఆ వీడియోలోని దృశ్యాల ప్రకారం..విమానాశ్రయం వైపునకు వెళ్తున్న సీఎం కాన్వాయ్‌కు ఓ పోలీస్ అధికారి ట్రాఫిక్ క్లియరెన్స్ ఇచ్చారు. ఈ క్రమంలో ఆ దిశగా వెళ్తున్న ఓ అంబులెన్స్‌ను నిలిపివేశారు. సీఎం కాన్వాయ్‌ను నిలిపివేసి అంబులెన్స్‌ను పంపించాలని మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి ట్రాఫిక్ పోలీసులతో వాదించినా వారు పట్టించుకోలేదు. కాగా, జూన్‌లో బెంగళూర్ ట్రినిటీ సర్కిల్ రోడ్‌లో ప్రయాణిస్తున్న భారత రాష్ట్రపతి కాన్వాయ్‌ను ఓ ట్రాఫిక్ పోలీస్ అధికారి నిలిపివేశారు. ఆ దిశగా వెళ్తున్న అంబులెన్స్‌కు దారి ఇచ్చారు. సామాజిక మాధ్యమాల్లో కనిపించిన ఈ దృశ్యాలను నెటిజన్లు ప్రశంసించారు. మే నెలలో కర్నాటకలోని టౌన్‌హాల్ ప్రాంతంలో ఆ రాష్ట్ర సీఎం సిద్ధరామయ్య కాన్వాయ్‌ను నిలిపివేసిన ట్రాఫిక్ పోలీసులు అంబులెన్స్‌కు దారి ఇచ్చారు.

చరిత్ర నుంచి మొఘల్స్ పాఠాలు తొలగింపు

మహారాష్ట్ర విద్యా బోర్డు నిర్వాకం



న్యూఢిల్లీ : కొద్ది నెలల క్రితం రాజస్తాన్ విశ్వవిద్యాలయానికి చెందిన చరిత్ర విభాగం తయారుచేసిన పాఠ్యాంశాలలో మహారాణా ప్రతాప్ అక్బర్ చక్రవర్తిపై హల్దీఘాటీ యుద్ధరంగంలో ఓడించివేశాడని చేర్చగా ఇవాళ మహారాష్ట్ర విద్యా శాఖ బోర్డు చరిత్ర పాఠ్యాంశాల నుంచి మొఘల్స్ చక్రవర్తి గురించిన వివరాలను కేవలం మూడు వాక్యాలకు పరిమితం చేసింది. దాదాపుగా పాఠ్యప్రణాళికలో మొఘల్ చరిత్రకు స్థానం లేకుండా చేసింది. చరిత్ర వక్రీకరణలో వాస్తవాలను మభ్యపెట్టడమే కాదు, మటుమాయం చేయగలమని బీజేపీ పాలకులు మరోసారి నిరూపించుకున్నారు. ముంబయ్ మిర్రర్ రిపోర్టు ప్రకారం 7, 9 తరగతుల చరిత్ర పాఠ్యపుస్తకాలను బోర్డు ఈసారి మార్పుచేసింది. వాటిలో మొఘలాయి సామ్రాజ్యపు జాడలు కూడా లేకుండా మార్చివేసింది. దాని స్థానంలో శివాజీ నేతృత్వంలోని మరాఠా సామ్రాజ్యం గురించిన అంశాలు చోటు సంపాదించుకున్నాయి. సంవత్సరం క్రితం వరకూ అక్బర్ పాలనలో స్వేచ్ఛ, మత సామరస్యం పుష్కలంగా ఉండేవని చదువుకున్న విద్యార్థులు కొత్త సంవత్సరంలో ఆయన దేశమంతటా తన పాలనా పంజాను విసరటానికి సిద్ధపడిన వాడిగా చదువుకోవాల్సి ఉంటుంది. అక్బర్‌ను ఎదిరించి నిలిచిన వీరుల్లో రాణా ప్రతాప్ పేరు, మరికొన్ని ప్రస్తావనకు వచ్చాయి. ఇప్పటివరకు ప్రజా రాజుగా మాత్రమే కీర్తిని అందుకున్న శివాజీ మహారాజు ఇప్పుడు ఆదర్శప్రాయుడైన పాలకుడి అవతారంలో కనిపిస్తారు. ఆయన గురించి, ఆయన కుటుంబం గురించి, ఇతర మరాఠా సైనికనేతల గురించిన పాఠ్యభాగాలను గణనీయంగా పెంచినట్టు తెలుస్తున్నది. 7వ తరగతి పాఠ్యపుస్తకాల్లో మొఘల్ పాలనకు ముందున్న ముస్లిం పాలకుల ప్రస్తావన పూర్తిగా తొలగించబడింది. అలా తొలగించబడిన అంశాల్లో రజియా సుల్తానా (ఢిల్లీని పాలించిన తొలి ముస్లిం మహిళ), మొహమ్మద్ బిన్ తుగ్లక్ వంటి వారి అంశాలు కూడా ఉన్నాయి. ఆఫ్ఘన్ పాలకులు మొట్ట మొదటి సారి ప్రవేశపెట్టిన రుపయా, హుమాయూన్‌ను దేశం నుంచి పారిపోయేలా తరిమికొట్టిన షేర్ షా సూరి ప్రస్తావనే లేదు. ఇక 9వ తరగతికి ప్రవేశపెట్టిన తాజా పుస్తకంలో బోఫోర్స్ కుంభకోణం, ఎమర్జెన్సీ పాలనల పాఠ్యాంశాలు చోటు సంపాదించుకున్నాయి. ఆధునిక చరిత్రకు స్థానం కల్పించేందుకే ఈ మార్పులు చేయవలసి వచ్చిందని హిస్టరీ పాఠ్య ప్రణాళిక రూపకల్పన కమిటీ సభ్యుడు బాపూ సాహెబ్ షిండే వివరణ ఇచ్చారు. ఇక కమిటీ చైర్మన్ సదానంద మోరే వివరణ ఇస్తూ మహారాష్ట్ర కేంద్రంగా చేసుకుని వాస్తవాలకు చరిత్రలో ప్రాధాన్యత ఇవ్వవలసి వచ్చిందని అన్నారు.అది ఢిల్లీ సల్తాన్ రజియా అయినా, మొఘల్ పాలన అయినా మహారాష్ట్ర ప్రధానంగా చరిత్ర పుస్తకాలను మార్చినట్టు ఆయన చెప్పారు. ఈ వక్రీకరణలో దేశమంతటా కాషాయ జెండాలు తప్ప మరేవీ కనిపించకుండా పోతుందని చరిత్ర పాఠ్యపుస్తకాల విశ్లేషకుడు, పూనేకు చెందిన కిషోల్ దారక్ ఆరోపించారు.



'మహా' విషాదం

తల్లిని చూద్దామని వచ్చిన ఎన్ఆర్ఐ

అస్థిపంజరాన్ని చూసి...

ముంబయి : 'మహా' నగరంలో హృదయ విదారక ఘటన వెలుగులోకి వచ్చింది. అమెరికాలో పనిచేస్తున్న ఐటీ ఉద్యోగి తల్లిని చూసేందుకు ముంబయికి వచ్చాడు.. ఇంటి కాలింగ్ బెల్ ఎంతసేపు కొట్టినా స్పందనలేదు. చేసేది లేక తలుపు పగులగొట్టి చూశారు. బెడ్‌రూమ్‌లో తల్లి అస్తిపంజరం కనిపించడంతో విస్తుపోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తల్లిని చూసేందుకు అమెరికా నుంచి ఆదివారం మధ్యాహ్నం నాలుగున్నర గంటలకు ఆమె నివాసముంటున్న ఫ్లాట్‌కు రీతూరాజ్ సహానీ చేరుకున్నాడు. కాలింగ్ బెల్‌ను ఎంతసేపు కొట్టినా స్పందనలేదు. దాంతో తలుపును పగులగొట్టించాడు. తలుపుతీసేసరికి దుర్వాన వస్తోంది... బెడ్‌రూమ్‌లోకి వెళ్ళిచూడగా.. మంచం మీద తల్లి ఆషా సహాని (63) అస్తిపంజరం కనిపంచింది. కొద్ది వారాల క్రితమే ఆమె మృతిచెంది ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే, ఆమె ఎప్పుడు చనిపోయి ఉంటుందనేది పోస్టుమార్టం నివేదికలో తెలుస్తుందని వారు చెప్పారు. ఓషివర అపార్టుమెంటు పదో అంతస్తులు ఆషా సహాని నివసిస్తున్నారు. ఈ అపార్టుమెంటులో ఆమెకు రెండు ఫ్లాటులు ఉన్నాయి. ఫ్లాట్‌లో నుంచి ఎలాంటి వాసనా రాలేదు... పక్కింటివారూ పట్టించుకోలేదు. ఆషా సహాని భర్త కేదార్ సహాని 2013లో మృతిచెందారు. అప్పటినుంచి ఆమె ఒంటరిగా ఉంటున్నారు. 2016 ఏప్రిల్‌లో చివరిసారిగా తాను తల్లితో మాట్లాడానని రీతూరాజ్ సహానీ చెప్పారు. ఈ విషాద ఘటన పలు ఇబ్బందికర వాస్తవాలను వెలుగులోకి తెచ్చింది. దేశంలో వృద్ధులకు సంరక్షణ లేకుండాపోవడం ఒకటైతే.., ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోవడం, తల్లిదండ్రులను సైతం పట్టించుకోలేనంత బిజీగా మారిపోతున్న పట్టణ జీవితాలకు తోడు, ఇరుగుపొరుగువారి మధ్య తగ్గిపోతున్న సంబంధాలను బట్టబయలుచేసింది. భారతదేశంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని 15 వేల మంది వృద్ధులపై జరిపిన సర్వేలో దాదాపు సగం మంది (47.49 శాతం) ఒంటరి తనం ఫీలవుతున్నట్టు ఇటీవల జరిపిన తమ సర్వేలో తేలిందని ఏజ్‌వెల్ ఫౌండేషన్ తేలింది. నగరాల్లో వృద్ధుల జనాభా 64.1 శాతంగా ఉంది. వీరిలో ఎక్కువ శాతం మంది పిల్లలు విదేశాల్లో సెటిలవ్వడం, లేదా వారికి దూరంగా ఉండటం జరుగుతోంది. తోడు లేకపోవడంతో వృద్ధుల్లో ఎక్కువ శాతం మంది ఓల్డేజ్ హోమ్స్‌లో ఉండటానికి ఇష్టపడుతున్నట్టు సర్వే పేర్కొంది.



కీలక వైద్య సేవలపైనా జీఎస్టీ భారం

న్యూఢిల్లీ : సాధారణంగా ఎక్కువ ఖరీదైన వైద్య సేవలు జీఎస్టీ దెబ్బతో మరింత భారంగా మారనున్నాయి. ముఖ్యంగా కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అవసరమైన డయాలిసిస్ సేవలు, హృదయ సంబంధ వ్యాధులకు గురైన వారికి అమర్చే పేస్ మేకర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ వ్యయం, ఆర్థోపీడిక్స్ వైద్యంలోను, క్యాన్సర్ రోగులకు అందించే ప్రాణరక్షక పరికరాలపై జీఎస్టీ భారం తప్పదని ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పష్టంచేసింది. వైద్య, ఆరోగ్య రంగంపై జీఎస్టీ ప్రభావం గురించి మంత్రిత్వ శాఖకు అనుబంధంగా ఉన్న జీఎస్టీ విభాగం సమాధానం ఇస్తూ, ఈ సమాచారం అందించింది. అయితే మరో ప్రశ్నకు జవాబుగా, ప్రాణరక్షక ఔషధాలు, ఆరోగ్య సంబంధింత సేవలు కొన్ని, వైద్యపరికరాలపై జీఎస్టీ నుంచి మినహాయింపు ఉంటుందని తెలిపింది. డయాలిసిస్ పరికరాలపై 5 నుంచి 12 శాతం వరకూ, పేస్ మేకర్‌పై 12 నుంచి 18 శాతం వరకూ, ఆర్థోపీడిక్స్ సపోర్టు పరికారలపై 5 నుంచి 12 శాతం, బ్లడ్ క్యాన్సర్ మినహా ఇతర క్యాన్సర్ చికిత్సలో ఉపయోగించే అన్ని పరికరాలపై పన్ను భారం ఉండదు. వీటనిపై పన్ను భారం పడుతుందని ఈ విభాగం స్పష్టం చేసింది. హెపటైటిస్ గుర్తింపు కోసం ఉద్దేశించిన పరికరాలు మినహా మిగిలిన అన్ని రకాలైన కీలక వ్యాధి నిర్ధారణ పరీక్షలకు ఉపయోగించే పరికరాలపై 28 శాతం జీఎస్టీ భారం పడుతుంది. ఈ కారణంగా ఈ పరికరాలతో అందించే వేద్య సేవలు మరింత భారం కాక తప్పదు. అయితే వైద్య సేవల కోసం దేశంలోకి పర్యాటకులను ప్రోత్సహించేందుకు వీలుగా బీమా భారం, మందుల సరఫరా, అంతర్జాతీయ వైద్య పర్యటనలపై భారం తగ్గించారు.

అహ్మద్ పటేల్ గెలుపుపై కాంగ్రెస్ ధీమా

అహ్మదాబాద్: గుజరాత్ రాజ్యసభ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీనియర్ నేత అహ్మద్ పటేల్ గెలుపుపై ఆపార్టీ ధీమా వ్యక్తం చేసింది. కాగా, రాజ్యసభ ఎన్నికలో గుజరాత్ కాంగ్రెస్ అభ్యర్థులను ప్రలోభాలకు గురిచేసేందుకు బీజేపీ ప్రయత్నించింది. 57మంది శాసన సభ్యుల్లో ఆరుగురు రాజీనామా చేయడంతో ఇక్కడి రాజకీయ పరిణామాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఆరుగురు శాసనసభ్యుల్లో ముగ్గురు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈనేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఆత్మరక్షణలో పడింది. మిగతా ఎమ్మెల్యేలను బీజేపీ ఉచ్చులోపడకుండా కాపాడుకునేందుకు వీలుగా గతనెల 29న కర్నాటకకు తరలించింది. వారందరినీ కర్నాటకలోని ఓ రిసార్ట్‌లో ఉంచింది. కర్నాటక విద్యుత్ శాఖ మంత్రి డీకే శివకుమార్, ఎంపీ డీకే సురేష్ వారికి ఆశ్రయం కల్పించారు. సోమవారం ఆ ఎమ్మెల్యేలంతా తిరిగి గుజరాత్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా అహ్మద్ పటేల్ మాట్లాడుతూ...గుజరాత్ ఎమ్మెల్యేలను బెంగళూరుకు తరలించడాన్ని సమర్థించుకున్నారు. తామెప్పుడూ ఇలాంటి పరిస్థితులను చూడలేదన్నారు. బీజేపీ కూడా గతంలో ఇలాంటి క్యాంపు రాజకీయాలు చేసిందనే విషయాన్ని గుర్తు చేశారు.

అయితే, తాము మాత్రం తప్పనిసరి పరిస్థితుల్లోనే ఎమ్మెల్యేలను బెంగళూరుకు తరలించి అక్కడి నుంచి తిరిగి తీసుకువచ్చామని అన్నారు. అహ్మదాబాద్‌లోని ఖాందాలీ రిసార్ట్‌లో గుజరాత్ ఎమ్మెల్యేలు తమ కుటుంబ సభ్యులతో కలిసి రక్షాబంధన్ పండుగను జరుపుకున్నారని అన్నారు. డీఎస్పీ స్థాయి అధికారి నేతృత్వంలో ఖాందారీ రిసార్ట్‌లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్టు ఎస్పీ సౌరభ్‌సింగ్ తెలిపారు.

ఇదిలా ఉండగా, రాజ్యసభలో ఖాళీ అయిన మూడు ఎంపీ స్థానాల భర్తీ కోసం గుజరాత్‌లో మంగళవారం ఎన్నిక జరగనుంది. బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ రెండు స్థానాల్లో పోటీ చేస్తున్నారు.

చేనేత కార్మికుల సంక్షేమానికి పెద్దపీట

ఎస్ఆర్‌టీఐ అభివృద్ధికి రూ.10కోట్లు

చేనేత వాక్‌లో మంత్రులు జగదీశ్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు

- కార్మికుల సన్మాన సభకు మంత్రులు డుమ్మా
- కార్మికుల ఆగ్రహం



ప్రదర్శనలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, జగదీశ్‌రెడ్డి

నవతెలంగాణ-భూదాన్‌పోచంపల్లి

చేనేత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపేట వేస్తున్నదని విద్యుత్‌శాఖ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు సోమవారం చేనేత మార్నింగ్ వాక్ నిర్వహించారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ చేనేత వస్త్రాలకు దేశదేశాల్లో గుర్తింపు తీసుకురావడానికి ప్రతి కార్మికుడు కృషి చేయాలన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చేనేత కార్మికులు దుర్భర పరిస్థితులలో ఉన్నారని, ఇప్పుడు వారికి ప్రభుత్వం పని కల్పిస్తూ ఆదుకునే దిశగా కృషి చేస్తున్నదన్నారు. మంత్రి కేటీ ఆర్ పిలుపు మేరకు ప్రతి సోమవారం ప్రతి ఒక్కరూ చేనేత దుస్తులను ధరించి కార్మికులకు చేయూతనివ్వాలని కోరారు.

ఎస్ఆర్‌టీఐకి రూ.10కోట్లు..

స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ స్థాయిని పెంచేందుకు కృషి చేస్తామని అందుకు రూ.10కోట్లు కేటాయించినట్టు మంత్రులు జగదీశ్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు అన్నారు. స్వామి రామానందతీర్థ గ్రామీణ యూనివర్సిటీని వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ సంస్థలో వేల మంది నిరుద్యోగులు శిక్షణ పొంది ఉపాధి పొందాలన్నారు. ఉపాధి ఆధారిత కోర్సులను అందిస్తూ స్వయం ఉపాధి పొందేలా కమ్యూనికేషన్ స్కిల్స్ అందించాలని సూచించారు. ప్రస్తుతం సంస్థలో 300మందికి ఉచిత భోజన సౌకర్యంతో కోర్సులను అందిస్తున్నారని, ఒక బ్యాచ్‌లో కనీసం 1000మంది శిక్షణ పొందేలా మెరుగుపర్చేందుకు రూ.10కోట్లు కేటాయించామని తెలిపారు. ఎస్ఆర్‌టీఐలో ఐదెకరాలను డ్రైవింగ్ స్కూల్‌కు కేటాయించి నిరుద్యోగులకు శిక్షణ ఇవ్వాలన్నారు. సంస్థ డైరెక్టర్ కిశోర్‌రెడ్డి మాట్లాడుతూ లక్షా 30వేల మందికి శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. అందులో ఎంతోమంది వివిధ సంస్థలో ఉపాధి పొందారని తెలిపారు.

కార్మికుల నిరసన

చేనేత జాతీయ దినోత్సవం సందర్భంగా జౌళిశాఖ ఆధ్వర్యంలో చేనేత కార్మికుల సన్మాన సభ నిర్వహించారు. చేనేత వాక్‌లో పాల్గొన్న మంత్రులు సన్మాన సభకు రాకుండా ఎస్ఆర్‌టీఐ సందర్శనకు వెళ్లారు. దీంతో చేనేత కార్మికులు కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం వద్ద రహదారిపై ధర్నా నిర్వహించారు. కార్మికులు మాట్లాడుతూ చేనేత వాక్‌లో పాల్గొన్న మంత్రులు సన్మాన సభకు రాకుండా పోవడం కార్మికులపై వారికి ఏమాత్రం ప్రేమ ఉందో తెలిసిం దన్నారు. కార్మికుల సమస్యలను పక్కన పెట్టిన ప్రభు త్వం వాటిని పరిష్కరిస్తున్నామని మభ్యపెడు తుందని ఆరోపించారు. కనీసం ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి, ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి కూడా హాజరుకాకపోవడం తమకు నిరాశ కలిగిం చిందన్నారు.

ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలి

- మంత్రి కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రతి ఒక్కరూ విధిగా చేనేత వస్త్రాలను ధరించాలని రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సోమవారం పీపుల్స్ ప్లాజాలో జరిగిన సంబురాల్లో చేనేత వస్త్ర ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. చేనేతను ప్రోత్సహిస్తామంటూ ఈ సందర్భంగా అందరితో ప్రతిజ్ఞ చేయించారు. దేశంలో వ్యవసాయం తర్వాత ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్నది చేనేత రంగమని చెప్పారు. చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ రంగాన్ని ప్రోత్సహించడానికి రూ. 1,280 కోట్ల బడ్జెట్ కేటాయించామన్నారు. 1905 ఆగస్టు 7న స్వదేశీ ఉద్యమం ప్రారం భమైందని గుర్తుచేశారు. అందుకే ఆగస్టు 7 ను జాతీయ చేనేత దినోత్స వంగా కేంద్రం ప్రకటించిందని తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం రూ. 100 కోట్లతో నిధి ఏర్పాటు చేశామన్నారు. 3 వేల మంది చేనేత కార్మికుల రుణాల మాఫీ కోసం రూ. 1,500 కోట్లు కేటాయిం చామని వెల్లడించారు. వచ్చే ఏడాది నుంచి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరిట 30 మంది కార్మికులకు అవార్డులు ఇవ్వనున్నట్టు ఆయన ప్రకటిం చారు. ఇప్పటికే దాదాపు 40 వేల మంది నేత కార్మికులకు పెన్షన్లు ఇస్తున్నామని తెలిపారు. ముడి సరుకుపై 50 శాతం రాయితీ ఇస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా.'వీవర్ జిందాబాద్' పుస్తకాన్ని, తెలంగాణ చేనేత, మరనేత వైభవ గీతాల సీడీని మంత్రి ఆవిష్కరించారు.

లండన్‌లో ఘనంగా జయశంకర్ జయంతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ సిద్ధాంత కర్త, కి.శే ప్రొఫెసర్ జయశంకర్ జయంతి లండన్‌లో ఘనంగా నిర్వహించారు. గ్రేట్ బ్రిటన్ నలుమూలల నుంచి తెలంగాణ వాదులు, ఆయన అభిమా నులు పాల్గొన్నారు జయశంకర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. గ్రేట్ బ్రిటన్ ఎన్ఆర్ఐ ఫోరం ప్రతినిధులు సురేష్ గోపతి, సీకే చంద్రశేఖర్, గోలి తిరుపతి, రంగు వెంకట్ మాట్లాడుతూ తెలంగాణ భావజాల వ్యాప్తిలో జయశంకర్ పాత్ర గొప్పదని, తెలంగాణ ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేసిన ఆ జన్మబ్రహ్మచారి కొత్తపల్లి జయశంకర్ అని అభిప్రాయపడ్డారు. నాన్ ముల్కీ ఉద్యమం నుంచి మలిదశ తెలంగాణ సాధన పోరాటం వరకు ఆయన పాత్ర చిరస్మరణీ యమని గుర్తు చేశారు. చివరి వరకు తెలంగాణ రాష్ట్ర సాధన కోసమై పనిచే సారని, అదే ఆశయసాధనలో తుదిశ్వా స విడిచారని కొనియా డారు.



ఆయన రాష్ట్రం ఏర్పడ్డాక మన మధ్య లేకపోవ డం బాధాకరమని చెప్పారు. తెలంగాణ యూకే జాగతి అధ్యక్షులు సుమన్ బలమూరి, సభ్యులు లండన్ గణేష్ , అధ్యక్షులు స జనారెడ్డి చాడ, మధు అందేం, భారతి ముఖ్య అతిధులుగా, స్థానిక తెలందాణ వాదులు భాస్కర్ మొట్ట , ప్రశాంత్ , శ్రీధర్ , రఘు నక్కల, నరేష్ మర్యాల ,వేణురెడ్డి పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు కోరుతూ నేడు, రేపు రాష్ట్రవ్యాప్త ధర్నాలు

- ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పిలుపు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

కాంట్రిబ్యూటరీ పింఛన్ పథకం (సీపీఎస్) రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఈనెల 8,9 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు, ర్యాలీలు నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) కోరింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చింది. ఈమేరకు ఆ కమిటీ నాయకులు నర్సిరెడ్డి, చావరవి(టీఎస్‌యూటీఎఫ్), బి కొండల్‌రెడ్డి, మనోహర్‌రాజు(టీపీటీఎఫ్), ఎం శంకర్‌రెడ్డి, ఎంఎస్ కిష్టప్ప(డీటీఎఫ్), యు పోచయ్య, డి సైదులు(టీఎస్‌ఎఫ్‌టీఎస్) సయ్యద్ షౌకత్‌అలీ, నరసింహారావు (టీఎస్‌పీటీఏ), డి.ఉపేందర్, కొమ్ము రమేష్(బీటీఎఫ్), ఎండీ ముజిబుర్ రహమాన్ (టీయూటీఏ) జాడి రాజన్న, జాదవ్ వెంకట్రావ్ (ఎస్సీఎస్టీటీయూ-టీ), విజయసాగర్, సుధాకర్‌రెడ్డి (టీజీపీఈటీఏ) తదితరులు సోమవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు.

సింగరేణి సీఎండీని వెంటనే బదిలీ చేయాలి

- వేల కోట్ల అవినీతిలో శ్రీధర్‌ది కీలకపాత్ర
- అక్రమ బదిలీలను తక్షణం నిలిపేయాలి: ఐదు జాతీయ కార్మిక సంఘాల డిమాండ్



నవతెలంగాణ-గోదావరిఖని

కాలపరిమితి ముగిసినా కుర్చీనే పట్టుకుని వేలాడుతూ, కార్మికుల పట్ల నిరంకుశ విధానాలను అవలంభిస్తున్న సింగరేణి సీఅండ్ఎండీ శ్రీధర్‌ను వెంటనే బదిలీ చేయాలని ఐదు జాతీయ కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. సింగరేణి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి (సీఐటీయూ), ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వై.గట్టయ్య, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాద్ అహ్మద్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.జనక్ ప్రసాద్ మాట్లాడారు. వారసత్వం కోసం ముందుండి పోరాడిన నాయకులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అందులో భాగంగానే కార్మిక సంఘాల నాయకుల అక్రమ బదిలీలకు తెరలేపారని చెప్పారు. సింగరేణిలో అమలవుతున్న ప్రతి సంక్షేమ పథకాల్లోనూ కోట్ల రూపాయల అవినీతి జరుగుతోందని, హరితహారంలో రూ.100 కోట్లు పక్కదారి పట్టాయని తెలిపారు. టీబీజీకేఎస్‌తో కుమ్మక్కైన సీఎండీ చట్టానికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నాడని, ఐదేండ్లుగా త్రైపాక్షిక సమావేశాలు ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు.

జాతీయ సంఘాల ఐక్యతను దెబ్బతీయడం ఎవరికీ సాధ్యం కాదన్నారు. శ్రీధర్ పదవీబాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఒక్కసారి కూడా గనులను సందర్శించలేదని, కార్మికుల రక్షణ చర్యలపై నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. బదిలీ ప్రక్రియను రద్దు చేయాలని, లేనిపక్షంలో సింగరేణిలో మరోసమ్మె తప్పదని హెచ్చరించారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు రాజ్‌కుమార్, మచ్చయ్య, ఏఐటీయూసీ నాయకులు ఎల్. ప్రకాష్, జి.ప్రభుదాస్, రమేష్, హెచ్ఎంఎస్ నాయకులు, ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

సంపాదకీయం

బీజేపీ వికృత క్రీడ



పార్టీలను చీల్చడంలోనూ, ఫిరాయింపులను ప్రోత్సహించడంలోనూ బీజేపీ కాంగ్రెస్‌ను మించిపోయింది. కమలనాథుల ధాటికి ఇప్పుడు ఆ కాంగ్రెస్ పార్టీ నేతలే విలవిలలాడుతున్నారు. గుజరాత్‌లో రాజ్యసభ స్థానం కోసం మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వ పన్నాగాలు చూస్తే ప్రజాస్వామ్య విలువలు ఏ స్థాయికి పతనమయ్యాయో అర్థమవుతుంది. కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన అహ్మద్ పటేల్‌ను ఎలాగైనా ఓడించాలన్న లక్ష్యంతో బీజేపీ ఈ కపట వ్యూహానికి తెరతీసింది. కాంగ్రెస్‌కు 57మంది సభ్యులుండగా, పటేల్ విజయానికి 47 ఓట్లు సరిపోతాయి. ఈ లెక్కలు చూస్తే ఆయన గెలుపు నల్లేరుపై నడకే! అయితే, ఇప్పటికే ఆరుగురు కాంగ్రెస్ ఎంఎల్ఏలను ప్రలోభపరచుకుని కమలనాథులు తమవైపు తిప్పేసుకున్నారు. మరో ఐదుగురితోనూ రాయబేరాలు పూర్తయ్యాయని చెబుతున్నారు. ఈ దశలో కండ్లు తెరచిన కాంగ్రెస్ పార్టీ తమ ఏలుబడిలో ఉన్న కర్నాటకలోని ఒక ఖరీదైన హోటల్‌కు శాసనసభ్యులను తరలించింది. ఈ విషయం బయటకు పొక్కగానే ఆ హోటల్‌తో పాటు, కర్నాటకలోని కాంగ్రెస్ నాయకుల ఇండ్లపైనా ఆదాయపన్ను శాఖ దాడులు చేసింది. అహ్మద్ పటేల్‌ను ఎలాగైనా ఓడించి తీరాలన్న పట్టుదలతో సకల అధికార సంస్థల్ని దుర్వినియోగం చేస్తోంది బీజేపీ.

ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో బీజేపీ ఆడుతున్న ఈ వికృత క్రీడ దేశానికి, ప్రజాస్వామ్య వ్యవస్థకు హానికరం. దేశ వ్యాప్తంగా మేధావులు, ప్రజాస్వామ్య వాదులు ఈ విషయంపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మోడీ ప్రధాని అయ్యాక గుజరాత్‌లో జరుగుతున్న తొలి రాజ్యసభ ఎన్నిక ఇది. అందుకని ఇక్కడ్నుంచి మరో పార్టీ అభ్యర్థి గెలవరాదనే పట్టుదలతో వ్యవహరిస్తోంది బీజేపీ. అంతేగాక ఈ ఏడాది చివరలో గుజరాత్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. కనుక ఇప్పుడు రాజ్యసభకు తమ అభ్యర్థిని గెలిపించుకోవడం కాంగ్రెస్‌కు అనుకూలిస్తుంది. అహ్మద్ పటేల్‌ను ఓడిస్తే కాంగ్రెస్‌ను మానసికంగా పెద్ద దెబ్బ తీయవచ్చన్నది ఆ పార్టీ పథకం. అంతేగాక జనంలోనూ తమ ఆధిక్యతనీ, కాంగ్రెస్ బలహీనతనీ చాటుకోవచ్చు. తద్వారా రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి పొందాలన్నది బీజేపీ వ్యూహం. నిజానికి గుజరాత్‌లో బీజేపీ పట్ల వ్యతిరేకత, జనంలో అసంతృప్తి వ్యక్తమవుతున్నాయి. బీసీ కోటా కోసం పటేళ్ల ఆందోళన మొదలుకొని దళితుల నిరసనలు కొనసాగుతున్నాయి. ఫలితంగా రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఎదురీదాల్సిన పరిస్థితి వుంది. ఈ నేపథ్యంలో మొదట తమకు పోటీదారయిన కాంగ్రెస్‌ని దెబ్బతీయాలని చూస్తున్నది. ఈ నేపథ్యంలోనే అహ్మద్ పటేల్ రాజ్యసభకు ఎన్నిక కాకుండా ఆ పార్టీ అభ్యర్థుల్ని నయానా భయానా బుజ్జగించి ఫిరాయింపులకు ప్రోత్సహించింది. ఫిరాయింపులు దేశంలో కొత్త కాదు. అయితే, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రభుత్వ సంస్థలను ఇంతగా బరితెగించి దుర్వినియోగం చేయడం మాత్రం బీజేపీకే చెల్లింది! పాముకి పాలు పోసి పెంచినా, కాటు వేయడం దాని సహజ లక్షణం! ఫిరాయింపుల వంటి విషసంస్కృతి ఫలాలూ ఇలాగే ఉంటాయి. కాంగ్రెస్ అధికారంలో ఉన్నన్నాళ్లు తమ కెదురులేదని విర్రవీగి, అధికారం ఊడిన తరువాత నీతి వాక్యాలు వల్లె వేయడం వల్ల ప్రయోజనం ఉండదు!

తమది భిన్నమైన పార్టీ అని బీజేపీ నేతలు దేశ ప్రజలకు నమ్మబలికారు. ఇప్పుడు ఆ వంచనాశిల్పంలోని వాస్తవాలు ఒకటొకటిగా బయటపడుతున్నాయి. అసమానతలు పెంచి, ప్రజలకు కష్టాలను మిగిల్చే ఆర్థికవిధానాలను అమలు చేయడంలో కాంగ్రెస్ కన్నా బీజేపీ ఒక అడుగు ముందే ఉన్నది. అధికారం కోసం అంగలార్చే కుహనా రాజకీయ విన్యాసాల్లోనూ కాషాయ పరివారం కాంగ్రెస్ కన్నా రెండాకులు ఎక్కువ తిన్నదన్న విషయమూ ఇప్పుడు తేటతెల్లమవుతోంది. పదవులు ఎర చూపి, డబ్బు వెదజల్లి కాంగ్రెస్ పెంచి పోషించిన ఫిరాయింపుల సంస్కృతిని బీజేపీ మరింత ముందుకు తీసుకువెళ్లింది. నయాన లొంగని వారిని భయానైనా తన దారికి తెచ్చుకుంటోంది. దీనికోసం సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్, ఆదాయపన్ను శాఖ ఇలా అన్ని ప్రభుత్వ సంస్థలను అడ్డగోలుగా వినియోగిస్తున్న తీరు దిగ్భ్రాంతి కలిగిస్తోంది.

అరుణాచల్ ప్రదేశ్‌లో ముఖ్యమంత్రి కుర్చీ కోసం బీజేపీ చేసిన కపట విన్యాసాన్నీ, రాజ్యాంగ వ్యవస్థలను భ్రష్టు పట్టించిన తీరునూ దేశ ప్రజలు ఇప్పుడప్పుడే మరచిపోలేరు. గోవాలో ప్రజాతీర్పును తుంగలో తొక్కి అధికారాన్ని చేజిక్కించుకున్నదీ ఇటీవల పరిణామమే! బీహార్‌లో నితీశ్ అనూహ్యంగా మోడీ భజన చేయడానికీ కేసుల భయమే కారణమన్న ఆరోపణలు వస్తున్నాయి. జయలలిత మరణంతో గందరగోళంగా మారిన తమిళ రాజకీయాల్లో పాగా వేయడానికీ ప్రభుత్వ సంస్థలను బీజేపీ దుర్వినియోగం చేస్తోందన్న విమర్శలూ ఉన్నాయి. ఏపీకి ప్రత్యేకహోదా ఇచ్చేది లేదని తెగేసి చెప్పినా అధికారపార్టీ తానా తందానా అనడానికీ, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ప్రతిపక్షమూ బీజేపీ జెండా మోయడానికీ ఈ తరహా బెదిరింపులు, ప్రలోభాలూ కారణమన్న వాదనలూ ఉన్నాయి.

మతోన్మాదాన్ని రెచ్చగొట్టడం, ప్రజల మధ్య చీలికలు తేవడం, ఆ ఘర్షణల ఆధారంగా అధికార అందలానికి ఎగబాకడం కాషాయ శక్తుల నీతిమాలిన వ్యవహారం. అధికారం అండతో ఇప్పుడు రాజకీయ ప్రత్యర్థులను వెంటాడటానికి, ప్రతిపక్షాల ఉనికి లేకుండా చేయడానికి ప్రభుత్వ సంస్థలను గతంలో ఎన్నడూలేని విధంగా దుర్వినియోగం చేస్తోంది. ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో బీజేపీ ఆడుతున్న ఈ వికృత క్రీడ దేశానికి, ప్రజాస్వామ్య వ్యవస్థకు హానికరం. దేశ వ్యాప్తంగా మేధావులు, ప్రజాస్వామ్య వాదులు ఈ విషయంపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రజావాణి

రైతులపై ప్రేమ ఏదీ?

2014 ఎన్నికలలో గెలవడానికి కార్పొరేట్ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకునీ, ప్రచారాలు చేసుకుని అధికారంలోకి వచ్చారు. కార్పొరేట్ సంస్థల రుణం తీర్చుకోవడానికి పెద్దనోట్లను రద్దు చేశారు. దీంతో జనాల దగ్గర ఉన్న పైసలన్నీ బ్యాంకుల్లోకి పోయాయి. తరువాత బ్యాంకుల నుండి పైసలన్నీ కార్పొరేట్ సంస్థలకు రుణాల రూపంలో ముడుపులు అందాయి. మరి బ్యాంకులలో ప్రజలు వేసుకున్న రద్దు అయిన పైసలకు కొత్త పైసలు ఇవ్వాలి కదా! ఇవ్వాలంటే అసలు బ్యాంకుల్లో పైసలుండాలి కదా! అందుకే కేంద్రం తెలివిగా ఏటీయంలలో పైసలు పెట్టకుండా రోజుకు ఇంత అని లిమిట్ పెట్టి డిజిటల్ ట్రాన్సాక్షన్స్ అని దొంగనాటకాలు ఆడుతూ జనాలకు పైసలు ఇవ్వకుండా బ్యాంకుల చుట్టూ తిప్పుతున్నారు. దీంతో జనాలకు బ్యాంకుల మీద విసుగొచ్చి వాళ్ళదగ్గర ఉన్న మిగతా డబ్బులను బ్యాంకులలో వేయాలంటే జంకుతున్నారు. బ్యాంకులలో పైసలు వేస్తే అవి మళ్లీ రావని ఇంట్లోనే దాచిపెట్టుకుంటున్నారు. దీంతో బ్యాంకులలో అయితే పైసలు కూడా లేకుండా పోయాయి. ఇట్లయితే లాభం లేదని కేంద్రం మళ్లీ నెలకోసారైనా బ్యాంకులలో పైసలు వేసుకోవాలనీ.. తీసుకోవాలనీ... అలా చేయకపోతే బ్యాంకు ఖాతాలు రద్దు చేస్తామని ప్రకటనలు చేసింది. అంతో ఇంతో బ్యాంకులలో పైసలు దాచుకునే ఉద్యోగులు, ఎగువ మధ్య తరగతి ప్రజలను అష్టకష్టాలు పెట్టి ఉన్న పైసలన్నీ దోచుకున్నారు. మొత్తం కథలో బలిపశువులు అయింది రైతులు మాత్రమే. ఇక ఈ ప్రభుత్వాలకు రైతుల మీద ప్రేమ ఎక్కడిది.

సరళ శ్రీనివాస్.

క్రీడలను ప్రోత్సహించాలి

సర్కారు పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీషులో చదవడం, రాయడం రానివారి కోసం 60రోజుల కార్యక్రమం ప్రవేశపెట్టారు. దీనిపై ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇచ్చారు. రెగ్యులర్ సిలబస్ చెబుతూనే వెనుకబడిన విద్యార్థులకు అదనంగా మౌలిక అంశాలు, గణితంలో చతుర్విధ ప్రక్రియలు నేర్పాలని రంగం సిద్ధం చేశారు. దీనివల్ల పాఠశాల విద్యార్థులపై చదువుల ఒత్తిడి అధికమవుతోంది. వారికి మానసిక ఉల్లాసాన్నిచ్చే ఆటలూ సిలబస్‌లో భాగమనే విషయాన్ని విద్యాశాఖాధికారులు మరచిపోతున్నారు. పాఠశాలల్లో క్రీడా మైదానాల ఉనికే లేకుండా పోయింది. విద్యార్థులను ఉల్లాసపరిచే విధంగా ఆటలకు, వ్యాయామ అభ్యాసాలకు కొన్ని పీరియడ్లు కేటాయించాలి. విద్యార్థుల సమగ్రాభివృద్ధికీ, చదువుల ఒత్తిడి నుంచి పిల్లలకు ఉపశమనం కలిగించడానికి ఆటపాటలు, వినోద కార్యక్రమాలు ఎంతో అవసరమనే విషయాన్ని సైకాలజీ చదివిన ఉపాధ్యాయులు కూడా విస్మరిస్తున్నారు. చాలా బాధాకరమైన విషయం ఇది. విద్యార్థి పాఠశాలల నుండి ఇంటికి రాగానే తల్లిదండ్రులు బలవంతంగా హోంవర్క్ చేయిస్తారు. పాఠశాలల్లో ఒత్తిడి దూరం చేసే యోగా, కరాటే, ఆసనాలకు స్థానం కల్పించాలి. చదువుతో పాటు విద్యార్థుల మానసికోల్లాసానికి రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థలు విధిగా కొంత సమయాన్ని కేటాయించేలా రాష్ట్ర విద్యాశాఖ చర్యలను చేపట్టాలి.

గూరుడు అశోక్,
జగిత్యాలజిల్లా.

జెండాలు వేరైనా ఎజెండా ఒక్కటే



జూలకంటి రంగారెడ్డి

యథా బీజేపీ.. తథా టీఆర్ఎస్ సర్కారు అని చెప్పుకోవాల్సి వస్తున్నది. జెండాలు, పార్టీలు, ప్రభుత్వాలు, నాయకులు వేరయినా ఈ రెండు ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు ఒకే విధంగా ఉన్నాయనేది స్పష్టం. ప్రజల్ని మభ్యపెట్టడంలోనూ, అమలు కాని హామీలిచ్చి ఓట్లు దండుకోవడంలోనూ, ఆ తర్వాత వాటిని విస్మరించడంలోనూ మోడీదీ, కేసీఆర్‌దీ ఒకే విధానం.. పార్టీ ఫిరాయింపులు, అవకాశవాద రాజకీయాలను ప్రోత్సహించడంలో ఈ ఇద్దరు నాయకులు పోటాపోటీగా వ్యవహరిస్తున్నారు. అవినీతి, ఆశ్రిత పక్షపాతంలోనూ ఇదే పరంపర కొనసాగుతున్నది.

ప్రజలూ, ప్రజాతంత్రవాదులూ వీరి దివాళాకోరు అవకాశవాద రాజకీయాలను తిప్పికొట్టాల్సిన అవసరమెంతైనా ఉంది. వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తులు, అభ్యుదయవాదులు, మేధావులు, సామాజిక తరగతులు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున కదిలి ఉద్యమిస్తేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న దివాళాకోరు విధానాలను తిప్పికొట్టగలిగే అవకాశముంది.

పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీతో పాటు యజ్ఞాలూ, యాగాలూ, వాస్తులంటూ ప్రజలను వాస్తవ పరిస్థితులకు దూరంగా మూఢనమ్మకాలవైపు మళ్లిస్తున్నది. దేశవ్యాప్తంగా మైనారిటీలు, దళితులపై గో రక్షక దళాల పేరిట దాడులు జరుగుతున్నప్పటికీ మన ముఖ్యమంత్రి ఖండించిన పాపాన పోలేదు. సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ వేముల ఆత్మహత్య చేసుకున్న ఘటన దేశవ్యాప్తంగా సంచలనం కలిగించింది. కేసీఆర్ మాత్రం నోరు మెదపలేదు.

అన్నదాత విలవిల

నేషనల్ క్రైమ్ బ్యూరో విడుదల చేసిన లెక్కల ప్రకారం సరళీకృత ఆర్థిక విధానాలు అమల్లోకి వచ్చిన ఈ 25 ఏండ్లలో మొత్తం 4 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. మోడీ గద్దెనెక్కిన తర్వాత ఈ మూడేండ్లలో వీరి ఆత్మహత్యల పరంపర 40శాతం పెరిగింది. మరోవైపు తెలంగాణలో ఈ మూడేండ్లలో మూడు వేల మంది రైతుల ఉసురు తీసుకున్నారు. అన్నదాతల ఆత్మహత్యల్లో బీజేపీ పాలిత రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ముందున్నప్పటికీ తెలంగాణాలో కూడా ఆత్మహత్యలు కొనసాగుతుండటం అందర్నీ కలవరపరుస్తున్నది. తమ పార్టీ అధికారంలోకి వస్తే స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేస్తామంటూ ఎన్నికలకు ముందు మోడీ 300 సభల్లో చెప్పారు. అదే స్వామినాథన్ హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా సీఎం కేసీఆర్ ఆయన్ను సాదరంగా ఆహ్వానించి, చర్చలు జరిపారు. కానీ స్వామినాథన్ సిఫారసుల అమలులో అటు మోడీ, ఇటు కేసీఆర్ విఫలమయ్యారు. భూనిర్వాసితులకు 2013 భూసేకరణ చట్ట ప్రకారం పరిహారం ఇవ్వకుండా కొత్త చట్టాలు తీసుకొచ్చి వారి పొట్ట కొడుతున్నారు. న్యాయమైన పరిహారం కోసం పోరాటాలు సాగిస్తే కేసులు పెడుతున్నారు.

అందని ద్రాక్షలా విద్య, వైద్యం

అందరికీ విద్య, వైద్యం అందిస్తామని హామీనిచ్చి పేద ప్రజలకు అందకుండా కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారు. అధిక ఫీజులు చెల్లించలేక పేద, మధ్యతరగతి ప్రజలు విద్య, వైద్యానికి దూరమౌతున్నారు. రాష్ట్రంలో కేజీ టు పీజీ వరకూ ఉచిత విద్యనందిస్తానని చెప్పి ఉన్న ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే నెపంతో మూసివేస్తున్నారు.

ఉపాధి లేమి

బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రతీయేడాది రెండు కోట్ల మందికి ఉద్యోగాలిస్తామని హామీనిచ్చి విఫలమయ్యారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలు 56వేల మందిని ఉద్యోగాల్లోంచి తొలగించాయి. ఒక అంతర్జాతీయ సంస్థ సర్వే ప్రకారం... ఇండియాలో రాబోయే ఐదారు సంవత్సరాల్లో ఐటీ రంగంలో 60శాతం ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది. మరోవైపు ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీల్లో ప్రతియేటా 20వేల మందికి వేతనాలు చెల్లించటం లేదని గణాంకాలు చెబుతున్నాయి. దేశంలో అనేక పరిశ్రమలు మూతపడి ఉన్న ఉద్యోగాలు ఊడిపోయి జనం వీధిన పడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ఉద్యమ సమయంలోనూ, అటు తర్వాత ఎన్నికలప్పుడూ ఇంటికో ఉద్యోగం ఇస్తామంటూ ఊదరగొట్టారు. కానీ ఈ మూడేండ్ల కాలంలో ఒక్క పోలీస్ డిపార్టుమెంటులో తప్ప మిగతా ఏ శాఖలోనూ ఖాళీలను భర్తీ చేయలేదు. సింగరేణి వారసత్వ ఉద్యోగాలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను హైకోర్టు కొట్టేసింది. గ్రూప్-2 ఉద్యోగాలు, గురుకుల పోస్టుల పరీక్షలు వాయిదా పడ్డాయి. డీఎస్సీ ఊసేలేదు. నిజాం షుగర్స్, సిర్పూర్ కాగజ్‌నగర్ పేపర్ మిల్లు, వరంగల్‌లో రేయాన్ పరిశ్రమ మూతబడటంతో వేలాది కుటుంబాలు రోడ్డునపడ్డాయి. టీఆర్ఎస్ విధానాల వల్ల వేలాది చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూతపడి కార్మికులు ఉపాధి కోల్పోయారు.

నామమాత్రపు కేటాయింపులు..

ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బడుగు, బలహీనవర్గాల ప్రజల బతుకులు చాలా దయనీయంగా మారాయి. వీరి సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో నామ మాత్రంగానే కేటాయించారు. ఆ నిధులు కూడా పక్కదారి పట్టిస్తూ ఆ ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నారు. సబ్‌ప్లాన్ కింద కేటాయించిన నిధులు కూడా ఖర్చు చేయలేదు.

మహిళలపై పెరుగుతున్న దాడులు..

దేశంలో, రాష్ట్రంలో రోజురోజుకూ మహిళలపై దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలు పెరుగుతున్నాయి. వాటిని అరికట్టడంలో ఈ ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల చట్టం తెచ్చేందుకు పాలకులు సిద్ధంగా లేరు. రాష్ట్ర మంత్రివర్గంలో ఒక మహిళకు కూడా ప్రాతినిధ్యం కల్పించలేకపోయారు. స్త్రీలకు సమాన హక్కులు లేవు. రానురాను పురుషుల కంటే స్త్రీల జనాభా తగ్గిపోతోంది.

పెరుగుతున్న నిత్యావసరాల ధరలు..

నిత్యావసర వస్తువుల ధరలు హద్దూ పద్దూ లేకుండా



పెరిగిపోతున్నాయి. వీటిని నియంత్రించేందుకు ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. పైగా వంటగ్యాస్‌పై సబ్సిడీ ఎత్తివేసేందుకు కేంద్రం పూనుకుంటోంది. ఎటు చూసినా కల్తీ సరుకులు విచ్చలవిడిగా మార్కెట్లో చలామణీ అవుతున్నాయి. ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించలేక పోతున్నాయి.

జీఎస్టీ, పెద్ద నోట్ల రద్దు

కేంద్ర ప్రభుత్వం గత కొద్ది నెలలుగా చేపట్టిన చర్యలు దేశ, రాష్ట్ర ప్రజల ఆర్థిక స్థితిగతులపై పెను ప్రభావాన్ని చూపాయి. ఈ రెండింటి వల్ల ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందుల గురించి పట్టించుకోని టీఆర్ఎస్ సర్కారు.. గుడ్డిగా తలూపింది. పేద, సాధారణ, మధ్య తరగతి ప్రజల జీవితాలను అతలాకుతలం చేసిన పెద్దనోట్ల రద్దు మోడీ చెప్పిన లక్ష్యాల్లో ఏ ఒక్కదాన్నీ నెరవేర్చలేకపోయింది. జీఎస్టీ వల్ల రాష్ట్రంలోని గ్రానైట్, వస్త్రాలు, బీడీ, చేనేత తదితర రంగాలపై తీవ్ర ప్రభావం పడినప్పటికీ వీటి గురించి కేంద్రం ఆలోచించలేదు. ఆయా రంగాలకు చెందిన వారందరూ జీఎస్టీని వ్యతిరేకిస్తూ సమ్మెలు, ధర్నాలు, ప్రదర్శనలు చేసినప్పటికీ టీఆర్ఎస్ సర్కారు పట్టించుకోలేదు. సాగునీటి ప్రాజెక్టులపై విధించిన పన్నుల విషయంలో పునరాలోచించాలని తాజాగా కేంద్రానికి విన్నవించింది. జీఎస్టీ వలన బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో పార్కింగ్ ఫీజుల దగ్గర్నుంచి నిత్యావసర వస్తువుల ధరల వరకూ అన్నింటి ధరలూ ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతున్నాయి. సామాన్య, మధ్యతరగతి ప్రజలు కొనుక్కోవడానికి అవకాశం లేకుండా పోతోంది.

ఫిరాయింపులు, బెదిరింపులు

బీజేపీ, టీఆర్ఎస్ పార్టీలు పోటీ పడి పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నాయి. ప్రతిపక్షాలను తమ వైపు తిప్పుకోవడానికి రకరకాల ఒత్తిళ్లు, బెదిరింపులకు పాల్పడుతున్నాయి. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు గొడ్డలిపెట్టు. గోవా, మణిపూర్ రాష్ట్రాల్లో బీజేపీ వ్యవహరించిన తీరు, బీహార్‌లో నితీశ్‌ను బుట్టలో వేసుకోవటం, తాజాగా తమిళనాడులో అన్నా డీఎంకేను లోబరుచుకోవటం తదితరాంశాలు దేశ ప్రజానీకాన్ని విస్తుపోయేలా చేస్తున్నాయి. ఇదే తీరులో ఇక్కడ టీఆర్ఎస్.. కాంగ్రెస్, టీడీపీ, ఇతర పార్టీల ఎంపీలు, ఎమ్మెల్యేలను తమ బుట్టలో వేసుకుని మంత్రి పదవులు కట్టబెట్టటం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయటం సర్వసాధారణ అంశమైంది.

తిరిగి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావాలనే ఆరాటంతో బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలను, ప్రతిపక్షాలను బలహీనపర్చుతూ కేంద్ర ప్రభుత్వం అనేక రకాల ఆటంకాలు కల్పిస్తున్నది. సీబీఐని ఉపయోగించి ప్రతిపక్షాల నాయకులపై కేసులు బనాయించి తమవైపు లొంగదీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కార్పొరేట్ శక్తులు, కాషాయ శక్తులు బలపడటానికి అన్ని విధాలుగా తోడ్పడుతున్నారు.

టీఆర్ఎస్ సర్కార్ కూడా రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి రావడానికి అనేక అడ్డదారులు తొక్కుతూ అవకాశవాద రాజకీయాలు చేస్తున్నది. ప్రజా ఉద్యమాలను నిరంకుశంగా అణగదొక్కే ప్రయత్నం చేస్తూ తప్పుడు కేసులు బనాయిస్తున్నారు. వీటన్నింటినీ పరిశీలిస్తే కేంద్రంలోనున్న బీజేపీ, రాష్ట్రంలోని టీఆర్ఎస్ ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు ఒకే విధంగా ఉందనేది స్పష్టమౌతోంది. ప్రజలూ, ప్రజాతంత్రవాదులూ వీరి దివాళాకోరు అవకాశవాద రాజకీయాలను తిప్పికొట్టాల్సిన అవసరమెంతైనా ఉంది. వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తులు, అభ్యుదయవాదులు, మేధావులు, సామాజిక తరగతులు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున కదిలి ఉద్యమిస్తేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న దివాళాకోరు విధానాలను తిప్పికొట్టగలిగే అవకాశముంది. ■

అవినీతిపై పోరాటమా? అధికారం కోసం ఆరాటమా?



కొండూరి వీరయ్య

అధికారం కోసం బూర్జువా పార్టీ నేతలు గడ్డికరుస్తారన్న నానుడి మరోసారి రుజువు చేశాడు నితీశ్ కుమార్. రెండేండ్లు తిరక్కముందే బీజేపీ వేసిన ఉచ్చులో చిక్కుకుపోయాడు నితీశ్. 2015 శాసనసభ ఎన్నికల్లో ప్రజలు బీజేపీని తిరస్కరించి ఆర్జెడీ-జేడీయూ మైత్రికి ఓటు వేశారు. బీహార్‌లో పాలక కూటమిలో వచ్చిన మార్పులు, నితీశ్ రాజీనామా, విశ్వాసపరీక్ష నెగ్గటం వంటి పరిణామాలు శరవేగంగా జరగటాన్ని గమనిస్తే అటు గవర్నర్‌కు గానీ, ఇటు రాష్ట్ర బీజేపీ శాఖకుగానీ, బీజేపీ పార్లమెంటరీ బోర్డుకు గానీ ఈ పరిణామాలు ఏమీ హఠాత్తుగా జరిగలేదన్న విషయం ముందే తెలుసు అన్న అభిప్రాయానికి రావటం దేశం వంతైంది. రాష్ట్రపతి స్థానంలో ఉన్న వ్యక్తిపై నిందారోపణ చేయటం కాదు కానీ నిన్న మొన్నటి వరకు రాష్ట్ర గవర్నర్‌గా ఉన్న కోవింద్‌కు ఈ పరిణామాలు ముందే తెలీదు అంటే నమ్మశక్యం కావటం లేదు. బహుశా నితీశ్ పడగను బీజేపీ బుట్టలో కప్పిపెట్టటానికి రామ్‌నాథ్ కోవింద్ నాగస్వరంగా పని చేసినందుకే రాష్ట్రపతి పదవి బహుమతిగా వచ్చిందని అనుకోవటానికి కూడా ఈ పరిణామాలు ఆస్కారం ఇస్తున్నాయి.

2019 ఎన్నికల్లో రూపొందబోయే ప్రతిపక్ష కూటమి విషయంలో నితీశ్ కుమార్ సైంధవ పాత్ర పోషించి మోడీ భక్తిని నిరూపించుకోదల్చుకున్నట్టు రూఢీ అవుతోంది. అంతే కాదు. ఆ మరునాడే అన్నా డీఎంకే ఐక్యంగా ఉంటేనే ఆ పార్టీతో తాము చేతులు కలపటానికి సిద్ధమవుతామని బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా స్పష్టం చేశారు. తద్వారా ప్రాంతీయ పార్టీల అంతర్గత వ్యవహారాల్లో బీజేపీ క్రియాశీలకంగా జోక్యం చేసుకుంటుందని, తమ ఆధిపత్యాన్ని అంగీకరించని వారిని శంకరగిరి మాన్యాలు పట్టించటానికి వెనకాడబోదని తేటతెల్లమవుతోంది. వచ్చే ఏడాది ఒరిస్సాలో జరగబోయే ఎన్నికలకు పావులు కదపటం ప్రారంభించింది బీజేపీ. ఆ సందర్భంలో దేశాన్ని ప్రతిపక్ష రహిత భారతంగా మార్చే క్రమంలో తలమునకలై ఉన్నామని భువనేశ్వర్‌లో 2016 ఫిబ్రవరిలో జరిగిన ఒక బహిరంగ సభలో స్వయంగా మోడీ దేశానికి సమాచారమిచ్చారు. తదనంతరం జరిగిన గోవా, మణిపూర్ శాసనసభ ఎన్నికల్లో బీజేపీకి సంఖ్యాబలం లేకపోయినా కొనుగోళ్లకు పాల్పడి ప్రభుత్వాలు ఏర్పాటు చేసింది. అంతకు ముందే అరుణాచల్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో జరిగిన పరిణామాలు పాఠకులు ఇంకా మర్చిపోలేదు. తాజాగా కర్ణాటకపై బీజేపీ గురిపెట్టింది. ఈ పరిస్థితుల్లో జాతీయ రాజకీయాల్లో కనిపిస్తున్న మితవాద మొగ్గు పట్ల ఆందోళన చెందుతున్న దేశభక్తులకు కొన్ని ప్రశ్నలు తలెత్తటం సహజం.

లాలుప్రసాద్ యాదవ్ కుటుంబంపై అవినీతి ఆరోపణలు ఉన్న విషయం, ఆయనపై సీబీఐ న్యాయస్థానాలు, సుప్రీం కోర్టుల్లో కేసులు విషయం నితీశ్‌కు 2015 ఎన్నికల పొత్తుకు ముందే తెలుసు. ఇప్పుడవే అవినీతి ఆరోపణలు కారణంగా చూపి ప్రభుత్వ భాగస్వామిగా ఉన్న ఆర్జేడీని గెంటేశాడు. నాటికీ నేటికీ లాలుపై ఉన్న అవినీతి ఆరోపణల్లో కొత్తగా ఏమీ చేరలేదు. కానీ నాడు నరహంతకుడుగా కనిపించిన మోడీ ప్రధాని గద్దెనెక్కిన తర్వాత సాధు జంతువుగా మారిపోయినట్టు నితీశ్‌కు కనిపిస్తోంది. అంతేకాదు. నిజంగా తన మంత్రివర్గంలో ఉన్న ఉప ముఖ్యమంత్రిపై చెప్పుకోదగ్గ అవినీతి ఆరోపణలు (ఓటుకు నోటు కేసులో నిందితుడైన చంద్రబాబు తరహాలోనైనా) రాలేదు. ఒకవేళ వచ్చినా వాటిని అసెంబ్లీ ముందుగానీ, ప్రజల ముందుగానీ పెట్టటానికి ముఖ్యమంత్రిగా నితీశ్ చేసిన ప్రయత్నం కూడా ఏమీ లేదు. అటువంటిది ఇప్పుడు అవినీతి కారణాలు ముందుకు తెస్తే నితీశ్ సుద్దపూస కాదు. లాలూ యాదవ్ దోషి కాదు. 2015లో ఎన్నికల పొత్తుకోసం లాలుతో చర్చలు జరిపిన జేడీయూ పార్లమెంటరీ నేత శరద్‌యాదవ్ కూడా నితీశ్‌ను తప్పు పట్టడం గమనిస్తే ఆయనకు కూడా ఈ కప్పల తక్కెడ సమాచారం ఉన్నట్టు కనిపించటం లేదు.

నితీశ్ అధికారానికి తక్షణమే వచ్చిన ముప్పు ఏమిటన్నది ముందుకొస్తున్న మరో ప్రశ్న. కనుచూపు మేరలో అటువంటి ముప్పేమీ కనిపించలేదు. శాసనసభ ఎన్నికల్లో నితీశ్ పార్టీ కంటే ఆర్జేడీకి ఎక్కువ సీట్లు వచ్చినా బీజేపీ వ్యతిరేక ఐక్య సంఘటన నినాదానికి కట్టుబడ్డ లాలు ప్రసాద్ యాదవ్ ముఖ్యమంత్రి పదవి కోసం పోటీ పడలేదు. స్వయంగా నితీశ్ పేరు ఆ పదవికి ప్రతిపాదించాడు. అప్పటి నుండీ ఇప్పటి వరకు ఏ ఒక్క సందర్భంలోనూ రెండు పార్టీలూ ముఖ్యమంత్రి పదవి కోసం కుమ్ములాడుకున్నదీ లేదు. అటువంటి సమయంలో లేని బూచిని ప్రజల ముందుకు తెస్తూ రాజకీయ వ్యభిచారానికి పాల్పడిన నితీశ్ లౌకిక శక్తుల ముందు నగ్నంగా నిలబడ్డాడు. అవినీతి పట్ల రాజకీయాల్లో నేరచరితుల పట్ల నితీశ్ ఎంచుకున్న రాజకీయ వైఖరిని కూడా ఆయన సమర్ధించుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యమంత్రి పరిక్కర్ గోవాను వదిలి కేంద్రంలో రక్షణ శాఖ పగ్గాలు ఎందుకు చేపట్టాల్సి వచ్చింది, తిరిగి నగ్నమైన అవకాశవాదంతో రాష్ట్రంలో మైనారిటీ ప్రభుత్వానికి మద్దతు కొనుగోలు చేసేందుకు గోవా



ఎందుకు వెళ్లాల్సి వచ్చిందో నితీశ్ దేశానికి వివరణ ఇవ్వాలి. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన వ్యాపం (మధ్యప్రదేశ్ మెడికల్ కళాశాలల కుంభకోణం) మీద మోడీ, నితీశ్ ఎందుకు మాట్లాడటం లేదో స్పష్టం చేయాలి. 17 కేసులు ఎదుర్కొంటున్న వ్యక్తి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎలా అర్హత కలిగినవాడవుతాడో కూడా ఆయన సమాధానం చెప్పాలి. భారీ అవినీతి, అధికార దుర్వినియోగం ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజస్థాన్ ముఖ్యమంత్రిని మార్చే సత్తా అవినీతిపై అహర్నిశలు పోరాడుతున్న మోడీకి, బీజేపీకి ఎందుకు లేదో వివరించాలి. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రమాణాలు ఉల్లంఘించి మంత్రిగా కొనసాగుతున్న కేటీ రామారావు విషయంలో రాష్ట్రంలో బీజేపీ ఎందుకు నోరెత్తటం లేదో, ఓటుకు నోటు కేసులో నిందితుడైన చంద్రబాబు విషయంలో అక్కడి బీజేపీ నేతలు నోరు మూసుకోవటానికి కారణాలు ఏమిటో స్పష్టం చేయాలి. అంతేకాదు. దిగుమతి సుంకాలు కట్టకుండానే కేంద్ర ఖజానా నుండి వేల కోట్లు వసూలు చేసిన మోడీ-షా అనుంగు మిత్రుడు గౌతం అదానీ విషయంలో అటు కేంద్ర ఆర్థిక శాఖగానీ, ఇటు విద్యుత్ శాఖ గానీ, వాణిజ్యం, పరిశ్రమలు శాఖ గానీ ఎందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవటం లేదో దేశానికి సంజాయిషీ ఇవ్వాలి.

ఈ మొత్తం పరిణామాలు బీజేపీ భావి రాజకీయ వ్యూహం గురించి ఒక అంచనాకు రావటానికి ఉపయోగపడతాయి. నితీశ్-మోడీ మైత్రికి పునాదులు వేసిన సూత్రం అవినీతిపై పోరాటం కాదు. అధికారం కోసం ఆరాటం. - అధికారానికి రావటానికి ముందు మోడీ అనేక వాగ్దానాల్లో ఒక్కటీ నెరవేర్చలేకపోయారు. విదేశాల్లో నల్లధనం అక్కడే భద్రంగా ఉంది. పైగా దేశంలోని నల్లధనాన్ని కూడా బంగారు బిస్కట్ల రూపంలో మార్చుకోవటానికి వీలుగా సంపన్న వర్గాలు, ఖజానా దండిగా ఉన్న వెంకయ్యనాయుడు ట్రస్ట్ లాంటి ట్రస్టులు కిలోల లెక్కన బంగారం నిల్వలు దాచుకోవచ్చని తాజాగా ఆదేశాలు జారీ చేసింది. మరో ఏడాదిలో ఎన్నికలకు దేశం సిద్ధమవుతున్నా రైతాంగం ఆదాయం రెట్టింపు చేస్తామన్న వాగ్దానం ఏ గంగలో మునిగిందో మోడీయే చెప్పాలి. అవినీతిపై పోరాటం పేరుతో పెద్ద నోట్ల రద్దు ద్వారా ప్రజల ముక్కు పిండి వసూలు చేసిన లక్షల కోట్ల రూపాయల లెక్కలు తేల్చలేకపోయింది కేంద్ర ప్రభుత్వం. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ఆధారిత ఉపాధి, వ్యవసాయేతర ఉపాధి మరింత పతనావస్థకు చేరింది. జీఎస్టీ చట్టంతో గ్రామీణ ప్రాంతాల్లో కోటి వరకు ఉన్న చిన్న, సన్నకారు పరిశ్రమలు, స్వయం ఉపాధి కార్ఖానాలు దివాళా తీసే ప్రమాదం వచ్చింది. ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాల నినాదాన్ని ఏ కబేళాకు తరలించిందో తెలీదు. పశువిక్రయాలపై నిషేధాజ్ఞలు వేడి నీళ్లకు చన్నీళ్లు అన్నట్టుగా గ్రామీణ కుటుంబాలకు తోడవుతున్న పాడి ఆదాయాన్ని ఎండగట్టింది. ఈ పరిస్థితుల్లో 2019లో అధికారానికి రావటంపై బీజేపీకే కాదు మోడీకి సైతం అనుమానాలు ఉన్నాయి. అందువల్లనే బీజేపీ వైఫల్యాలు ప్రజల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రతిపక్షాలు ఐక్యం కాకుండా ఉండేందుకు బీజేపీ పథకం ప్రకారం పాత మిత్రులను గాలం వేస్తోంది. ఈ గాలానికి చిక్కిన నితీశ్ వంటి వాళ్లు ఇప్పటి నుండే అవాస్తవాలు, అభూతకల్పనలతో మోడీ గుణగణాలతో దేశాన్ని మోసం చేయటానికి, వాస్తవాలు ప్రజల దృష్టికి రాకుండా చూడటానికి సైంధవపాత్ర పోషించటానికి సిద్ధమయ్యారు. ఈ పరిస్థితుల్లో బీజేపీయేతర పార్టీలు స్వతంత్రంగానైనా, ఉమ్మడిగానైనా అధికారం కోసం బీజేపీ, దాని తోడు దొంగలు పడుతున్న ఆరాటాన్ని ప్రజల ముందు ఎండగట్టగలిగినప్పుడే బీజేపీ నగ్నరూపం ప్రజల ముందుకు వస్తుంది. సైంధవుడు అడ్డుపడినంత మాత్రాన మహాభారతం ఆగిపోలేదన్న విషయాన్ని నితీశ్ లాంటివాళ్లు, నితీశ్ పాత్ర పోషించటానికి దక్షిణాది రాష్ట్రాల్లో సిద్ధమవుతున్న మరికొద్ది మంది నాయకులు గుర్తించాలి.

సెల్: 9871794037





మనసుకు నచ్చే దుపట్టా...

ఏ సందర్భానికైనా... ఏ వయసు వారికైనా నప్పే డ్రస్ చుడీదార్. మరీ చుడీదార్‌కు పార్టీ లుక్ తీసుకురావాలంటే దుపట్టా హైలెట్‌గా ఉండాలి. అలాంటి ట్రెండీ, ఆకట్టుకునే పట్టు దుపట్టాల గురించి ఎంత వర్ణించినా తక్కువే ! దుపట్టాలు పెండ్లిళ్లకు, పార్టీలకు, అకేషన్లకు వేసుకున్నా చాలా డిఫరెంట్‌గా, అందంగా కనిపిస్తారు. దుపట్టా మొత్తం పట్టుతో నిండుగా, వైభవంగా కనిపిస్తుంది. అలాంటి అపూర్వమైన దుపట్టాలు ఈ వారం మీ కోసం...





హర్షిణికి ఎన్‌ఎఫ్‌ఎస్‌సీ నుంచి ఓ టెలిగ్రామ్ వచ్చింది. టెలిగ్రామ్ అందుకున్న ఆ క్షణాలు ఆమె జీవితంలో అత్యంత అద్భుతమైన క్షణాలు. కారణం ఆ కళాశాలలో చేరడం ఆమె కల. అది ఇప్పుడు నెరవేరబోతుంది. అందుకే అంతటి ఆనందం. సముద్రం లాంటి ఆ క్యాంపస్‌లో అడుగుపెట్టింది. ఎటు చూసినా అబ్బాయిలే కనిపిస్తున్నారు. కనుచూపు మేర చూద్దామన్నా ఒక్క అమ్మాయి కనిపించడం లేదు. ఆమె అవేమీ పట్టించుకోలేదు. ఆమె కండ్లు విశాలమైన మైదానంలోని చారిత్రాత్మకమైన రెడ్ బిల్డింగ్ వైపు తిరిగాయి. 'ఎంతో అందమైన ఈ రెడ్ బిల్డింగ్ ముందు నిలబడటం నా జీవితంలో మరిచిపోలేని అనుభవం. ఈ కళాశాలలో చదవాలని ఎన్ని కలలు కన్నానో' మనసులోనే అనుకుంటూ మురిసిపోయింది.

ఫస్ట్ ఫైర్ ఫైటర్



ఎంతో ఉత్సాహంతో లోపలకు అడుగుపెట్టింది. అక్కడే ఓ వ్యక్తి అందరి దగ్గర అడ్మిషన్ ఫామ్స్ తీసుకుంటున్నాడు. హర్షిణి కూడా ఆ వ్యక్తి దగ్గరకు వెళ్ళి తన అడ్మిషన్ ఫామ్ చూపించింది. ఆమెను చూసి ఒకింత ఆశ్చర్యపోయిన ఆ వ్యక్తి 'మ్యామ్, మీరు దయచేసి ఆర్మీ లేదా ఎయిర్‌ఫోర్స్ కాలేజీలో అప్లయ్ చేసుకోండి. ఇక్కడ అమ్మాయిలకు ఎలాంటి సౌకర్యాలు లేవు. ఇది కేవలం అబ్బాయిల కాలేజీ మాత్రమే' అన్నాడు. 'ఇది నా కల. నాకు ఇక్కడే అడ్మిషన్ కావాలి. దీనికి ప్రత్యేక పర్మిషన్ కూడా తీసుకున్నాను' అని ఆమె అక్కడే అడ్మిషన్ తీసుకుంది.

మళ్ళీ ఆలోచించుకోమన్నారు

అలా హర్షిణి నాగపూర్‌లోని నేషనల్ ఫైర్ సర్వీస్ కాలేజ్‌లో అడ్మిషన్ పొందింది. 46 ఏండ్ల చరిత్ర కలిగిన ఆ కళాశాలలో అడ్మిషన్ పొందిన మొదటి అమ్మాయిగా కొత్త చరిత్ర సృష్టించింది. 2006లో 26 ఏండ్ల హర్షిణి కన్హేకర్ ఆ కళాశాలలో అడుగుపెట్టి అందరినీ ఆశ్చర్యపరిచింది. అడ్మిషనైతే పొందింది, మరి తర్వాత పరిస్థితి... అడ్మిషన్ తీసుకున్న తర్వాత రెండు రౌండ్ల మెడికల్ టెస్టులు నిర్వహించారు. డాక్టర్లు మెడికల్ టెస్టులు చేస్తూ 'ఇది చాలా కష్టమైన కోర్సు, ఒక్కసారి ఆలోచించుకోండి. దీన్ని మీరు కచ్చితంగా కొనసాగించగలరా' అని ప్రశ్నించారు.

ఎగతాళి చేశారు

హర్షిణి ఇవన్నీ దాటుకొని చివరి ఇంటర్వ్యూకి చేరుకుంది. ఆ ఇంటర్వ్యూ మొదలయింది. ఇంటర్వ్యూ చేసే టీంలోని ఒక వ్యక్తి 'అగ్నిమాపక కేంద్రంలో మరో కిరణ్‌బేడీ కాదలచారా' అని నవ్వుతూ ప్రశ్నించాడు. 'ఇందులో చేరుతున్నప్పుడు ఇలాగే ఎంతో మంది నన్ను ఎగతాళి చేశారు. బెదిరించారు, భయపెట్టారు. కానీ నా లక్ష్యం ఒక్కటే. వారి మాటలేవీ నన్ను వెనక్కు పంపలేకపోయాయి. ఆ యూనిఫామ్ వేసుకోవాలనేది నా కోరిక. ఆ కోరిక ముందు ఇవేవీ నాకు కనిపించలేదు' అంటారు ఆమె.



ఆరోగ్యం క్షీణించినా...

కళాశాలలో మొదటి రోజు... ధైర్యంగా అడుగుపెట్టింది. అక్కడ ఆమెకు ఘన స్వాతగం లభించింది. అక్కడ అమ్మాయిలకు ప్రత్యేక హాస్టల్ వసతి లేదు. అందుకే క్లాసులు పూర్తయిన తర్వాత ఇంటికి వెళ్ళే విధంగా హోం మినిస్టర్ నుంచి ప్రత్యేక అనుమతి పొందింది. చివరకు తను అనుకున్నది సాధించింది. పట్టుదలతో చేరింది. అక్కడ చేయించే కవాతులు, డ్రిల్స్‌తో రోజురోజుకు ఆమె ఆరోగ్యం క్షీణించింది. కానీ ఎంత పట్టుదలతో అయితే అడ్మిషన్ తీసుకుందో అంతే పట్టుదలతో ట్రైనింగ్ కూడా పూర్తి చేసింది. భారీ నీటి గొట్టాలు మోయడం, మాక్ డ్రిల్ చేయడం ఈ కోర్సులో అతి కష్టమైనవి. 'ఇవి చేసేటప్పుడు నేను ఎప్పుడూ నన్ను ఒక అమ్మాయిగా భావించలేదు. ఎవ్వరైనా వీటిని మోయాల్సిందే. ఎలాగైనా ఈ ట్రైనింగ్ పూర్తి చేయాలని నాకునేనే ఎన్నోసార్లు ధైర్యం చెప్పుకునేదాన్ని. ఎన్‌సీసీ క్యాంప్‌లో ఉన్నప్పుడు ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో పని చేసిన మొదటి మహిళగా విదర్భాకి చెందిన శివాని కులకర్ణి గురించి చదివాను. ఆమే నా స్ఫూర్తి. అప్పుడే నేను నిర్ణయించుకున్నాను. సమాజంలో గౌరవం, గుర్తింపు ఉన్న యూనిఫామ్ ధరించాలని. అప్పటి నుంచే నాకు ఈ యూనిఫామ్‌పై మోహం పెరిగింది' అంటూ ట్రైనింగ్‌లో తన అనుభవాలను గుర్తు చేసుకున్నారు.

బాధ్యతలు తీసుకుంది

హర్షిణి 2006లో గుజరాత్‌లోని మెహ్సానా ఫైర్ స్టేషన్‌లో బాధ్యతలు తీసుకుంది. అది జాతీయ స్థాయిలోనే ఆయిల్, గ్యాస్ ఉత్పత్తి చేసే కంపెనీల్లో రెండవ స్థానం సంపాదించుకున్న స్టేషన్. ఇది మూడు ఫైర్ స్టేషన్ల పరిధిలో 50 చమురు కేంద్రాలు కలిగివుంది. ఆ మూడు స్టేషన్లలో మెహ్సానా ఒక చిన్న గ్రామం.

పెను ప్రమాదం నుంచి...

'ఓ సారి ఢిల్లీ శాస్త్రీ నగర్‌లోని ఓ షూ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం సంభవించింది. అదే సమయంలో ఓ రాకెట్ ఫ్యాక్టరీ పై అంతస్థుకు తగిలి ఆ మంటలు కింది వరకు వెళ్ళి మరింతగా విస్తరించాయి. మంటలు భవనమంతా వ్యాపించాయి. ఆ మంటలు ఆర్పడానికి మేము దానికి ఎదురుగా ఉన్న మరో భవనం పైకి వెళ్ళాం. మంటలు ఆర్పడానికి ఎంతో ప్రయత్నించాం. కానీ మా ప్రయత్నం ఫలించలేదు. అయితే ఆ మంటలు మిగిలిన భవనాలకు వ్యాపించకుండా చేయడంలో విజయం సాధించాం. మేము ఉన్న భవనం పక్కనే ఉన్న గోడ విరిగి పడిపోయింది. క్షణక్షణానికి పొగ పెరిగిపోతుంది. మా సిబ్బందికి ఎలాంటి ప్రమాదం జరక్కుండా మరో బిల్డింగ్‌పైకి దూకి ప్రాణాలను కాపాడుకున్నాం. అర్ధరాత్రి మొదలైన మా పోరాటం ఉదయం ఆరు గంటల వరకు కొనసాగింది. చివరకు మంటలు వల్ల ఆ చట్టుపక్కల ఎలాంటి ప్రమాదం జరగకుండా కాపాడగలిగాం' అంటూ ఆమె తన అనుభవాలను గుర్తు చేసుకున్నారు.

బెస్ట్ ఫైర్ ఫైటర్‌గా

2010లో హర్షిణి ముంబై డ్రిల్లింగ్ సర్వీస్‌కు బదిలీ అయ్యారు. ఈ బాధ్యతలు తీసుకున్న మొదటి మహిళ కూడా హర్షిణీనే. ఆమె తన కెరీర్‌లో చేసిన సాహసాలకు గాను బెస్ట్ ఫైర్ ఫైటర్‌గా టైటిల్ అందుకున్నారు. కృషి, పట్టుదల ఉంటే యువత కలలను కచ్చితంగా నెరవేరతాయి అనడానికి హర్షిణి జీవితం ఓ ఉదాహరణ. ఏ రంగంలో పని చేయాలన్నా దానికి ఆడా మగ అనే లింగ బేధం లేదు. పురుషాధిపత్యంగా కొనసాగుతున్న ఫైర్‌స్టేషన్‌లో మొదటి మహిళగా ప్రవేశించి ఈమె మరెందరో యువతకు స్ఫూర్తిగా నిలిచింది.

సలీమ



ఒత్తిడిని తగ్గించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది నిద్ర. నిద్ర తో పాటు సువాసన భరితమైన వాసన కూడా నిద్రలోకి జారుకునే లా చేస్తుందని చెబుతున్నారు నిపుణులు. సువాసనను వెదజల్లే వాటిలో కొన్ని ముఖ్యమైన నూనెలు ఉన్నాయి. సువాసన కలిగిన నూనెలను చర్మానికి రాసుకుంటే

నిద్రబుచ్చే నూనెలు...

ఐదు నిమిషాల్లో పీల్చుకొని రక్తప్రసరణకు, ఒత్తిడి తగ్గించడానికి సహాయపడతాయని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి.

– లావెండర్ నూనె చాలా ప్రశాంతమైన పరిమళాన్ని వెదజల్లుతుంది. ఈ నూనె నిద్రలోకి త్వరగా జారుకునేలా చేస్తుందని చెబుతున్నాయి కొన్ని అధ్యయనాలు. ఇది వివిధ రూపాల్లో అంటే క్యాండిల్స్, బాత్ ట్యాబ్ లెట్స్, ఐ మాస్కులా లభిస్తున్నది. ఈ నూనెను కొద్దిగా చర్మానికి పట్టిస్తే చాలు తల నొప్పి నుంచి ఉపశమనం పొందవచ్చు.

– తెలుపు, గులాబీ రంగు ఆకులు కలిగిన మొక్కల నుంచి వెలువడే నూనె చాలా ప్రశాంతమైన వాసనను కలిగి ఉంటుంది. దీన్నే క్లారి సేజ్ నూనె అని కూడా పిలుస్తారు. ఈ నూనెను చర్మానికి రాసుకోవడం వల్ల రక్త ప్రసరణ స్థాయిలో సమతుల్యంగా పని చేస్తాయి. అలాగే ఆందోళన, ఒత్తిడి, చికాకు వంటి సమస్యలను దూరం చేసి త్వరగా నిద్ర పట్టేలా చేస్తుంది.

– అలాగే సాంబ్రాణి వాసన ఒత్తిడిని నుండి త్వరగా ఉపశమనం కలిగిస్తుంది. 64 శాతం మంది రాత్రి పడుకునే ముందు గదిలో సాంబ్రాణి స్టిక్స్‌ను ఉంచుకుంటారు. ఈ వాసన ముఖ్యంగా క్యాన్సర్ నిరోధకంగా పని చేస్తుంది. అలాగే చిన్నపిల్లలకు సాంబ్రాణి నూనెను రాయడం వల్ల ఎలాంటి సమస్యలు దరి చేరవు. ఇది యాంటీ డిప్రెసెంట్‌గా పని చేస్తుంది.

– మల్లెలు చాలా ప్రశాంతమైన వాసనను వెదజల్లుతాయి. ఈ నూనెను శరీరానికి పట్టించడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది.

అలాగే మల్లెల నుంచి వచ్చే వాసన ఇంట్లో ఉండే గాలిని ప్యూరిఫై చేస్తుంది.

ప్రాంతీయ భాషకు ప్రాణం పోసి..

తెలంగాణ యాసలో ఎన్నో కథలను రాసి.. ఎచ్చమ్మ కథల యశోదమ్మగా ఆమె పేరుగాంచారు. ఆమె రచనల్లో తెలంగాణ సజీవ భాష కనిపిస్తుంది. కథలే కాదు కవితలు, సాహిత్య విమర్శ గ్రంథాలు రాసి ప్రముఖ రచయిత్రిగా కీర్తి గడించారు. ఆకాశవాణిలో తెలంగాణ మాండలికంలో ప్రసంగం చేసిన తొలి రచయిత ఆమె. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో ఆచార్యులుగా పదవీ విరమణ చేశారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షురాలుగా కూడా పనిచేశారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షురాలుగా కూడా పనిచేశారు. తెలుగు ప్రాచీన సాహిత్యంపై ఆమె చేసిన ప్రసంగాలు పండితుల అభినందనలు అందుకున్నాయి.



పాకాల యశోదారెడ్డి
(8ఆగస్టు, 1929 - 7 అక్టోబర్, 2007)

Women of the day

మహబూబ్ నగర్ జిల్లా, బిజినేపల్లిలో యశోద జన్మించారు. ఆమె తల్లిదండ్రులు సరస్వతమ్మ, కాశిరెడ్డి. మూడవ తరగతి వరకు మహబూబ్ నగర్ లో చదివిన ఆమె ఉన్నత పాఠశాల విద్యను హైదరాబాద్, నారాయణగూడలోని బాలికల ఉన్నత పాఠశాలలోను పూర్తి చేశారు. రాజా బహద్దూర్ వెంకట్రామిరెడ్డి ప్రోత్సాహంతో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి తెలుగు, సంస్కృత భాషలలో పిజీ పూర్తి చేశారు. అంతేకాదు జర్మన్ భాషలో, భాషాశాస్త్రంలో డిప్లొమా చేశారు. 'తెలుగులో హరివంశాలు" అను అంశంపై పరిశోధన చేసి ఓయు నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఆ తర్వాత 1976లో అలీఘర్ విశ్వవిద్యాలయం నుండి డి.లిట్ అందుకున్న ఆమె హిందీ, ఉర్దూ, కన్నడ భాషల్లో ప్రావీణ్యంతో పాటు, జర్మన్ భాషతో కూడా పరిచయమున్నది.

ఆమె వక్తృత్వ ప్రతిభను చూసిన ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడు పాకాల తిరుమల్ రెడ్డి ఆకర్షితుడైనారు. వారి ప్రేమ వివాహం 1947లో జరిగింది. రాత గీత ఒకటిగా మారాయి. తన చిత్రాలకు ఆమే స్ఫూర్తి అని ఎన్నో వేదికలపై ఆయన చెప్పారు. యశోదారెడ్డి కూడా స్వతహాగా కళాపిపాసి అయిన యశోద భర్త చిత్రకళా ప్రదర్శనకు కార్యకర్తగా పని చేసేవారు.

1955లో కోఠి మహిళా కళాశాలలో అధ్యాపకురాలిగా ఉద్యోగంలో చేరిన యశోద ఆ తర్వాత రీడర్‌గా, ప్రొఫెసర్‌గా పనిచేశారు. వందకు పైగా కథలు రాసినా వాటిలో కొన్ని సంపుటాలుగా వచ్చాయి. ఎచ్చమ్మ కథలు, మావూరి ముచ్చట్లు, ధర్మాశాల కథా సంపుటాలు విశేషపాఠకాదరణ పొందాయి. ఆమె కథలు తెలంగాణ సమాజంలో వచ్చిన మార్పులకు ప్రతిబింబాలుగా ఉండేవి. ఈ కథా సంపుటాల్లో తెలంగాణ యాస, సంస్కృతి పదపదంలో కనిపిస్తుంది.



లేత గులాబీ రంగులోకి...

- ఒక చెంచా బెల్లంలో రెండు చెంచాల తేనె, మూడు చుక్కల కొబ్బరి నూనె వేసి బాగా కలుపుకోవాలి. ఇలా తయారు చేసుకున్న మిశ్రమాన్ని పెదాలకు పట్టించి పది నిమిషాల తర్వాత గోరు వెచ్చటి నీటితో కడిగితే మంచి ఫలితం కనిపిస్తుంది. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే పెదాలు లేత గులాబీ రంగులోకి మారడంతో పాటు మృదువుగా తయారవుతాయి.
- ప్రతిరోజు ఉపయోగించే లిప్‌బమ్‌లో కొద్దిగా చక్కెర, కొబ్బరి నూనె పోసి మెత్తగా పేస్టులా అయ్యే వరకు కలపాలి. ఈ మిశ్రమాన్ని పెదాలకు స్క్రబ్‌లా పెట్టుకొని 15 నిమిషాల తర్వాత కడిగితే సరిపోతుంది. ఇలా క్రమం తప్పకుండా చేస్తే పెదాలు అందంగా కనిపిస్తాయి.
- ఒక చెంచా కోకో పౌడర్‌లో ఒక చెంచా తేనె, ఒక చెంచా చక్కెర, రెండు చెంచాల ఆలివ్ నూనె కలిపి పెదాలకు ఐదు నిమిషాలు పట్టించి తర్వాత కడగాలి. ఇలా చేయడం వల్ల పెదాలు అందంగా, మృదువుగా తయారవుతాయి.
- ఒక చెంచా కివీ పండు గుజ్జులో ఒక చెంచా చక్కెర, ఒక చెంచా కొబ్బరి నూనె కలిపి పెదాలకు స్క్రబ్‌లా ఉపయోగిస్తే చక్కటి ఫలితం కనిపిస్తుంది. కివీ పండుతో తయారు చేసిన స్క్రబ్‌ను పెదాలకు ఉపయోగించడం వల్ల నిర్జీవంగా కనిపించే పెదాలు హైడ్రేట్ అవుతాయి.
- ఒక చెంచా చక్కెరలో ఒక చెంచా ఆలివ్ నూనె, ఒక చెంచా తేనె, ఒక చెంచా పుదీనా నూనె వేసుకొని బాగా మెత్తగా కలుపుకొని పెదాలకు ఐదు నిమిషాలు పట్టించి తర్వాత గోరు వెచ్చటి నీటితో కడిగితే సరిపోతుంది. ఇలా చేయడం వల్ల పెదాలపై ఉండే పగుళ్లు తగ్గిపోయి మృదువుగా, అందంగా తయారవుతాయి.

నంద్యాల నామినేషన్ల ప్రక్రియలో ఉత్కంఠ

- పరస్పర అభ్యంతరాలు తోసిపుచ్చిన ఈసీ

నంద్యాల : నంద్యాల ఉపఎన్నిక సందర్భంగా నామినేషన్ల ప్రక్రియ సోమవారం ఉత్కంఠ రేపింది. టీడీపీ, వైసీపీ నాయకులు వ్యక్తం చేసిన అభ్యంతరాలతో గందరగోళం నెలకొంది. దీనిపై ఎన్నికల కమిషన్ న్యాయవాదులతో సంప్రదింపులు జరిపింది. చివరికి ఇరు పార్టీల అభ్యంతరాలను ఎన్నికల కమిషన్ తోసిపుచ్చింది. ఇరు పార్టీల అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించింది. దీంతో నామినేషన్ల ప్రక్రియకు తెరపడింది. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయలో వివిధ పార్టీల నాయకుల సమక్షంలో నామినేషన్ల ష్యూరిటీని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రసన్న వెంకటేష్ నిర్వహించారు.శిల్పామోహన్‌రెడ్డి సమర్పించిన నామినేషన్ పత్రంలో అఫిడవిట్‌లో నంద్యాల అడ్వకేట్ సోముల రామతులసీ రెడ్డి చేసిన నోటరీ 2013లోనే ముగిసిందని, ఆ తరువాత ఎలాంటి రెన్యూవల్ చేసుకోలేదని టిడిపి నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఫారం-26కు అనుబంధంగా ఉన్న ఒక అఫిడవిట్, అది కూడా జ్యూడీషియల్ పేపర్‌పైనే ఇవ్వాలని, అలా ఇవ్వలేదన్నారు. నోటరీపై అడ్వకేట్ సోముల రామతులసీరెడ్డి ఎన్నికల అధికారితో మాట్లాడారు. నోటరీని 2013లోనే రెన్యూవల్ చేసుకున్నానని చెప్పారు. ఆ సయమంలో హైకోర్టులో నోటరీలకు స్టే ఉందని చెప్పారు. ఫారం-26కు అనుబంధంగా పత్రాలున్నాయని, కనుక ఫారం-26 ఇవ్వాల్సిన అవసరం లేదని గట్టిగా వాదించారు. స్టేను పరిగణలోకి తీసుకుని శిల్పా నామినేషన్ స్వీకరించాలని కోరారు. ఈ విషయాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎన్నికల కమిషన్‌కు తెలియజేశారు. ఎన్నికల కమిషన్ పరిశీలించి నామినేషన్ పత్రాన్ని స్వీకరించాలని ఆమోదముద్ర వేసింది.

ఉదయం 11 గంటలకు నుంచి మధ్యాహ్నం 3 గంటలలోపు ముగించాల్సిన ఈ తతంగం సాయంత్రం 6 :30 గంటల వరకు ఉత్కంఠగా కొనసాగింది. రాత్రి 7 గంటలకు ఎన్నికల కమిషన్ ఆమోదం తెలపడంతో వైసీపీ నాయకులు ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందారెడ్డి నామినేషన్ పత్రంలో రిటర్న్ చూపలేదని వైసిపి నాయకలు అభ్యంతరం వ్యక్తం చేశారు. టీడీపి నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి కుటుంబంగా ఉన్నందున రిటర్న్ చూపలేదన్నారు. ఎన్నికల కమిషన్ వైసీపీ నాయకుల ఆరోపణలు తోసి పుచ్చి భూమాబ్రహ్మానందారెడ్డి నామినేషన్ స్వీకరించింది.

స్టీల్‌ప్లాంట్ల ప్రయివేటీకరణకు నిరసనగా 9న ధర్నా

- ఢిల్లీకి పయనమైన కార్మికులు

విశాఖపట్నం: సేలం, భద్రావతి, దుర్గాపూర్ స్టీల్‌ప్లాంట్ల ప్రయివేటీకరణకు నిరసనగా ఢిల్లీలో ఈ నెల 9న అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపట్టనున్నాయి. ఈ నేపథ్యంలో ధర్నాలో పాల్గొనేందుకు విశాఖ స్టీల్‌ప్లాంట్ నుంచి సుమారు వెయ్యి మంది ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు సోమవారం ఉదయం స్వర్ణజయంతితో సహా పలు రైళ్లలో ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. సీఐటీయూ స్టీల్‌ప్లాంట్ నాయకులు ఎన్.రామారావు, జె.అయోధ్యరాం, వైటి దాస్, సిఐటియు నగర నాయకులు ఎం.సూరీడు ఆధ్వర్యంలో వారంతా దేశ రాజధానికి పయనమయ్యారు. ఢిల్లీ వెళ్లిన ఉద్యోగులకు విశాఖ రైల్వే స్టేషన్‌లో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నరసింగరావు, నగర ప్రధాన కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, నగర నాయకులు బి.గంగారావు, పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు తదితరులు ఘనంగా వీడ్కోలు పలికారు.

కొవ్వాడ అణుపార్కును రద్దు చేయాలి:సీపీఐ(ఎం)

శ్రీకాకుళం : దేశ ప్రయోజనాలకు, ఉత్తరాంధ్ర ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే కొవ్వాడ అణు విద్యుత్కేంద్రాన్ని రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరంలోని సుందరయ్య భవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొవ్వాడ అణువిద్యుత్‌కు రియాక్టర్లు సరఫరా చేసే వెస్టింగ్‌హౌస్ కంపెనీ దివాళా తీసిందని తెలిపారు. రియాక్టర్లను దిగుమతి చేసుకోవడానికి అటువంటి సంస్థతో మోడీ ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడం దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టడమేనన్నారు. రాష్ట్రంలో మిగులు విద్యుత్ ఉందని, పవన, సోలార్ విద్యుత్ చౌకగా లభిస్తుండడంతో థర్మల్ విద్యుత్ సంస్థలతో ఒప్పందాలు రద్దు చేసుకున్నామని ఇటీవల ఇంధన శాఖ కార్యదర్శి ప్రకటించారని గుర్తు చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి కళా వెంకట్రావు... కొవ్వాడ అణుపార్కును నిర్మించి తీరుతామని చెప్పడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. అమెరికా మెప్పు కోసం దేశ ప్రజలకు ద్రోహం చేసేందుకు మోడీ, చంద్రబాబు వెస్టింగ్‌హౌస్‌తో ఒప్పందం చేసుకున్నారని విమర్శించారు.

దేవరపల్లి భూములు దళితులకే

మంత్రి నక్కా ఆనంద్‌బాబు

- సీపీఐ(ఎం) భూ పోరాటానికి విజయం



దేవరపల్లి సభలో మాట్లాడుతున్న మంత్రి నక్కా ఆనంద్‌బాబు

ఒంగోలు : సీపీఐ(ఎం) నేతృత్వంలో దేవరపల్లి దళితులు రెండు నెలలుగా సాగిస్తున్న భూపోరాటం విజయవంతమైంది. 'మీ భూములు మీకు అప్పగిస్తున్నాం. మీరే సాగుచేసుకోవచ్చు. ఎలాంటి అభ్యంతరం లేదు. త్వరలోనే భూములను చదును చేస్తాం' అని మంత్రి నక్కా ఆనంద్‌బాబు ప్రకటించారు. సోమవారం ఆనంద్‌బాబు, ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజు దేవరపల్లి దళితవాడకు చేరుకుని ఈ ప్రకటన చేశారు. గతంలో చెరువులు తవ్విన వీరన్నకుంట, సూరాయకుంటలో భూములు కోల్పోయిన దళితులకూ ప్రత్యామ్నాయంగా వేరేచోట భూములు అందజేస్తామని మంత్రి చెప్పారు. దేవరపల్లిలో దళితులు తమ భూముల కోసం రెండున్నర నెలలుగా పోరాడుతున్నారు. వారి పోరాటానికి సంఘీభావం తెలిపేందుకు దేవరపల్లి వెళ్లేందుకు సిద్ధపడిన ప్రతిసారీ సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి పి.మధును అరెస్టు చేశారు. ఆ విధంగా ఆయనను నాలుగుసార్లు అరెస్టు చేశారు. ఈ సంఘటనల పరంపరలోనే 15 రోజుల క్రితం రాత్రికి రాత్రి స్థానిక ఎమ్మెల్యే సాంబశివరావు ఆ భూముల్లో 40 పొక్లెయిన్లతో 22 ఎకరాలను చెరువుగా తవ్వేశారు. ఈ తవ్వకాలను వ్యతిరేకించేందుకు దేవరపల్లికి బయలు దేరిన సీపీఐ(ఎం), వైసీపీ, ఇతర పార్టీల నేతలను ఒంగోలులో అరెస్ట్ చేశారు. ప్రతిపక్ష నేతలను అరెస్ట్ చేయడంతో రాష్ట్రస్థాయిలో ఒక్కసారిగా పెద్ద దుమారం రేగింది. పదిరోజుల క్రితం సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి రాఘవులు పర్యటించి..'చెరువును మీరు పూడ్చుతారా? లేక మమ్మల్ని పూడ్చమంటారా? మేము పుడ్చాల్సి వస్తే మిమ్మల్ని రాజకీయంగా పూడ్చడమే' అని తెలుగు దేశం నేతలను హెచ్చరించారు. దేవరపల్లి ఘటనపై మంత్రి నక్కా ఆనంద్‌బాబు సీఎం చంద్రబాబుకు వివరించారు. వెంటనే దళితులకు న్యాయం చేయాలని సీఎం ఆదేశించారు. దీంతో సోమవారం దేవరపల్లి వచ్చిన ఆనంద్‌బాబు దళితుల సమక్షంలోనే భూములు అప్పగిస్తున్నట్లు ప్రకటించారు. ఇది దళితులు ఐక్యంగా పోరాడి సాధించుకున్న ఫలితమని, సీపీఐ(ఎం) పోరాటానికి విజయమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పూనాటి ఆంజనేయులు పేర్కొన్నారు. ఈ భూములు అప్పగింత కార్యక్రమానికి స్థానిక శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు హాజరు కాలేదు.

దళితుల భూముల నేపథ్యమిదీ..

40 ఏండ్లుగా దళితులు సాగుచేసుకుంటోన్న 22 ఎకరాలను స్వాధీనం చేసుకొని, తవ్వకాలు జరపాలని స్థానిక నేతలు నిర్ణయించు కున్నారు. అప్పట్లో దళితులు ఈ విషయంపై హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ దళితులకు అనుకూలంగా నిర్ణయం వచ్చింది. అప్పటి నుంచీ సాగుకు ఇబ్బందులు రాలేదు. తెలుగుదేశం అధికారంలోకి రాగానే మళ్లీ దళితులకు ఇబ్బందులు వచ్చాయి. స్థానిక తెలుగుదేశం నేతలు ఈ భూముల్లో తవ్వకాలు చేపట్టాలని పావులు కదిపారు. వీరికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్ని విధాలా అండదండలు అందించారు. ఈ భూములను దక్కించుకు నేందుకు దళితులు అన్ని పార్టీలను కలిశారు. సీపీఐ(ఎం) వీరికి అండగా నిలిచింది. పోరాటం ఉధృతమవడంతో తెలుగుదేశం నేతలు చేసిన తప్పిదాన్ని గుర్తించి దిద్దుబాటు చర్యకు దిగారు. దాని ఫలితమే సోమవారం నాటి మంత్రి పర్యటన.

కదం తొక్కిన నిరుద్యోగులు

- నిరుద్యోగ భృతి ఇవ్వాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్: డివైఎఫ్ఐ ఆధ్వర్యాన రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు



తిరుపతిలో ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి

విజయవాడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, నిరుద్యోగ భృతి రూ.2 వేలు చెల్లించాలని కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నిరుద్యోగులు కదంతొక్కారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. చిత్తూరు జిల్లా తిరుపతిలో సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరుద్యోగులు ధర్నా చేశారు. ఈ ధర్నాలో ముఖ్య అతిథిగా పీడీఎఫ్ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.30 లక్షల పోస్టుల్ని, టీటీడీలోని ఆరు వేల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని కోరుతూ సబ్‌కలెక్టర్ నిషాంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో విజయవాడలో లెనిన్ సెంటర్లో నిరసన ప్రదర్శన జరిగింది. కేంద్రంలో 14.5లక్షలు, రాష్ట్రంలో 2.21లక్షల పోస్టుల్ని తక్షణమే భర్తీ చేసి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎం సూర్యారావు డిమాండ్ చేశారు. ఎవరూ అడగకుండానే నిరుద్యోగభృతి ఇస్తామన్న చంద్రబాబు మూడేళ్లుగా భృతి ఇవ్వకుండా నిరుద్యోగుల్ని మోసం చేశారని విమర్శించారు. చలో కలెక్టరేట్ కార్యక్రమంలో భాగంగా గుంటూరులో కలెక్టరేట్ వద్ద నిరుద్యోగులు ధర్నా చేశారు. విజయనగరం పట్టణంలో నిరుద్యోగులు అర్ధనగ్న ప్రదర్శన, కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఏపీపీఎస్సీ ద్వారా ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని, నిరుద్యోగులకు మోడీ, చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయాలని నినాదాలు చేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో కలెక్టరేట్ వద్ద నిరుద్యోగులు ధర్నా చేశారు. కడప నగరంలో ర్యాలీ, చలో కలెక్టరేట్ నిర్వహించారు. అనంతరం డీఆర్‌ఒకు వినతిపత్రం అందజేశారు. కర్నూలు కలెక్టరేట్ ఎదుట డీవైఎఫ్ఐ ఆధ్వర్యాన నిరుద్యోగ యువత ధర్నా చేసింది. కర్నూలు జిల్లాలో ఉపాధి ఆధారిత పరిశ్రమలను నెలకొల్పాలని వక్తలు డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యాన నిరుద్యోగులు పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. పలు ప్రజాసంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు.విశాఖ నగరంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద డివైఎఫ్ఐ ఆధ్వర్యాన నిరుద్యోగులు ధర్నా చేశారు. విశాఖ జిల్లా అనకాపల్లిలో ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట యువతీ, యువకులు ధర్నా నిర్వహించారు. నిరుద్యోగులందరికీ ఉద్యోగాలివ్వాలని, లేకుంటే నిరుద్యోగ భృతి చెల్లించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంటికో ఉద్యోగం ఇస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని చంద్రబాబు విస్మరించారన్నారు.

'చేనేతలను మోసగించిన చంద్రబాబు'



మంగళగిరి: తమకు ఓటేస్తే అనేక పథకాలను అమలు చేస్తానని హామీనిచ్చి అధికారంలోకొచ్చిన ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు చేనేత కార్మికులను మోసం చేస్తున్నారని రాష్ట్ర వైసీపీ నాయకురాలు, నగరి ఎమ్మెల్యే ఆర్‌కె.రోజా విమర్శించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని చిల్లపల్లి నాగేశ్వర రావు కళ్యాణ మండపంలో సోమవారం జరిగిన జాతీయ చేనేత దినోత్సవం కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. చేనేత రంగానికి రూ.వెయ్యి కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తానని ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారని, వాటిని అమలు చేయమంటే, గజినిలాగా మరిచిపోయినట్లు నాటకమాడుతున్నారని, చేనేత కార్మికులు తమ హక్కుల కోసం ఇచ్చిన హామీల అమలు కోసం పోరాటం చేయాలన్నారు. చేనేతకు అంబాసిడర్‌గా ఉంటానని చెప్పిన పవన్‌కళ్యాణ్.. ఇంతవరకు జీఎస్‌టీపై స్పందించ లేదని విమర్శించారు. వైసీపీ అధికారంలోకొస్తే చేనేత కార్మికులకు అన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్నారు. మైనార్టీల ఓట్ల కోసమే ఆయేషా కేసును ప్రభుత్వం పునర్విచారణకు ఆదేశించిందని ఆరోపించారు. సమావేశంలో చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్రీలక్ష్మి, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ల్యాంకో పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్: రుణం తీసుకున్నప్పుడు ఇచ్చిన గ్యారెంటీలను అప్పు చెల్లింపు నగదుగా పరిగణించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ ల్యాంకో ఇన్‌ఫ్రా వేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు తీర్పు చెప్పారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఐడిబిఐ బ్యాంకులకు ఇచ్చిన గ్యారెంటీలనే రూ. రెండు వేల కోట్ల అప్పుకు నగదుగా పరిగణించేలా ఉత్తర్వులు ఇవ్వాలని ల్యాంకో పిటిషన్ వేసింది.

'అక్రమ చెరువులను ధ్వంసం చేస్తాం'

- ఆర్‌డిఒ కార్యాలయం వద్ద దొండపాడు దళితుల ధర్నా



ఆర్‌డిఒకు సమస్యలు వివరిస్తున్న వైవి, అక్కినేని వనజ, తదితరులు

గుడివాడ : చట్టాలను ఉల్లంఘించి తవ్విన చెరువులను వెంటనే ధ్వంసం చేయకపోతే తామే ఆ పని చేస్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు వై.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. సోమవారం కృష్ణా జిల్లా గుడివాడ ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట దొండపాడు దళితులపై దాడికి నిరసనగా వ్యవసాయ కార్మిక సంఘం, కుల వివక్ష పోరాట సమితి ఆధ్వర్యంలో నాయకులు మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వైవి మాట్లాడుతూ చట్టాన్ని కాపాడాల్సిన అధికారులే చట్ట ఉల్లంఘనకు పాల్పడుతున్నారని విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్విన చెరువులను ధ్వంసం చేయాలని డిమాండ్ చేశారు. గుడివాడ ఆర్‌డీఓ చక్రపాణికి రహదారి వెంబడి ఉన్న రొయ్యల చెరువులు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అనేక మార్లు సమస్య తీవ్రతను ఆర్‌డిఒ దృష్టికి తీసుకొచ్చినా చేద్దాం.. చూద్దాం అనే ధోరణిలో మాట్లాడడం శోచనీయమన్నారు. మహాధర్నా అనంతరం వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లిన వారిపై ఆర్‌డిఒ నోటిదురుసుతో మాట్లాడడాన్ని వామపక్ష నాయకులు ఆక్షేపణ తెలిపారు. సీఐలు ఎం.వి దుర్గారావు, జి.శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ఐదుగురు ఎస్ఐలు, ఎఎస్ఐలు, 50 మంది కానిస్టేబుల్స్, 10 మంది మహిళా కానిస్టేబుళ్లతో బందోబస్తు నిర్వహించారు.

త్వరలో 10 కీలకాంశాలతో అమరావతి డిక్లరేషన్



అమరావతి : మహిళల సమస్యలను విస్తృత స్థాయిలో చర్చించి, ముసాయిదా ప్రకటనలో తుది మార్పులు చేసి త్వరలోనే అమరావతి డిక్లరేషన్ సిద్ధం చేస్తామని స్పీకర్ కోడెల శివప్రసాదరావు వెల్లడించారు. అమరావతి ప్రకటనపై సోమవారం శాసనసభ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, సామాజిక వేత్తలతో స్పీకర్ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వివిధ రంగాల ప్రముఖ మహిళలు, వివిధ కళాశాలల విద్యార్థినుల అభిప్రాయాలు, సలహాలు, సూచనలతో అమరావతి డిక్లరేషన్ ముసాయిదాలో మార్పులు చేశామని తెలిపారు. అన్ని విధాలా మహిళలకు సహాయపడేలా ఈ ప్రకటనను రూపొందిస్తామన్నారు. మహిళలకు విద్య, సామాజిక భద్రత, డిజిటల్ విద్య, న్యాయపరమైన హక్కులు, ఆరోగ్యం - సమతులాహారం, పారిశ్రామిక రంగంలో మహిళలు, పరిశోధన, సామాజికాభివృద్ధి, రాజకీయాల్లో మహిళలు తదితర పది అంశాలతో అందరికీ ఒక బెంచ్ మార్క్‌గా ఉండేలా ఈ ప్రకటనను సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. ఏ ప్రభుత్వం ఉన్నా, స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు అంతా అనుసరించేలా మహిళలు శక్తిమంతులుగా తయారయ్యేందుకు ఒక మార్గదర్శిగా అమరావతి ప్రకటన ఉంటుందని తెలిపారు. త్వరలో ముఖ్యమంత్రి వద్ద సమావేశం నిర్వహించి, ఆయన సమక్షంలో తుది ప్రకటన పుస్తకాన్ని ఆవిష్కరిస్తామన్నారు.

చట్టసభల్లోనూ సమానత్వం ఉండాలి : మంత్రి సునీత

మంత్రి పరిటాల సునీత మాట్లాడుతూ చట్ట సభల్లో యాభై శాతం స్థానాలు పొందిన నాడే మహిళలు సాధించిన అసలైన విజయంగా భావించాల్సి ఉంటుందని తెలిపారు. మహిళా సర్పంచ్‌లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీల సభ్యుల భర్తలు కాకుండా ఎన్నికైన ఆయా మహిళా నాయకులే స్వయంగా పదవీ బాధ్యతలు నిర్వహించే స్థాయికి ఎదగాలని ఆమె ఆకాంక్షించారు.

జీఎస్టీ తెలంగాణకే కాదు

- ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఎమ్మెల్యే లక్ష్మణ్ విమర్శ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జీఎస్టీ విధానం తెలంగాణకే పరిమితమైందనే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యాఖ్యలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్ విమర్శించారు. జీఎస్టీ ప్రవేశపెట్టక ముందే అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో, మేధావులతో కేంద్రం చర్చించిందని గుర్తుచేశారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సాగునీటి ప్రాజెక్టులపై మొదటి రోజు రూ.19 వేల కోట్ల భారం పడుతుందన్న సీఎం వాదన అవాస్తవమన్నారు. ఎటువంటి లెక్కలు లేకుండానే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనన్నారు. మిషన్ కాకతీయ, డబుల్ బెడ్‌రూం, రోడ్ల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2.30 లక్షల కోట్లు ఖర్చుచేస్తున్నదని చెప్పడం సీఎం స్థాయికి తగదన్నారు. జీఎస్టీ వల్ల ప్రభుత్వానికి ఏమైనా ఇబ్బందులు ఉంటే ఎప్పటికప్పుడు జీఎస్టీ మండలి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్లుగా లింబాద్రి, వెంకటరమణ



లింబాద్రి



వి వెంకటరమణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (టీఎస్‌సీహెచ్‌ఈ) వైస్ చైర్మెన్-1గా ఆర్ లింబాద్రి, వైస్ చైర్మెన్-2గా వి వెంకటరమణలు నియమితులయ్యారు. ఈ మేరకు విద్యాశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. లింబాద్రి ప్రస్తుతం ఉస్మానియా విశ్వవిద్యాలయం వీసీ ఓఎస్డీగా పనిచేస్తున్నారు. గతంలో తెలంగాణ విశ్వవిద్యాలయానికి రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వహించారు. వైస్ చైర్మెన్-2గా నియమితులైన వి వెంకట రమణ హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ)లో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. హెచ్‌సీయూలో టెక్నాలజీ బిజినెస్ ఇంక్యూబేషన్ సెంటర్ సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. వారు ఈ పదవిలో మూడేండ్లపాటు కొనసాగుతారు. టీఎస్‌సీహెచ్‌ఈ కార్యదర్శిగా పనిచేస్తున్న ఎన్ శ్రీనివాసరావును మరో మూడేండ్లపాటు కొనసాగుతారు.

నేటి నుంచి ఐసెట్ తుదివిడత కౌన్సెలింగ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఐసెట్ తుదివిడత కౌన్సెలింగ్ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే సాంకేతిక విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. మంగళవారం ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని ప్రవేశాల కన్వీనర్ ఎ వాణీప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళ, బుధవారాల్లో అభ్యర్థులు వెబ్‌ఆప్షన్లు నమోదు చేయాలని పేర్కొన్నారు. ఈనెల 11న సీట్లు కేటాయిస్తామని తెలిపారు.

ఉనికి కోసమే కాంగ్రెస్ నాయకుల డ్రామాలు

పేదోడికి ఖర్చు లేకుండా డబుల్ బెడ్రూం ఇండ్లు

- కాళేశ్వరం ద్వారా నర్సాపూర్‌కు 94వేల ఎకరాలకు సాగునీరు
- అభివృద్ధిని అడ్డుకోవడం తగదు: డిప్యూటీ స్పీకర్



మాట్లాడుతున్న హరీశ్‌రావు

నవతెలంగాణ-నర్సాపూర్

ఉనికి కోసమే కాంగ్రెస్ నాయకులు డ్రామలాడుతున్నారని భారీనీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి తట్టుకోలేకే అడు గడుగునా అడ్డుతగులుగున్నారన్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని మార్కెట్‌యార్డ్ ఎదుట 500 డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణానికి డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జడ్పీచైర్‌పర్సన్ రాజమణిలతో కలిసి మంత్రి సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగసభలో ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఇండ్లు నిర్మించి లబ్దిదారుల చేతికి తాళంచెవి ఇచ్చి ఇండ్లల్లోకి పంపే వరకు సర్కారుదే బాధ్యత అన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల విషయంలో ప్రజలు మధ్యవర్తులను ఆశ్రయించవద్దని, అధికారులే ఇంటింటికీ వచ్చి లబ్దిదారులను గుర్తిస్తారని తెలిపారు. లబ్దిదారులను గుర్తించే బాధ్యతను కలెక్టర్‌కు అప్పగించినట్టు వివరించారు. కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల హయాంలో సర్కార్ దవాఖానాలంటేనే ప్రజలు జంకుతుండేవారని, టీఆర్‌ఎస్ ప్రభుత్వం సర్కారు దవఖానాలను అదునాతన పద్ధతిలో నిర్మించి మంచి వైద్యం అందించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. నర్సాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పరిచేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. గిరిజన తండాల్లో బీటీరోడ్లు కోసం రూ.64కోట్లు మంజూరు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నర్సాపూర్ నియోజకవర్గానికి 94వేల ఎకరాలకు నీరు అందిస్తామని చెప్పారు. గతంలో ఇండ్ల పట్టాలిచ్చి చేతులు దులుపుకున్న కాంగ్రెస్.. నేడు ఇండ్ల నిర్మాణం చేపడుతున్న టీఆర్‌ఎస్ ప్రభుత్వానికి అడ్డు తగలడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భారతి హొళికేరి, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ భూమారెడ్డి, గ్రంథాలయ చైర్మెన్ చంద్రాగౌడ్, ఆర్డీఓ వెంకటే శ్వర్లు, టీఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు మురళీధర్‌యాదవ్, ఎంపీపీలు, జడ్పీటీసీలు పాల్గొన్నారు.

టీఆర్‌ఎస్ అబద్ధాల కంపెనీ : ఉత్తమ్

నవతెలంగాణ-కరీంనగర్‌టౌన్/సిద్దిపేట

2019లో ఎన్నికలెప్పుడొచ్చినా ముఖ్యమంత్రి కుటుంబ పాలనను తరిమి కొడతారని, కేసీఆర్, కేటీఆర్ అబద్ధాల కంపెనీ నడుపుతున్నారని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు కోసం కరీంనగర్ జిల్లా కేంద్రంలో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ చేపట్టిన మూడోరోజు ఆమరణ దీక్షకు సోమవారం ఆయన సంఘీభావం ప్రకటించారు. అనంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ... రాబోయే ఎన్నికల్లో ఓటమి భయంతో ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నీ అబద్ధాలే మాట్లాడుతున్నారని ఆరోపించారు. నేరెళ్ల బాధితులకు అండగా నిలిచేందుకు వచ్చిన లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్‌ను అవమానపర్చే విధంగా సీఎం వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండించారు. 2009 డిసెంబర్ 7న అర్ధరాత్రి కవిత అప్పటి లోక్‌సభ స్పీకర్‌కు ఫోన్ చేసి తన తండ్రి చావుబతుకుల మధ్య ఉన్నారని, ఆదుకోవాలని కోరిన విషయాన్ని మీరాకుమార్ తనతో స్వయంగా చెప్పారని గుర్తు చేశారు. ఆమె స్పందించి అదే రాత్రి కేంద్ర హోంమంత్రి చిదంబరంతో మాట్లాడారని, రాష్ట్ర ఏర్పాటులోనూ ప్రత్యేక కృషి చేశారని వివరించారు. మిషన్ భగీరథ పేరుతో రూ. 40వేల కోట్ల ప్రజాధనాన్ని కమీషన్లతో పంచుకుంటున్నారని ఆరోపించారు. కరీంనగర్‌కు హార్టికల్చర్ యూనివర్సిటీ, ఐటీ, లెదర్ పార్కు, నేదునూరు గ్యాస్ విద్యుత్ ప్లాంట్, తదితర హామీలు ఏమైనాయని ప్రశ్నించారు. మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయాలని దీక్ష చేపడితే పోలీసులచే అడ్డంకులు సృష్టించడం శోచనీయమన్నారు. శాసన మండలి కాంగ్రెస్‌పక్ష నేత షబ్బీర్ అలీ మాట్లాడుతూ అవసరాల కోసం రంగులు మార్చే ఊసరవెల్లి కేసీఆర్ అని అన్నారు. దీక్షలో కాంగ్రెస్ శాసన సభా పక్ష ఉప నేత టి.జీవన్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లు రవి, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ ఆకుల లలిత, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఆరెపల్లి మోహన్, ఓబీసీ రాష్ట్ర అధ్యక్షులు చిత్తరంజన్ దాస్ పాల్గొన్నారు.

ముగిసిన కమింగా కస్టడీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

డ్రగ్స్ వ్యవహారంలో కీలక పాత్ర పోషించిన నెదర్లాండ్స్ దేశస్థుడు మైక్ కమింగా కస్టడీ ముగిసింది. సోమవారం మధ్యాహ్నం ఆబ్కారీ శాఖ అధికారులు ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు. డ్రగ్స్ రవాణలో మైక్ కమింగాను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కమింగా నుంచి మరింత సమాచారం రాబట్టేందుకు ఆబ్కారీ శాఖ అధికారులు విచారణ కోసం మూడు రోజుల పాటు కస్టడీ తీసుకున్నారు. ఈ విచారణలో రాష్ట్రానికి డ్రగ్స్ ఎక్కడి నుంచి సరఫరా అవుతున్నాయి.. అంతర్జాతీయ డ్రగ్స్ మూటాతో ఉన్న సంబంధాలు.. సినీ పరిశ్రమలో ఎవరెవరికి డ్రగ్స్ సరఫరా చేశారన్న విషయాలపై సిట్ పోలీసులు విచారించినట్టు తెలిసింది. నెదర్లాండ్స్, లాటిన్ అమెరికా, నైజీరియా లాంటి దేశాల నుంచి రాష్ట్రానికి డ్రగ్స్ సరఫరా అవుతున్నట్టు కమింగా వెల్లడించినట్టు సమాచారం. నెదర్లాండ్స్ నుంచి గత నాలుగేండ్ల క్రితం వచ్చి సినీ తారలు ఎక్కువగా నివసించే మాదాపూర్ పరిసర ప్రాంతాల్లో నుంచే డ్రగ్స్ సరఫరా సరఫరా జరుగుతున్నట్టు కమింగా వెల్లడించాడు. డ్రగ్స్ కేసులో ప్రధాన నిందితుడు కెల్విన్ ద్వారానే డ్రగ్స్ సరఫరా చేసేవాడినని, కెల్విన్ సినీ పరిశ్రమలోని కొందరు పెద్దలతో పరిచయాలు పెంచుకుని వారి ద్వారా డ్రగ్స్ సరఫరా చేసినట్టు తెలిపారు.

పోలీసులకు టాక్టిఫుల్ ట్రైనింగ్ ఎంతో అవసరం : డీజీపీ అనురాగ్‌శర్మ

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

మారుతున్న కాలానికి అనుగుణంగా ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి పోలీసులకు వ్యూహాత్మక చర్యల్లో శిక్షణ(ట్రైనింగ్ ఆఫ్ టాక్టిఫుల్) ఎంతో అవసరమని రాష్ట్ర డీజీపీ అనురాగ్‌శర్మ అన్నారు. వికారాబాద్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో ఏడు జిల్లాలు, నాలుగు పోలీసు కమిషనరేట్‌లకు చెందిన 56 మంది పోలీసులకు టీఓటీ లో శిక్షణను ఇచ్చారు. పోలీసు శాఖలో తొలి సారిగా హైదరాబాద్ రీజియన్ ఐజీ స్టీఫెన్ రవీంద్ర నేతృత్వంలో సాగిన ఈ శిక్షణాముగింపు కార్యక్రమానికి డీజీపీ అనురాగ్‌శర్మ ముఖ్యఅతిధిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పోలీసు శాఖలో చేరినప్పుడు పొందే శిక్షణతోటే సరిపోదని, అవసరానికి అనుగుణమైన శిక్షణ తీరు తెన్నులను రూపొందించుకుంట్నూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందని అన్నారు. మారుతున్న కాలంలో నేరప్రవృత్తి కూడా కొత్త పుంతలు తొక్కుతున్నదని, ఆ ఎత్తుగడలకు పై ఎత్తులు వేస్తు శాంతి భద్రతల పరిరక్షణ సాగించాలని ఆయన అన్నారు. ఇందులో శిక్షణ పొందిన ఏడుగురు ఎస్ఐలు కలిపి మొత్తం 56 మంది పోలీసులకు డీజీపీ ఈ సందర్భంగా సర్టిఫికేట్లను అందచేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీజీల అంజనీకుమార్, గోపికృష్ణతో పాటు పలువురు ఐజీలు, డీఐజీలు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జీఎస్టీపై కేసీఆర్ కొత్త డ్రామా: రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



జీఎస్టీ విషయంలో కోర్టును ఆశ్రయిస్తామంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలుగుదేశం తెలంగాణ శాఖ కార్యనిర్వాహక అధ్యక్షులు ఎ. రేవంత్‌రెడ్డి విమర్శించారు. సోమవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడుతూ జీఎస్టీ నష్టాలపై అసెంబ్లీలో చర్చించకుండా బిల్లును ఆమోదించారని ఆరోపించారు. సహారా, ఈఎస్ఐ కుంభకోణాల్లో సీబీఐ కేసుల నుంచి తప్పించుకునేందుకే కేంద్రానికి జీఎస్టీపై కేసీఆర్ మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. కేసీఆర్‌ను ముఖ్యమంత్రి అయ్యాక సీబీఐ రెండు సార్లు విచారించిందని చెప్పారు. కేసు విషయాన్ని తాము బయట పెట్టడంతో కేసీఆర్ జీఎస్టీపై కొత్త డ్రామాకు తెరతీశారని తీవ్ర విమర్శలు చేశారు. తన మెడపై కత్తిలా వేలాడుతున్న సీబీఐ కేసుల నుంచి బయటపడటానికి, జైలుకు వెళ్లకుండా ఉండటానికి కేంద్రం ముందు మోకరిల్లుతున్న కేసీఆర్, జీఎస్టీపై కోర్టుకు వెళ్లనున్నట్టు కొత్త నాటకానికి తెరతీశారని చెప్పారు. సీఎం కేసీఆర్ తాజాగా నిర్వహించిన సమీక్షలో జీఎస్టీ మూలంగా ప్రభుత్వంపై రూ. 30 వేల కోట్ల అదనపు భారం పడుతుందని చెప్పారని అన్నారు. కేంద్రం సానుకూలంగా స్పందించకపోతే కోర్టుకుపోతామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అసెంబ్లీలో సరైన చర్చ చేయకుండా హడావిడిగా బిల్లుకు అమోదం తెలియజేయడం పట్ల నిరసన తెలిపారు. బిల్లు అమోదంలో మీరే భాగస్వాములావుతారు..మీరే అమోదిస్తారు..మీరే భారాన్ని పెంచుతారు..మళ్లీ మీరే దాన్ని తగ్గించాలని అంటారు..కేసు పెడతామని కూడా మీరే చెబుతున్నారని విమర్శించారు. దేశంలో బీజేపీ పాలిత రాష్ట్రాల కంటే ముందుగా జీఎస్టీకి మద్దతు తెలిపిన కేసీఆర్, చేయాల్సినంతా చేసి ఇప్పుడు న్యాయస్థానానికి వెళతాననడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు.

ఓ వైపు ఐఎస్... మరోవైపు అమెరికా



జలాలాబాద్ ఐరాస శరణార్థి శిబిరంలో అఫ్ఘాన్ చిన్నారులు (ఫైల్)

ఇద్దరి మధ్య నలిగిపోతున్న అఫ్ఘాన్ గ్రామాలెన్నో...

- స్వంత దేశంలో శరణార్థులుగా మారుతున్న అఫ్ఘాన్ పౌరుల దీనగాథ

కాబూల్ : అఫ్ఘాన్ ప్రజల గోస అంతా ఇంతా కాదు. తాలిబాన్, ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్), అమెరికా సంకీర్ణ బలగాలు...వీటి మధ్య అక్కడి సాధారణ పౌరుడి జీవితం నరకప్రాయంగా మారింది. సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లి తలదాచుకునే దుస్థితి వచ్చింది. తీవ్రవాద గ్రూపులు ఎప్పుడు ? ఏ క్షణం ? హఠాత్తుగా ఊడిపడతాయో తెలియదు. అమెరికా సంకీర్ణ బలగాలు నెత్తిమీద ఎప్పుడు బాంబుల వర్షం కురిపిస్తుందో తెలియదు. అంతర్యుద్ధం కారణంగా తమ దేశంలోనే అనాథలగా, శరణార్థులుగా అఫ్ఘాన్ పౌరులు రోజులు వెళ్లదీస్తున్నారు. దీనికి చిన్న ఉదాహరణ ఆచిన్, హస్కా మేనా అనే జిల్లాల్లోని గ్రామాలే. ఇవి దక్షిణ అఫ్ఘాన్‌లోని నాఘర్హర్ ప్రావిన్స్‌లో ఉన్నాయి. హస్కా మేనా జిల్లాకు చెందిన పస్తూ తెగకు చెందిన ఒక వ్యక్తి మాట్లాడుతూ..."మా మామ గూఢాచర్యం చేశాడని, నిఘా ఏజెంట్ అని ఐఎస్ తీవ్రవాదులు నరికి చంపారు. మిగతా కుటుంబ సభ్యుల్ని కూడా చంపుతామని ఐఎస్ హెచ్చరించటంతో మేమంతా అక్కడ్నుంచి వేరే చోటకు వెళ్లి తలదాచుకున్నా"మని తెలిపాడు. ఇలా ప్రాణాలు అరచేత పట్టుకొని వచ్చినవారందరికీ అఫ్ఘాన్ ప్రభుత్వం జలాలాబాద్‌లో ఆశ్రయం కల్పించింది. ఆచిన్ జిల్లాకు చెందిన ఓ శరణార్థి మాట్లాడుతూ..."అఫ్ఘాన్ పౌరుల పై ఐఎస్ తీవ్రవాదులు చేసిన ఆగడాలు అన్నీ ఇన్నీ కావు. మరోవైపు అఫ్ఘాన్ సైనికులు, అమెరికా సంకీర్ణ బలగాల దాడులు మా గ్రామాల్ని చిన్నాభిన్నం చేశాయి. అమెరికా 'మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్' ప్రయోగించింది...మాపైనే"అని అన్నారు.

అమెరికా చేసిన నష్టం అంతా ఇంతా కాదు !

అఫ్ఘాన్ యుద్ధంలో అమెరికా సంకీర్ణ బలగాలు సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. ఆచిన్ జిల్లాలో ఐఎస్ ఉగ్రవాదులున్నారన్న అనుమానంతో ఈ ఏడాది ఏప్రిల్‌లో 'మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్'ను అమెరికా ప్రయోగించింది. ఈ బాంబు ప్రయోగించటం వల్ల 90 మంది ఐఎస్ ఉగ్రవాదులు చనిపోయారని అమెరికా చెప్పుకుంది. ఈ బాంబు కారణంగా పదుల సంఖ్యలో గ్రామాలు దెబ్బతిన్నాయి. సాధారణ పౌరులెంతమంది చనిపోయారన్న సమాచారం బయటకు రాలేదు. ఇలా బాంబుదాడులు, డ్రోన్ దాడులు, వైమానిక దాడుల వల్ల 2.3 లక్షల మంది శరణార్థులుగా మారారని ఐక్యరాజ్యసమితి శరణార్థి విభాగం తేల్చింది. అనధికారికంగా ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.

అఫ్ఘాన్ యుద్ధం గురించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల కీలక వ్యాఖ్యలు చేసినట్టు తెలిసింది. ఈ యుద్ధంలో 'విజయం' కన్నా...అమెరికా ఓటమే ఎక్కువగా కనబడుతున్నదని ఆర్మీ జనరల్ జాన్ నికోలస్, ఇతర సిబ్బందితో జరిగిన సమావేశంలో ట్రంప్ అన్నారట. అఫ్ఘనిస్తాన్‌లో అమెరికా బలగాలకు కమాండర్ ఇన్ చీఫ్‌గా జాన్ నికోలస్ ఉన్నారు. సమావేశంలో నికోలస్‌పై ట్రంప్ తీవ్రంగా మండిపడ్డారని, త్వరలో కమాండర్ ఇన్ చీఫ్ పదవి నుంచి తొలగిస్తారన్న వార్తలు వెలువడ్డాయి. అఫ్ఘాన్‌కు మరిన్ని దళాలు పంపటమంటే...అది మరో ఇరాక్, మరో వియత్నాంలా సుదీర్ఘ యుద్ధమవుతుందని ట్రంప్ అభిప్రాయపడ్డారని సమాచారం !

తాలిబన్, ఐఎస్ కలిసి..

50 మందిని చంపేశారు

కాబూల్ : సంక్షోభిత అఫ్ఘనిస్తాన్‌లో వైరి వర్గాలైన తాలిబన్, ఇస్లామిక్ స్టేట్ (గ్రూప్(ఐసిస్)లు ఒక్కటయ్యాయి. ఇరువర్గాలు కూడబలుక్కుని సుమారు 50 మందిని చంపేశాయి. సర్-ఇ-పుల్ ప్రావిన్సులో శనివారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సయాద్ జిల్లాలోని ఓమారుమూల గ్రామమైన మిర్జావలంగ్‌పై ఉగ్రవా దులు విరుచుకుపడ్డారు. స్థానిక రక్షక పోలీసులు ఉగ్రవాదులకు అడ్డు పడటంతో ఇరువర్గాల మధ్య దాదాపు రెండు రోజుల పాటు హోరాహోరీ పోరు సాగింది. ఈ దాడిలో తీవ్రవాదులదే పైచేయి అయింది. గ్రామంలోని మహిళలు, పిల్లలు సహా మొత్తం 50మందిని ఉగ్రవాదుల హత్య చేశారు. వీరిలో కొందరు తుపాకి కాల్పుల్లో ప్రాణాలు వదలగా.. చాలా మందిని గొంతు కోసి చంపారు. మృతుల్లో 44 మంది అమాయకులైన గ్రామస్తులు ఉన్నట్టు సమాచారం. ఎలాంటి రవాణా, సమాచార సౌకర్యాలు లేని ఆ పర్వత ప్రాంతం నుంచి కచ్చితమైన సమాచారం అందాల్సి ఉందని ప్రావిన్సు అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్టు వెల్లడించారు. దేశంలోని కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ దళాలపై పట్టు సాధించేందుకే రెండు తీవ్రవాద సంస్థలు చేతులు కలిపాయని భావిస్తున్నారు. ఐఎస్‌తో తమకు ఎటువంటి సంబంధాలు లేవని తాలిబన్ల నుంచి ప్రకటన విడుదలైంది. మిర్జావలంగ్ గ్రామంపై దాడిలో తాలిబాన్ ముజాహిదీన్‌లే పాల్గొన్నారన్నది ప్రకటన సారాశం.

బ్రెగ్జిట్ చెల్లింపులకు సిద్ధమవుతున్న బ్రిటన్

- పరిహారంగా రూ.3 లక్షల కోట్లు !

లండన్ : బ్రెగ్జిట్ పేరుతో ఐరోపా సమాజం (ఈయూ) నుంచి బ్రిటన్ వైదొలగినందుకు 40 బిలియన్ యూరోల (47.1 బిలియన్ డాలర్లు, అంటే రూ.3.06 లక్షల కోట్లు) పరిహారాన్ని ఈయూకి చెల్లించడానికి రంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు 'ది సండే టెలిగ్రాఫ్' ఒక కథనం ప్రచురించింది. పరిహారంగా 100 బిలియన్ యూరోలు చెల్లించాల్సి రావచ్చని తొలుత అంచనాలు రూపొందాయి.

తర్వాత అది 60 బిలియన్ యూరోల కు తగ్గి, చివరకు చర్చల తర్వాత 40 బిలియన్ యూరోలుగా ఖాయమ యింది. ఈ మొత్తాన్ని చెల్లించే విషయంలోనూ బ్రిటిష్ ప్రధాని థెరిసా మే రాజకీయంగా ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కోవడం అనివార్యంగా కనిపిస్తోంది. ఇంత భారీ మొత్తాన్ని చెల్లించడానికి కన్సర్వేటివ్ పార్టీ ప్రతినిధులూ ఇష్టపడడం లేదు. తాజా అంచనాల ప్రకారం 2019-21 బడ్జెట్టుపైనా గట్టి ప్రభావం పడనుంది. గత ఏడాది నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో బ్రెగ్జిట్‌కు అనుకూలంగా 52% మంది బ్రిటన్‌వాసులు ఓట్లు వేసిన విషయం తెలిసిందే.

వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు

అణు కార్యక్రమంపై ఉ.కొరియా

- ఐరాస ఆంక్షలపై ఆగ్రహం

ప్యాంగ్యాంగ్ : తమపై మళ్లీ ఆంక్షలు విధిస్తూ తీర్మానం చేసిన ఐక్యరాజ్యసమితిపై ఉత్తర కొరియా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తమ దేశ సార్వభౌమత్వాన్ని ప్రమాదంలోకి నెట్టారని, సరైన చర్యల్ని చేపడతామని ఉ.కొరియా అధికారిక పత్రిక 'కొరియా సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ' (కేసీఎన్ఏ) వార్తా కథనం పేర్కొన్నది. తమకు వ్యతిరేకంగా అమెరికా కుట్రలు, రెచ్చగొట్టే ధోరణి కొనసాగినన్ని రోజులు చర్చలకు తావు లేదని ఉ.కొరియా ప్రభుత్వం స్పష్టం చేసింది.

మా సార్వభౌమత్వాన్ని సవాల్ చేస్తూ...చర్చలంటే ఎలా అని ఉ.కొరియా ప్రశ్నించింది. చర్చల టేబుల్ పైకి 'అణు కార్యక్రమ'మనే అంశమే రాదని తెలిపింది. సముద్ర తీరం వెంబడి ఉన్న తమ భూభాగం సురక్షితమని అమెరికా భావించుకుంటే...పెద్ద తప్పు చేసినట్టేనని హెచ్చరించింది. అణు కార్యక్రమాన్ని నిలిపివేసే ప్రసక్తే లేదని, దానిని మరింత బలోపేతం చేసుకుంటామని 'కేసీఎన్ఏ' వార్తా కథనం తెలిపింది.

ద.కొరియా చర్చల ప్రతిపాదనలో నిజాయితీ లేదు

దక్షిణ కొరియా నుంచి వచ్చిన చర్చల ప్రతిపాదనను ఉ.కొరియా తోసిపుచ్చింది. మనీలాలో ఆదివారం జరిగిన 'ఆసియాన్' దేశాల విదేశాంగ మంత్రుల సదస్సులో ద.కొరియా -ఉ.కొరియా విదేశాంగ మంత్రులు కలుసుకున్నారు. ఇరువురు నేతలు కరచాలనం చేసి, మర్యాదపూర్వకంగా పలకరించుకున్నారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించటం కోసం సైనిక చర్చలు జరుపుదామని ద.కొరియా విదేశాంగ మంత్రి కాంగ్ ప్రతిపాదించారు. కానీ ఈప్రతిపాదనలో నిజాయితీ లేదని ఉ.కొరియా విదేశాంగ మంత్రి రీ తప్పుబట్టారు. ఓ వైపు అమెరికాతో కలిసి, తమపై ఒత్తిడి తీసుకొస్తున్నారని విమర్శించారు.

శాంతి చర్చలకే మొగ్గు : ద.కొరియా అధ్యక్షుడు మూన్

ఆయుధ, సైనిక బలంతో ఉ.కొరియాను దెబ్బకొట్టాలన్న అమెరికా వ్యూహాన్ని ద.కొరియా అధ్యక్షుడు జే మూన్ గ్రహించినట్టు కనపబడుతున్నారు. యుద్ధం ఎంత నష్టదాయకమో తెలిసిన ఆయన, శాంతి మార్గం సరైందని పదే పదే చెబుతున్నారు. ఉ.కొరియా విషయంలో అన్ని ఆప్షన్స్ తెరిచే ఉంచామని శ్వేతసౌధం జాతీయ భద్రతా సలహాదారు మెక్‌మాస్టర్ ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. అధ్యక్షుడు ట్రంప్ సైతం తరుచూ జే మూన్‌తో ఫోన్ సంభాషణలు జరుపుతున్నారు. తాజాగా సోమవారంనాడు జే మూన్‌కు ట్రంప్ ఫోన్ చేసి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా జేమూన్ మాట్లాడుతూ...శాంతియుతమై, దౌత్యమార్గంలో సమస్యకు పరిష్కారం కనుగొనడానికే ప్రాధాన్యత ఇస్తున్నట్టు ట్రంప్‌నకు తెలియజేశారట.



రన్‌వేపై ఢీకొన్న విమానాలు

- రెక్కలు తెగిపడి..

టొరంటో : రెండు విమానాలు రన్‌వేపై ఢీకొన్నాయి. విమానాల రెక్కలు ఒకదానికొకటి తగిలి పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో విమానాలు బాగా దెబ్బతినప్పటికీ ప్రయాణికులెవరికీ గాయాలు కాలేదు. ఈ ఘటన టొరంటో విమానాశ్రయంలో జరిగింది. పోలాండ్‌కు చెందిన బోయింగ్ 787విమానం టొరంటోలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో రన్‌వే పై టేకాఫ్‌కు సిద్ధమవుతోంది. అదే సమయంలో కెనడాకు చెందిన ఎయిర్ కెనడా విమానం ల్యాండ్ అయి ముందుకు వస్తోంది. ఈ సమయంలో రెండు విమానాల రెక్కలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో విమానాలు భారీగా దెబ్బతిన్నాయి.

అయితే ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నట్టు విమానాశ్రయ అధికా రులు వెల్లడించారు. ఒక్కో విమానంలో 200కుపైగా ప్రయాణికులు ఉన్నట్టు సమాచారం. ఇటీవలే ఇండోనేషియాలో రెండు విమానాలు రన్‌వేపై ఇదే విధంగా ఢీకొన్నాయి. ఆ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు.

పాసైతేనే పై తరగతికి..!

5,8 తరగతుల్లో డిటెన్షన్ విధానానికి కేంద్రం చర్యలు

- విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడిచే ప్రయత్నం
- అమల్లోకి వస్తే బాల్యవివాహాలు, బాలకార్మికులు పెరిగే అవకాశం
- వ్యతిరేకిస్తున్న విద్యావేత్తలు, ప్రజాసంఘాలు



విద్యాప్రమాణాల పేరుతో విద్యార్థులను పాఠశాలకు దూరం చేసే విధానాలకు కేంద్ర ప్రభుత్వం స్వీకారం చుడు తున్నది. 5,8 తరగతుల్లో డిటెన్షన్ విధానాన్ని తీసుకురా వడానికి ముమ్మర ప్రయత్నాలను చేస్తున్నది. ప్రస్తుతం జరిగే పార్లమెంట్ సమావేశాల్లో విద్యాహక్కు చట్టాన్ని సవరిస్తూ ఈ మేరకు బిల్లు తీసుకురావడానికి పూనుకున్నది. ఇదే జరిగితే బాల్యవివాహాలతో పాటు బాలకార్మికులూ భారీగా పెరిగే అవకాశముందని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ప్రస్తుతం రాష్ట్రంలో నాన్‌డిటెన్షన్ విధానం కొనసాగుతోంది. ఒకటో తరగతిలో చేరిన విద్యార్థి, నిరాటంకంగా పదో తరగతి వరకు చదవచ్చు. 1970-71 నుంచి ఈ విధానం(నాన్‌డిటెన్షన్) కొనసాగుతోంది. గతంలో ఏడో తరగతిలో కామన్ పరీక్షలు, పదో తరగతిలో పబ్లిక్ పరీక్షలు నిర్వహించేవారు. ప్రయివేటు యాజమాన్యాలు పాస్‌గ్యారంటీ పేరుతో తల్లిదండ్రుల నుంచి ఎక్కువ ఫీజులు వసూలు చేయడంతో 2005లో ఏడో తరగతిలో కామన్ పరీక్షల విధానాన్ని పాఠశాల విద్యాశాఖ రద్దు చేసింది. దీనికి బలాన్నిచ్చే విధంగా 2010లో విద్యాహక్కు చట్టం వచ్చింది. దీనిలోని సెక్షన్ 16 ప్రకారం...'బడిలో చేరిన బాలలను ప్రాథమిక విద్య పూర్తయ్యే వరకూ ఏ తరగతిలోనైనా మళ్లీ కొనసాగించరాదు. బడి నుంచి తీసేయరాదు' అని స్పష్టంగా పేర్కొన్నది. కానీ గతేడాది కేంద్రంలోని బీజేపీ సర్కార్ ఈ చట్టానికి తూట్లు పొడిచే విధంగా డిటెన్షన్ విధానాన్ని తెరమీదికి తీసుకొచ్చింది. అన్ని రాష్ట్రాల అభిప్రాయాలను సేకరించింది. దీనికి బీజేపీ పాలిత ప్రాంతాల నుంచి మద్దతు లభించింది. అయితే అప్పట్లో తెలంగాణ ప్రభుత్వం డిటెన్షన్ విధానాన్ని వ్యతిరేకించింది. ప్రస్తుతం 5,8 తరగతుల్లో డిటెన్షన్ విధానం తీసుకొస్తున్నట్టు ఇటీవల కేంద్రమానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం జరిగే పార్లమెంట్ సమావేశాల్లో దీనిపై బిల్లు పెట్టే అవకాశముందని ప్రకటించారు. ఇదే జరిగితే రాష్ట్రంలో బాలకార్మికులు, బాల్యవివాహాలు మరింత పెరిగే అవకాశాలున్నాయి. ప్రస్తుతం కేంద్రంతో ఉన్న సన్నిహిత్య సంబంధంతో తెలంగాణ ప్రభుత్వం గతంలో చెప్పిన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే అవకాశం లేకపోలేదని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


డ్రాపౌట్స్ పెరిగే అవకాశం...

తెలంగాణ రాష్ట్రంలో బడికి దూరమవుతున్న విద్యార్థుల సంఖ్య భారీగానే ఉంది. అధికారిక లెక్కల ప్రకారమే 2015-16 విద్యాసంవత్సరంలో 36.99శాతం మంది విద్యార్థులు బడికి దూరమయ్యారు. వీరిలో బాలురు 38.18 శాతం, బాలికలు 35.17శాతంగా ఉన్నారు.

ఎస్సీ విద్యా ర్థుల్లో 41.14శాతం డ్రాపౌట్స్ ఉండగా, ఎస్టీల్లో 61.33శాతంగా ఉంది. 2006-07 విద్యాసంవత్సరంలో 8,30,606 మంది విద్యా ర్థులు ఒకటో తరగతిలో చేరగా, వారిలో పదోతరగతి (2015-16 విద్యాసంవత్సరం) చదివిన వాళ్ల కేవలం 5,23,324 మంది విద్యార్థులే. ఆదిలాబాద్, కరీంన గర్, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో డ్రాపౌట్స్ గతం కంటే పెరిగాయి. ప్రస్తుతం డిటె న్షన్ విధానం అమలైతే రాష్ట్రంలో చదువుకు దూరమయ్యే వారి సంఖ్య మరింత పెరిగే అవకాశ మున్నది. వీటికితోడు బాల్యవివాహాలు కూడా పెరుగుతాయని స్వచ్ఛంద సంస్థల ప్ర తినిధులు చెబుతున్నారు. వీటన్నింటి ఫలితం అక్షరాస్యతపై పడనున్నది.

బాధ్యత నుంచి తప్పుకునేందుకే

విద్యారంగ బాధ్యత నుంచి తప్పుకునేందుకు బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలో భాగమే డిటెన్షన్ విధానం. విద్యార్థులకు మార్కులు ఎందుకు తక్కువ వస్తున్నాయనేది ఆలోచించకుండా, తక్కువ మార్కులు వచ్చాయనే పేరుతో చదువుకు దూరం చేయాలనే ఆలోచన మంచిదికాదు. ఈ విధానంపై కేంద్రం పునరాలోచించాలి. విద్యాకాశాయీ కరణలో భాగంగానే దీన్ని తీసుకొస్తున్నది.



కోట రమేశ్,
ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి

విద్యావిధానానికి గొడ్డలిపెట్టు

డిటెన్షన్ విధానం దేశ విద్యావిధానానికి గొడ్డలి పెట్టు లాంటిది. బడిపిల్లలకు సరైన వసతులు కల్పించకుండా, ఇలాంటి విధానాలు తీసుకురావడం సరికాదు. డిటెన్షన్‌పై పార్లమెంట్‌లో చట్టం చేయాలనే ఆలోచన మానుకోవాలి. ఈ విధానాన్ని కేవలం బీజేపీ పాలిత ప్రాంతాల్లో మాత్రమే మద్దతు లభిం చింది. తక్కువ మార్కులు రావడానికి ప్రభుత్వం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రు లది బాధ్యత కానీ శిక్ష విద్యార్థులకు వేయొద్దు.



నాగటి నారాయణ, విద్యావేత్త

బాల్యవివాహాలు పెరుగుతాయి

డిటెన్షన్ విధానంతో బాల్యవివాహాలు పెరిగే అవకాశముంది. 220రోజులు చదివిన విద్యార్థి ఫెయిల్ అయితే కేవలం విద్యార్థులనే బాధ్యులను చేయడం సరికాదు. పాసైతేనే పైతరగతికి పంపిస్తాం..లేకుంటే ఇంటికి పంపిస్తామనడం బాలల హక్కులకు భంగం కలిగించడమే అవుతుంది. ఈ విధానాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి.



అచ్యుతరావు,
బాలల హక్కుల సంఘం

సరికొత్త ఇమేజ్ తెచ్చే లై..



నితిన్

'గత చిత్రాలతో పోలిస్తే 'లై' నా కెరీర్‌కు ఓ సరికొత్త ఇమేజ్ తీసుకొస్తుంది. రెగ్యులర్ సినిమాల మాదిరిగా కాకుండా చాలా డిఫరెంట్‌గా, స్టయిలీష్‌గా ఉండే చిత్రమిది' అని అంటున్నారు కథానాయకుడు నితిన్. హను రాఘవపూడి దర్శకత్వంలో నితిన్, మేఘా ఆకాష్ జంటగా నటించిన చిత్రం 'లై'. ఈనెల 11న ఈచిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో సోమవారం నితిన్‌తో మీడియా జరిపిన ఇంటర్వ్యూ విశేషాలు..

ఈ సినిమా నేపథ్యం ఏమిటి?

– ఆవారాగా తిరిగే కుర్రాడు యు.ఎస్. వెళ్ళి బాగా డబ్బున్న అందమైన అమ్మాయిని పెళ్లాడి డాలర్స్ సంపాదించుకోవాలని అనుకుంటాడు. అలా యు.ఎస్. వెళ్లి ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నాడనేది మెయిన్ కాన్సెప్ట్. సినిమా స్టార్టింగ్ నుండి ఎండింగ్ వరకు చాలా ఇంట్రెస్టింగ్‌గా, థ్రిల్లింగ్‌గా ఉంటుంది. రెగ్యులర్‌గా కాకుండా లవ్, ఎమోషన్, స్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉండే చిత్రమిది. యాక్షన్ సీన్స్ కోసం బ్యాంకాక్ వెళ్లి కొంత ట్రైనింగ్ తీసుకున్నాను. కిచ్చ మాస్టర్ ఫెంటాస్టిక్ యాక్షన్ సీన్స్ కంపోజ్ చేశారు. ముఖ్యంగా క్లైమాక్స్‌లో వచ్చే ఫైట్ చాలా హైలైట్‌గా ఉంటుంది. ఈ ఫైట్‌లో అర్జున్‌గారు డూప్ లేకుండా రియలిస్టిక్‌గా చేశారు.

అర్జున్‌తో మళ్ళీ వర్క్ చేయడాన్ని ఎలా ఫీలవుతున్నారు?

– 'శ్రీ ఆంజనేయం' తర్వాత అర్జున్‌తో వర్క్ చేయడం చాలా హ్యాపీగా వుంది. ఫస్ట్‌టైమ్ ఆయన విలన్‌గా యాక్ట్ చేశారు. వెరీ స్టయిలీష్‌గా ఉండే క్యారెక్టర్ ఆయనది. ఆయన లేకపోతే ఈ సినిమా ఇంత బాగా వచ్చి ఉండేది కాదు. మా ఇద్దరి మధ్య జరిగే గేమ్ చాలా థ్రిల్లింగ్‌గా వుంటుంది. ఎత్తుకి పై ఎత్తులు వేసుకుంటూ ఇద్దరి క్యారెక్టర్స్ పోటా పోటీగా ఉంటాయి. 'శ్రీ ఆంజనేయం' టైమ్‌లో అర్జున్ ఎలా ఉన్నారో ఇప్పటికీ అలాగే ఉన్నారు. ఆయన్ని చూసి నేను చాలా విషయాలు నేర్చుకున్నాను.

ఈ సినిమా మీ కెరీర్‌కు ఎలా ఉపయోగపడుతుంది?

– డెఫినెట్‌గా 'లై' నాకొక కొత్త ఇమేజ్ తెస్తుంది. అలాగే నా కెరీర్‌లో ఒక మెమొరబుల్ మూవీగా నిలుస్తుందని నమ్ముతున్నాను.

మీరు విన్న కథ స్క్రీన్‌పై చూసుకున్నప్పుడు ఎలా అన్పించింది?

– హను నాకు కథ చెప్పినప్పుడు ఎలాగైతే ఫీలయ్యానో, సినిమా చూసినప్పుడు కూడా అదే ఫీలింగ్ కలిగింది. చెప్పిన దాని కంటే హండ్రెడ్ పర్సెంట్ స్ట్రాంగ్‌గా ఈ సినిమా తీశాడు. మంచి స్టయిలీష్ సినిమా చూశాం అనే ఒక ఎమోషనల్ ఫీలింగ్‌తో ఆడియన్స్ బయటికి వస్తారని ఆశిస్తున్నాం.

మణిశర్మ మ్యూజిక్ సినిమాకి ఎంతవరకు ప్లస్ అయ్యింది?

– ఆయనొక లెజెండరీ పర్సన్. ఈ సినిమాకి ప్రాణం పెట్టి మ్యూజిక్ చేశారు. ముఖ్యంగా ఇలాంటి సినిమాకి రీ–రికార్డింగ్ చాలా ఇంపార్టెంట్. ఆయన రీరికార్డింగ్ చేయటంలో దిట్ట. ఈ సినిమాకి రీరికార్డింగ్ ఎక్స్‌ట్రార్డినరీగా చేశారు. 'లగ్గం టైమ్', 'సన్‌షైన్', 'బొమ్మోట' సాంగ్స్ ఆల్‌రెడీ సూపర్‌హిట్ అయ్యాయి. హాలీవుడ్ రేంజ్‌లో మంచి మ్యూజిక్ ఇచ్చారు. 'లై'తో మళ్లీ ఆయన మంచి ఫామ్‌లోకి వచ్చారు.

మేఘా ఆకాష్ క్యారెక్టర్ ఎలా ఉంటుంది?

– ఈ సినిమా హీరో, హీరోయిన్ల మధ్య వచ్చే లవ్ ట్రాక్ చాలా కొత్తగా ఉంటుంది. ఈ క్రమంలో వారు చెప్పుకునే చిన్న చిన్న అబద్ధాలు ఆసక్తికరంగా ఉంటాయి. ఇందులో చైత్ర క్యారెక్టర్‌లో మేఘా ఆకాష్ అద్భుతంగా నటించింది. బాగా రిచ్ అమ్మాయి. ఈ సినిమాకి బాగా యాప్ట్ అయ్యింది. మంచి టాలెంట్ ఉంది. డెఫినెట్‌గా ఫ్యూచర్‌లో స్టార్ హీరోయిన్ అవుతుంది. అలాగే ఇందులో సెపరేట్ కామెడీ ట్రాక్ అని ఏమీ ఉండదు. కథలో భాగంగా కామెడీ వస్తుంది. ముఖ్యంగా హీరో, హీరోయిన్ మధ్య వచ్చే లవ్ ట్రాక్ హ్యూమరస్‌గా ఉంటూ అందరినీ అలరిస్తుంది. అలాగే మధు చేసిన కామెడీ ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్విస్తుంది. ఆల్ కమర్షియల్ ఇంగ్రీడియంట్స్ ఈ చిత్రంలో వున్నాయి.

ఈ సినిమాలోనూ పవన్‌కళ్యాణ్‌ని ఇమిటేట్ చేశారట?

– 'తమ్ముడు' సినిమాలో లుంగి కట్టుకుని, బీడీ కాల్చే డ్యాన్స్ సీన్‌ని ఈ చిత్రంలో ఉపయోగించాం. పవన్‌కళ్యాణ్‌గారిని నీ సినిమాలకి బాగా వాడుకుంటున్నావ్ అని అందరూ అడుగుతున్నారు. కానీ నేను ఆయన సినిమాలు చూస్తూ పెరిగాను. ఆయనకి పెద్ద వీరాభిమానిని. లైఫ్‌లాంగ్ నేను చేసే సినిమాల్లో ఆయన చిత్రంలోని సీన్ ఏదో ఒకటి ఉపయోగిస్తాను. ఎందుకంటే ఆయనంటే నాకు అంత ఇష్టం.

తదుపరి చిత్రాల గురించి?

– ప్రస్తుతం పవన్‌కళ్యాణ్, త్రివిక్రమ్ నిర్మించే సినిమా చేస్తున్నాను. కృష్ణచైతన్య దర్శకుడు. మేఘా ఆకాష్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇది కూడా చాలా డిఫరెంట్‌గా ఉండే స్క్రిప్ట్. ప్రస్తుతం కొన్ని కథలు వింటున్నాను. ఇంకా ఏదీ ఫైనలైజ్ కాలేదు. అన్నీ చర్చల దశలోనే ఉన్నాయి.



మంచు విష్ణు

ఐ యామ్ ఫైన్.. థ్యాంక్యూ..

'ఆచారి అమెరికా యాత్ర' చిత్రం కోసం మలేషియాలో బైక్ యాక్షన్ సీక్వెన్స్‌లు చిత్రీకరిస్తున్న తరుణంలో కథానాయకుడు మంచు విష్ణు గాయపడిన విషయం విదితమే. ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఆయనకు యాక్సిడెంట్ జరిగిందని, విష్ణు కనీస జాగ్రత్తలు తీసుకుని ఉంటే బాగుండేదని..ఇలా రకరకాలుగా ఆయన అభిమానులు, సన్నిహితులు, శ్రేయోభిలాషులు సామాజిక మీడియాలో అభిమానం, ప్రేమతో కూడిన కామెంట్లు చేశారు. ఈ నేపథ్యంలో ఈ యాక్సిడెంట్‌పై వివరణ ఇస్తూ హీరో విష్ణు ఓ వీడియో క్లిప్‌ను సోషల్ మీడియాలో సోమవారం పోస్ట్ చేశారు. 'అందరికీ నమస్కారం. 'ఆచారి అమెరికా యాత్ర' చిత్రీకరణ సమయంలో జరిగిన ప్రమాదంలో నేను గాయపడ్డాను. ఈ విషయం ఇప్పటికే చాలా మందికి తెలుసు. ఎంతో మంది ఫోన్లు చేసి నా క్షేమ సమాచారం అడిగారు. వీటన్నింటికంటే ముందు.. మా అమ్మకి, నాన్నకి, అక్కకి, తమ్ముడికి, నా భార్య విన్నీకి ముందుగా నేను సారీ చెప్పాలి. ఎందుకంటే నేను తీసుకోని ఓ చిన్న జాగ్రత్త వల్ల వీళ్లంతా చాలా బాధపడ్డారు. వాళ్లతో సహా ఎంతో మంది స్నేహితులు, శ్రేయోభిలాషులు, అభిమానులు కూడా బాధపడ్డారు. వారందరికీ క్షమాపణ చెబుతున్నాను. రెండు మూడు రోజుల్లో అసలేం జరిగిందనే వీడియోను రిలీజ్ చేస్తాం. దీంతో నేను తప్పు చేశానా; జాగ్రత్తలు తీసుకోలేదా అనే విషయాలు అందరికీ తెలుస్తాయి. నాకు యాక్సిడెంట్ జరిగిందని తెలుసుకుని కళ్యాణ్‌రామ్ అయితే తిడుతూ ఎస్.ఎం.ఎస్.పంపాడు. నాపై తనకి ఉన్న ప్రేమకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను' అంటూ వీడియో క్లిప్‌లో మంచు విష్ణు అన్నారు.



అలియా భట్

సూపర్ బోరింగ్ ...

'ఒక నటిగా నిన్ను అందరూ ఇష్టపడుతున్నారంటే.. దానర్థం నువ్వు చాలా బోర్ కొడుతున్నావని. అందుకే ప్రతి మనిషికి పాజిటీవ్స్‌తోపాటు నెగటీవ్స్ కూడా ఉండాలి' అని అంటోంది అలియా భట్. విభిన్న పాత్రలను పోషిస్తూ బాలీవుడ్‌లో అతి తక్కువ టైమ్‌లోనే తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది అలియా. గతేడాది 'ఉడ్తా పంజాబ్'లో నటించి ప్రేక్షకుల మన్ననలు పొందింది. అంతేకాదు ఓ నటిగా తానేమిటో నిరూపించుకునే ప్రయత్నంలోనూ సఫలమైంది. నటనకు సంబంధించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో అలియా చెబుతూ, 'నటన విషయంలో నెగటీవ్స్‌తో కూడిన పాజిటీవ్స్‌ను నేను నమ్ముతాను. మనలో నెగటీవ్స్ లేకపోతే అది బోరింగ్‌గా ఉంటుంది. ప్రతి ఒక్కరు నిన్ను ఇష్టపడుతున్నారంటే నువ్వు సూపర్ బోరింగ్ అని దాని అర్థం. మనల్ని ఇష్టపడని వారుంటేనే నేను ఎక్కువగా హ్యాపీగా ఉంటాను. వాళ్లు ఎందుకు ఇష్టపడటం లేదో తెలుసుకుని వాటిని కరెక్ట్ చేసుకోవడానికి ఆస్కారం ఉంటుంది. అలా చేసినప్పుడు మనం కరెక్ట్‌గా మారతాం. దీంతో వాళ్లు కూడా తర్వాత మనల్ని లైక్ చేస్తారు' అంటూ కొత్త ఫిలాసఫీ చెప్పింది. అలియా ప్రస్తుతం 'రాజీ' చిత్రంలో నటిస్తోంది.

నవచిత్రం

లవ్లీ లుక్‌తో లవకుమార్



'జై లవకుశ' చిత్రంలో ఎన్టీఆర్

ప్రస్తుతం సినిమాలకు సంబంధించి వస్తున్న పబ్లిసిటీ ట్రెండ్ అందరిలోనూ మరింత క్యూరియాసిటీ కలిగిస్తోంది. ప్రేక్షకులను, సినీ వర్గాలను వీరితోపాటు ఓవర్సీస్ ప్రేక్షకులను సైతం మంత్రముగ్ధుల్ని చేసేలా సినిమాల పబ్లిసిటీ చేస్తున్నారంటే అతిశయోక్తి లేదు. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు సినిమా పబ్లిసిటీ క్షణక్షణానికి మారిపోతోంది. తమ చిత్రాలకు సంబంధించి ఏ విషయాన్ని రహస్యంగా ఉంచుకోవడానికి ఇప్పటి దర్శక, నిర్మాతలు ఏమాత్రం ఇష్టపడటం లేదు. దీంతో సదరు చిత్రాలకు సంబంధించి ప్రతి చిన్న అంశమూ పబ్లిసిటీకి పెద్ద మెటీరియల్‌గా మారిపోయింది. తెలుగునాట పబ్లిసిటీ సరికొత్త పోకడలు పోతోందని చెప్పడానికి ఇటీవల విడుదలైన ఎన్నో చిత్రాల తాలూకా పబ్లిసిటీ తీరుతెన్నులు చెప్పకనే చెబుతాయి. తాజాగా ఈ కోవలోకే ఎన్టీఆర్ నటిస్తున్న 'జై లవకుశ' చిత్రం కూడా చేరింది. ఎన్టీఆర్ త్రిపాత్రాభినయంలో తెరకెక్కుతున్న చిత్రం 'జై లవకుశ'. బాబీ దర్శకత్వం వహిస్తున్న ఈచిత్రంలో ఎన్టీఆర్ 'జై', 'లవ', 'కుశ'గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఇటీవల 'జై' పాత్రకు సంబంధించి ఓ టీజర్ విడుదల చేశారు. నెగటివ్ షేడ్స్‌తో పాటు నత్తి ఉన్న పాత్రగా 'జై' క్యారెక్టర్ ఇప్పటికే అందరికీ పరిచయమైపోయింది. ఇందులో రెండో పాత్రైన 'లవ'కుమార్‌ను పరిచయం చేస్తూ ఓ పోస్టర్‌ను చిత్రయూనిట్ సోమవారం విడుదల చేసింది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ని తలపిస్తూ చాలా సాఫ్ట్‌గా, అందంగా ఉన్న ఎన్టీఆర్ పోస్టర్ చూసిన ఎవ్వరైనా సరే 'ఎంతందంగా ఉన్నాడు..' అంటూ పాట పాడుకోవాల్సిందే. ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకంపై కళ్యాణ్‌రామ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో ఎన్టీఆర్‌కు జోడీగా రాశీఖన్నా, నివేదా థామస్‌లు నటిస్తున్నారు. దేవిశ్రీప్రసాద్ స్వరాలు సమకూరుస్తున్న ఈచిత్రాన్ని దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు దర్శక, నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

గాడ్‌ఫాదర్ తరహాలో..



భరత్ చౌదరి, కిరణ్‌రెడ్డి, డి.సురేష్‌బాబు

రానా, కాజల్, కేథరిన్ హీరోహీరోయిన్లుగా తేజ దర్శకత్వంలో సురేష్ ప్రొడక్షన్స్, బ్లూ ప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై సురేష్‌బాబు, భరత్ చౌదరి, ఎం.వి.కిరణ్‌రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న 'నేనే రాజు నేనే మంత్రి' చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఇటీవల ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో సురేష్‌బాబు మాట్లాడుతూ, 'ఈ చిత్రం ద్వారా బ్లూ ప్లానెట్ సంస్థ నిర్మాతలు భరత్‌చౌదరి, కిరణ్‌రెడ్డిలు ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నారు. సినిమా జోగేంద్ర, రాధల పాత్రలు చుట్టూ తిరుగుతుంది. మరో లేడీ పాత్ర సినిమాలో ఆసక్తికరంగా ఉంటుంది. లక్ష్య సాధనలో మనం కొన్నిసార్లు దారి తప్పుతాం. అలా తప్పుదారి పట్టిన హీరో తన తప్పును ఎలా కరెక్ట్ చేసుకుని విలన్ నుంచి హీరో ఎలా అయ్యాడనేది ఈ చిత్ర ఇతివృత్తం. 'నాయగన్', 'గాడ్‌ఫాదర్' లాంటి కథ ఇది. సినిమా కచ్చితంగా ప్రేక్షకులకు ఓ కొత్త ఫీలింగ్ ఇస్తుంది. అనూప్ రూబెన్స్ సంగీతం ఆకట్టుకుంటుంది. ఇదిలా ఉంటే ఈ నెల 11న మా చిత్రంతోపాటు 'లై', 'జయ జానకి నాయక' చిత్రాలు విడుదలవుతున్నాయి. మూడు సినిమాలు ఒకేసారి రావడం వల్ల కలెక్షన్ల విషయంలో ఇబ్బంది ఏర్పడుతుంది, ఇది మంచి పరిణామం కాదని ముగ్గురు నిర్మాతలతో కలిసి మాట్లాడటం జరిగింది. కానీ వినడం లేదు. నా సినిమాను తెలుగుతోపాటు తమిళంలో కూడా విడుదల చేస్తున్నాం' అని అన్నారు. "నేను రాజు నేనే మంత్రి' సినిమాకు యాప్ట్ టైటిల్. రానా ఆల్‌రౌండర్. బిజినెస్ విషయంలోనూ ఆయనకు మంచి పట్టుంది. ఆయనతో సినిమా చేయడం చాలా హ్యాపీగా ఉంది' అని నిర్మాత కిరణ్‌రెడ్డి తెలిపారు. మరో నిర్మాత భరత్ చౌదరి చెబుతూ, 'గతంలో డిస్ట్రిబ్యూటర్‌గా పనిచేశాను. ఈ చిత్రంతో నిర్మాతగా మారా. మా బ్యానర్‌లో ఫస్ట్ సినిమానే క్రేజీ ప్రాజెక్ట్ అవ్వడం ఆనందంగా ఉంది. విడుదలకు ముందే సేఫ్‌గా ఉన్నాం. తేజ అద్భుతంగా తెరకెక్కించారు. రానాని నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్లే చిత్రమిది' అని చెప్పారు.


రాఖీ పండుగ నేపథ్యంలో ఎన్నో ఎన్నో భావాలే..



నాగచైతన్య, కృష్ణ ఆర్.వి.మారిముత్తు, వివేక్ సాగర్

నాగచైతన్య తాజాగా నటిస్తున్న చిత్రం 'యుద్ధం శరణం'. ఈ చిత్రంలోని 'ఎన్నో ఎన్నో భావాలే..' అంటూ సాగే తొలిపాటను రాఖీ పండుగని పురస్కరించుకుని చిత్రయూనిట్ సోమవారం రేడియో మిర్చి ద్వారా విడుదల చేసింది. ఈ పాటలో కథానాయకుడు నాగచైతన్యకు ఇద్దరు చెల్లెళ్లు రాఖీ కడుతుండగా, 'రాఖీ ఎందుకు కడతారో తెలుసా..?, అక్కాచెల్లెళ్ల బాధ్యతని అమ్మానాన్నల తర్వాత అన్నాతమ్ముళ్లదేనని ప్రతి నిమిషం గుర్తు చేయటానికి..' అంటూ తల్లి రేవతి చెప్పే డైలాగ్ హైలైట్‌గా నిలిచింది. వివేక్ సాగర్ స్వరాలు సమకూరుస్తున్న ఈ చిత్రంలో నాగచైతన్య సరసన లావణ్య త్రిపాఠి నటిస్తోంది. రావురమేష్, రేవతి, శ్రీకాంత్, మురళీశర్మ ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్న ఈచిత్రాన్ని వారాహి చలన చిత్రం పతాకంపై కృష్ణ ఆర్.వి.మారిముత్తు దర్శకత్వంలో రజని కొర్రపాటి నిర్మిస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి ఈనెలలోనే ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు చిత్రయూనిట్ సన్నాహాలు చేస్తోంది.

సైరత్ దర్శకుడి చిత్రంలో..!



అమితాబ్ బచ్చన్

పరువు హత్యల నేపథ్యంలో నాగరాజ్ మంజులే దర్శకత్వంలో తెరకెక్కిన మరాఠి చిత్రం 'సైరత్' ఎంతటి సంచలన విజయం సాధించిందో అందరికీ తెలిసిందే. హ్యయ్యస్ట్ కలెక్షన్లు కలెక్ట్ చేసి మరాఠి సినీ చరిత్రలోనే ఓ రికార్డ్ క్రియేట్ చేసింది కూడా. అంతేకాదు ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ భాషల్లోనూ రీమేక్ చేసేందుకు భారీగా సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ చిత్రదర్శకుడు నాగరాజు మంజులే త్వరలోనే ఓ బాలీవుడ్ చిత్రానికి దర్శకత్వం వహించబోతున్నారు. బిగ్ బి అమితాబ్‌బచ్చన్ ప్రధాన పాత్రధారిగా ఈచిత్రం ఉండబోతోంది. బిగ్‌బితో సినిమా చేయాలన్న కల నెరవెరబోతున్నందుకు చాలా సంతోషంగా ఉందని నాగరాజ్ మంజులే చెప్పారు. బిగ్ బి నటించిన 'షోలే' చిత్రాన్ని చూసి దర్శకుడిగా మారాలనే నిర్ణయానికి వచ్చానని, ఆయన అభిమానిగా ఆయనతోనే సినిమా చేయటం అదృష్టంగా భావిస్తున్నానని మంజులే అన్నారు.

దెయ్యంతో ఆ నలుగురు..



'ఆనందో బ్రహ్మ'చిత్రంలో తాప్సీ

తాప్సీ, శ్రీనివాస్‌రెడ్డి, షకలక శంకర్, వెన్నెల కిషోర్ ప్రధాన పాత్రధారులుగా మహి దర్శకత్వంలో 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయ్, శశికుమార్ నిర్మిస్తున్న చిత్రం 'ఆనందో బ్రహ్మ'. విడుదలకు సిద్ధమైన ఈ చిత్రం గురించి ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు మహి మాట్లాడుతూ, 'ఇటీవల విడుదలైన ట్రైలర్‌కి మంచి స్పందన వచ్చింది. ఫైనల్ అవుట్‌పుట్ చూసుకున్నాం. సినిమా చాలా బాగా వచ్చింది. చాలా హ్యాపీగా ఉంది. సౌండ్ డిజైన్స్, విజువల్స్ కొత్త రకంగా ఆకట్టుకునేలా ఉంటాయి. ప్రాపర్ కామెడీ చిత్రమిది. హర్రర్ సన్నివేశాలు పెద్దగా ఉండవు. సినిమా అంతా నాలుగు పాత్రల చుట్టూ తిరుగుతుంది. విభిన్న సమస్యలతో బాధపడుతున్న నలుగురు వ్యక్తులు, దెయ్యం ఒక గదిలో ఉంటే ఏం జరిగిందనేది సినిమా. ఆ సందర్భంలో పుట్టే కామెడీ ప్రేక్షకులకు నవ్వులు పంచుతుంది' అని అన్నారు. 'మనుషులకు దెయ్యం భయపడితే ఎలా ఉంటుందనేది ఈ చిత్ర ఇతివృత్తం. సినిమా ఫస్ కాపీ రెడీ అయ్యింది. ఈ నెల 18న సినిమాను భారీగా రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం. అందులో భాగంగా యుఎస్‌లో అత్యధికంగా 85 స్క్రీన్స్‌లో రిలీజ్ చేయనున్నాం' అని నిర్మాత విజయ్ తెలిపారు. నటుడు శ్రీనివాస్‌రెడ్డి చెబుతూ, 'ఇందులో నా పాత్ర కొత్తగా ఆకట్టుకునేలా ఉంటుంది. నా కెరీర్‌లోనే మంచి పాత్ర అవుతుంది' అని చెప్పారు. 'ఈ చిత్రం ద్వారా చాలా విషయాలు నేర్చుకున్నాను. ఇంకా నేర్చుకోవాల్సి విషయాలు చాలా ఉన్నాయని తెలుసుకున్నాను. హర్రర్ కామెడీగా అలరిస్తుంది. సినిమాను ఆదరించాలని కోరుకుంటున్నా' అని కమెడీయన్ షకలక శంకర్ తెలిపారు.

ప్రతి క్షణం థ్రిల్ చేసే సినిమా..

మనీష్‌బాబు, తేజస్విని హీరో, హీరోయిన్లుగా నాగేంద్రప్రసాద్ దర్శకత్వంలో శ్రీ భాగ్యలక్ష్మి మూవీ మేకర్స్ పతాకంపై జి.మల్లికార్జునరెడ్డి నిర్మించిన చిత్రం 'ప్రతిక్షణం'. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉన్న ఈచిత్ర ప్రీ రిలీజ్ వేడుకను సోమవారం హైదరాబాద్‌లో చిత్రయూనిట్ నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాత రాజ్‌కందుకూరి మాట్లాడుతూ,'క్షణం' సినిమా ఎంత పెద్ద విజయం సాధించిందో అలాగే ఈ చిత్రం కూడా విజయం సాధించాలని ఆశిస్తున్నాను. నిర్మాత మల్లికార్జునరెడ్డితోపాటు టీమ్‌కు అభినందనలు' అని చెప్పారు. 'ట్రైలర్‌తోపాటు పాటలు చాలా బాగున్నాయి. ఈనెల 18న ప్రేక్షకుల ముందుకొస్తున్న ఈచిత్రం తప్పకుండా విజయం సాధించాలి' అని మరో నిర్మాత సాయివెంకట్ అన్నారు. 'పాటలు, ట్రైలర్ చూస్తుంటే నిర్మాత ఎంతో ప్యాషన్‌తో ఈ సినిమా చేశారని అర్థమవుతోంది. ఈనెల 18న దాదాపు 100 థియేటర్లలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. క్యాచీ టైటిల్‌తో వస్తున్న ఈ చిత్రాన్ని ప్రేక్షకులందరూ ఆదరించాలని కోరుకుంటున్నాను' అని మరో నిర్మాత టి.రామసత్యనారాయణ చెప్పారు. 'ఆద్యంతం ప్రేక్షకులను థ్రిల్ చేసే చిత్రమిది. అన్ని వర్గాల ప్రేక్షకులకు కావాల్సిన అన్ని హంగులున్న చిత్రమిది' అని చిత్ర నిర్మాత మల్లికార్జునరెడ్డి అన్నారు. ఈ ప్రీ రిలీజ్ వేడుకలో తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ సంస్థ డైరెక్టర్ అమృతరావు, పద్మిని, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు దేవారెడ్డి, ఓంనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



'ప్రతిక్షణం' చిత్రంలో మనీష్‌బాబు, తేజస్విని

నాకు మనసున్నది పాటలొచ్చాయ్

సోని టీమ్ సమర్పణలో సాయి హాసిని ప్రొడక్షన్స్ పతాకంపై సుజయ్, తనిష్క్, చంద్రకాంత్, రష్మీ నాయకానాయికలుగా రాజశేఖర్ దర్శకత్వంలో దేవశంకర్ గౌడ్ నిర్మించిన చిత్రం 'నాకు మనసున్నది'. ఈ చిత్రం ఆడియో విడుదల వేడుక ఆదివారం సాయంత్రం ప్రసాద్‌ల్యాబ్స్‌లో వైభవంగా జరిగింది. అతిథులుగా విచ్చేసిన ప్రతాని రామకృష్ణగౌడ్ చిత్ర ట్రైలర్‌ను, కవిత బిగ్ సీడీని, భానుచందర్ ఆడియో సీడీలను ఆవిష్కరించారు. అనంతరం ఆర్.కె.గౌడ్ మాట్లాడుతూ,'ఈ సినిమాలో నటించిన నటీనటులందరికీ శుభాకాంక్షలు. దర్శకుడు రాజశేఖర్ ఈచిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. మంచి కాన్సెప్ట్‌తో రూపొందిన ఈచిత్రంతో నిర్మాతకు మంచి బిజినెస్ జరగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని చెప్పారు. 'ఆద్యంతం ఆసక్తికరంగా తెరకెక్కిన ఈచిత్రం మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను. మంచి అవుట్‌పుట్ కోసం దర్శక,నిర్మాతలు చేసిన ప్రయత్నం అభినందనీయం. అన్ని వర్గాల ప్రేక్షకులకు కావాల్సిన అంశాలన్ని ఈ చిత్రంలో ఉన్నాయి' అని భానుచందర్ చెప్పారు. 'ఇదొక మంచి ప్రయత్నం. మంచి కాన్సెప్ట్‌తో, మంచి టైటిల్‌తో వస్తున్న ఈ చిత్రం విశేష ప్రేక్షకాదరణ పొందాలని ఆశిస్తున్నాను. ఇటువంటి చిత్రాలకు ఆదరణ లభిస్తే భవిష్యత్‌లో మరిన్ని మంచి సినిమాలొస్తాయి.



'నాకు మనసున్నది' చిత్ర ఆడియో ఆవిష్కరణోత్సవ దృశ్యం

దీంతో పరిశ్రమకి నూతన ప్రతిభ కూడా బాగా పరిచయం అవుతుంది' అని కవిత చెప్పారు. 'ప్రస్తుతం పరిశ్రమలో చిన్న సినిమాలు బాగా ఆడుతున్నాయి. చిన్న సినిమాలకు ఆదరణ లభిస్తే వండర్స్ క్రియేట్ చేస్తాయి' అని టి.రామసత్యనారాయణ అన్నారు. 'ఆద్యంతం అలరించే కథ, కథనంతో తెరకెక్కిన చిత్రమిది. అందరినీ అలరించే చిత్రం కావాలని కోరుకుంటున్నాను' అని సాయివెంకట్ తెలిపారు.

రాని బాకీల 'రద్దు' రూ.2.5 లక్షల కోట్లకు!

2016-17లోనే రూ.81,683 కోట్లు..

- ముందు ఏడాదితో పోలిస్తే 41% అధికం
- పెరిగిపోతున్న బ్యాంకుల రుణభారం
- ఈ ఏడాది రూ.లక్ష కోట్లకు చేరే అవకాశం!



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: బ్యాంకింగ్ రంగంలో నిరర్థక ఆస్తుల కట్టడికి పలు చర్యలు చేపడుతున్నప్పటికీ బ్యాంకుల్లో రాని బాకీల ఖాతాల్లోకి చేరుతోన్న రుణాల మొత్తం అంతకంతకు పెరిగిపోతోంది. ఆర్థిక శాఖ తాజాగా వెల్లడించిన గణాంకాల మేరకు మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీలు) దాదాపు రూ.81,683 కోట్ల మొండి బాకీలను రాని బాకీల ఖాతాల్లోకి జమ చేశాయి. అంతకు ముందు ఏడాది రద్దు చేసిన బాకీలతో పోలిస్తే ఇది దాదాపు 41 శాతం మేర అధికం. 2015-16 ఆర్థిక సంవత్సరంలో పీఎస్‌బీలు మొత్తం రూ.57,586 కోట్ల సొమ్మును రాని బాకీల ఖాతాలో చూపాయి. ఏడాది తిరిగే సరికి ఇవి రూ.81,683 కోట్లకు చేరిపోవడం విశేషం. రాని బాకీల మొత్తం అంతకంతకు పెరిగిపోతుండడం ఇటు ప్రభుత్వ వర్గాలతో పాటు.. అటు సామాన్య ప్రజలను కూడా తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది.

అనూహ్యంగా పెరుగుతోన్న పీఎస్‌బీల రద్దు..

ఆర్థిక శాఖ గణాంకాల ప్రకారం గడిచిన అయిదేండ్ల కాలంలో పీఎస్‌బీలు దాదాపు రూ.2.46 లక్షల కోట్ల మేర రుణాలను రాని బాకీల కింద జమ కట్టాయని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. 2012-13 ఆర్థిక సంవత్సరం నుంచి తాజాగా మార్చితో ముగిసిన 2016-17 ఆర్థిక సంవత్సర వరకు పీఎస్‌బీల పనితీరును పరిశీలించి చూస్తే పలు ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. 2012-13లో బ్యాంకుల రాని బాకీల కింద జమచేసిన రుణాల మొత్తం రూ.27,231 కోట్లుగా ఉంటే.. ఇదే కాలంలో పీఎస్‌బీలు ఉమ్మడిగా సాధించిన నికర లాభం మొత్తం రూ.45,849 కోట్లుగా నమోదైంది. సరిగ్గా అయిదేండ్ల కాలం గడిచే సరికి పరిస్థితి తారుమారైంది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో పీఎస్‌బీ బ్యాంకుల మొత్తం లాభం రూ.474 కోట్లుగా నమోదైతే.. రాని బాకీల కింద రద్దు చేసిన మొత్తం రూ.81,683 కోట్లకు చేరిపోయింది. గణాంకాల ప్రకారం గడిచిన రెండేండ్ల కాలంలోనే బ్యాంకులు ఉమ్మడిగా రూ.19,529 కోట్ల నష్టాన్ని ప్రకటించాయి. ఇదే కాలంలో బ్యాంకులను నిలబెట్టేందుకు మూలధనీకరణ రూపంలో సర్కారు దాదాపు రూ.47,915 కోట్ల మేర నిధులను పీఎస్‌బీలకు అందించింది. గడిచిన పదేండ్ల కాలంలో ఇంత మొత్తంలో పీఎస్‌బీలకు సర్కారు సాయం అందించడం ఇదే తొలిసారి. నిరర్థక ఆస్తులను కట్టడి చేసేందుకు ప్రభుత్వం ఆర్‌బీఐ తీసుకుంటున్న చర్యలు ఇంకా పూర్తిగా పట్టాలెక్కని కారణంగా రానున్న రోజుల్లో ఈ మొత్తం మరింతగా పెరిగి రూ. లక్ష కోట్లకు చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. నిరర్థక ఆస్తుల సమస్య పరిష్కారానికిగాను ఇటీవలే రంగంలోకి దిగిన భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) 12 మంది బడా రుణ ఎగవేత సంస్థలపై దివాలా నిబంధనావళి ప్రకారం చర్యలు చేపట్టాలని బ్యాంకులకు సూచించిన సంగతి తెలిసిందే. మొత్తం బ్యాంకింగ్ రంగంలోని రూ.9 లక్షల మేర నిరర్థక ఆస్తుల్లో దాదాపు పావు శాతం వాటా ఈ సంస్థలదే ఉండడం విశేషం. దీనికి తోడు మిగతా ఎగవేతదారుల విషయంలోనూ బ్యాంకులు ఇకనైనా మరింత క్రియాశీలకంగా వ్యవహరించకపోతే వచ్చే ఏడాదికి రద్దు బాకీల ఖాతాలోకి రూ.లక్ష కోట్ల రుణ సొమ్ము తరలిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయని బ్యాంకింగ్ విశ్లేషకులు చెబుతున్నారు.

ప్రభుత్వ బ్యాంకులు రాని బాకీలుగా రద్దు చేసిన రుణాలు (రూ. కోట్లలో..)

ఆర్థిక సంవత్సరం	రాని బాకీలుగా రద్దు చేసిన మొత్తం	ఉమ్మడి లాభం
2012-13	27,231	45,849
2013-14	34,409	31,513
2014-15	49,018	30,868
2015-16	57,586	(-)20,003
2016-17	81,683	474

మూలం: ఆర్థిక శాఖ, ఆర్‌బీఐ గణాంకాలు

జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి జాతీయ పీఆర్ అవార్డులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ చాప్టర్ నిర్వహించిన 2వ తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్‌లో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, వివిధ కేటగిరీలలో నాలుగు జాతీయ అవార్డులను అందుకుంది. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో నగరమేయర్ బొంతు రామ్మోహన్, ప్రభుత్వ సలహాదారు రమణాచారి చేతుల మీదుగా ఈ అవార్డులు అందుకున్నారు. ఉత్తమ సేవలకు గాను జాతీయ ప్రజా సంబంధాల అవార్డును పొందిన శాస్త్రవేత్తలు, అధికా రులను ఉపకులపతి డా.వి. ప్రవీణ్‌రావు అభినందించారు. విశ్వవిద్యాలయం అందిస్తున్న సేవలను గుర్తించి ప్రతిష్టాత్మకమైన సంస్థలు అందించే అవార్డులతో శాస్త్రవేత్తలు, రైతు సేవలో మరింత పునరంకితమై పని చేసేందుకు ప్రోత్సాహం అందిస్తాయని అన్నారు. రిజిస్ట్రార్ డా. ఎస్. సుధీర్‌కుమార్, విద్యార్థి వ్యవహారాల డీన్ డా.విష్ణువర్ధన్‌రెడ్డి, విశ్వవిద్యాలయ ప్రజా సంబంధాల అధికారి వి. సుధాకర్ పాల్గొన్నారు.

బంగ్లాదేశ్ అధికారుల బృందంపర్యటన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బంగ్లాదేశ్ వ్యవసాయ మంత్రిత్వ శాఖ నుంచి ఖాజీ జహంగీర్ కబీర్ నేతృత్వంలోని విత్తన ధ్రువీకరణ సంస్థ అధికారుల బృందం భారతదేశంలో విత్తన ధృవీకరణపై చేస్తున్న కార్యక్రమాలను అధ్యయనం చేయడానికి మూడు రోజుల పర్యటనలో భాగంగా హైదరాబాద్ చేరుకుంది. సోమవారం హాకా భవన్‌లో తెలంగాణ రాష్ట్ర విత్తన, సేంద్రియ ధ్రువీకరణ అథారిటీ సమావేశం హాల్‌లో సమావే శమైంది. డైరెక్టర్. డా. కేశవులు విత్తన ధ్రువీకరణతో పాటు, ఆన్-లైన్ విత్తన ధ్రువీకరణ కార్యక్రమం, అంతర్జాతీయ డీఈసీడీ విత్తన ధృవీకరణ, సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణలపై సంస్థ చేస్తున్న కార్యక్రమాలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మన రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థ దేశంలోనే లీడింగ్ విత్తన ధృవీకరణ సంస్థగా అవతరించిందన్నారు.

ఫ్రిజ్, బైక్ ఉంటే 'సంక్షేమం' కట్

(మొదటిపేజీ తరువాయి)

సంక్షేమ పథకాలు అందవని తాజాగా జరిగిన సాంఘీక ఆర్థిక సర్వేలో కమిటీ స్పష్టం చేసింది. ఇండ్లు లేనివారు, పాలిథిన్ కవర్ల గుడిసెల్లో ఉండేవారు, ఎలాంటి ఆదాయం లేనివారికి మాత్రమే రాయితీలు అందనున్నట్టు కమిటీ తెలిపింది. పట్టణ ప్రాంతాల్లో ఉండే 59 శాతం మంది సంక్షేమ పథకాలకు అర్హులని కమిటీ స్పష్టం చేసింది.

రాష్ట్రంలో 'ఖాకీ' పాలన

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడటం సరైన పద్ధతి కాదన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఎన్నో వాహనాలను దహనం చేసినా ఆనాటి ప్రభుత్వం ఇంత క్రూరమైన చర్యలకు పాల్పడలేదన్నారు. నేరెళ్ల ఘటనలో మాత్రం ఈ ప్రభుత్వం క్రూరంగా వ్యవహరించిందన్నారు. దళిత బలహీనవర్గాల ప్రజలకు తెలంగాణలో విలువలేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో 120 మంది దళితులు హత్యకు గురయ్యారని, డీజీపీ వార్షిక నివేదిక అందజేయలేదా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేటీఆర్ స్పందించి బాధిత కుటుంబాలను పరామర్శించి పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి గుండ థామస్, నాయకులు ఉన్నారు.

శాంతి ప్రక్రియకు విఘాతం

(మొదటిపేజీ తరువాయి)

అక్కడి ప్రజలను మరింత రెచ్చగొట్టేలా ఉన్నదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని విచ్ఛిన్నం చేయడంలో విఫలమైన నాటి నుంచి.. అంగ, అర్థబలాన్ని ప్రయోగించే కుట్ర చేస్తోందని ఎన్డీఏ సర్కారుపై మండిపడ్డారు. 'ఆర్ఎస్ఎస్ సహాయంతో' లెఫ్ట్ పార్టీల కార్యకర్తల హత్యకు పాల్పడుతోందని విమర్శించారు. కేరళతో పోలిస్తే, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో శాంతి భద్రతలు క్షీణించాయని వివరించారు. 'ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో రాజకీయ హత్యలు పెరిగినట్టు సర్కారు రికార్డులు ధ్రువీకరిస్తున్నాయి' అని ఆమె చెప్పారు.

9నయీమ్ కేసుల్లో చార్జిషీటు వేశాం

- 22 కేసుల్లో వేయబోతున్నాము
- గ్యాంగ్‌స్టర్ నయీమ్ మిగతా కేసుల్లో దర్యాప్తు సాగుతున్నది: సిట్ ఐజీ నాగిరెడ్డి

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

గ్యాంగ్‌స్టర్ నయీమ్‌కు సంబంధించిన కేసుల్లో దర్యాప్తును ముగించి కోర్టుల్లో చార్జిషీటు వేయడం జరిగిందని, మరో 22 కేసుల్లో త్వరలోనే చార్జిషీటును వేయనున్నామని స్పెషల్ ఇన్ వెస్టిగేషన్ టీమ్(సిట్) ఇన్‌ఛార్జి, రాష్ట్ర నార్త్‌జోన్ ఐజీ వై.నాగిరెడ్డి సోమవారం తెలిపారు. గత ఏడాది ఆగస్టు 8న షాద్‌నగర్‌లో నయీమ్ ఎన్‌కౌంటర్ జరిగాక అతని నేరాలపై దర్యాప్తును సాగించిన సిట్ వివిధ జిల్లాల్లో కేసులను నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా మొత్తం 227 కేసులను ఇప్పటి వరకు నమోదు చేయడం జరిగిందని అందులో 128 మంది నిందితులను అరెస్టు చేశామని తెలిపారు. అరెస్టయిన వారిలో 109 మందిని తిరిగి కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నామని ఐజీ తెలిపారు.ఈ కేసులలో ఇప్పటి వరకు 895 మంది సాక్షులను విచారించామని అన్నారు. చార్జిషీటు వేయగా మిగిలిన కేసుల్లో దర్యాప్తు పురోగతిలో ఉందని త్వరలోనే ఈ కేసు ముగింపు దశకు చేరుకుంటుందని తెలిపారు. అరెస్టయిన వారిలో 14 మంది కరడుగట్టిన నేరస్తుపై ప్రివెన్షన్ ఆఫ్ డేంజరస్ యాక్టివిటీస్ (పీడీ) చట్టం క్రింద కూడా కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. నయీమ్‌తో అంటకాగిన ఐదుగురు పోలీసు అధికారులను డీజీపీ సస్పెండ్ చేశారని, మరో నలుగురు అధికారులపై మౌఖిక విచారణ, మరో 16 మంది అధికారులు, సిబ్బందిపై శాఖాపరమైన విచారణ సాగుతున్నదన్నారు.

నయీమ్ కేసుపై 'రాజకీయ' పడగ

నవ-తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

2016 ఆగస్టు 8న షాద్‌నగర్‌లోని మిలీనియం కాలనీలో గ్యాంగ్‌స్టర్ నయీమ్ ఎన్‌కౌంటర్ జరిగిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోనే గాక జాతీయ స్థాయిలో సంచలనం రేపిన నయీమ్ ఎన్‌కౌంటర్‌తో అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయి. నయీమ్ డెన్‌లలో నుంచి కోట్లాది రూపాయలు, నగలు, భూముల దస్తావేజులు, ఆయుధాలు, కార్లను సిట్ స్వాధీనం చేసుకున్నది. ఒకపక్క సిట్, మరోపక్క మహబూబ్‌నగర్,రంగారెడ్డి, సైబరాబాద్, రాచకొండ, నల్లగొండ,వరంగల్,కరీంనగర్,ఖమ్మం పోలీసులు నయీమ్‌కు సంబంధించి 340కి పైగా కేసులను నమోదు చేసి దర్యాప్తు జరిపారు. నయీమ్ భార్య, కుటుంబసభ్యులతోపాటు మొత్తం 270 మందికి పైగా అతని గ్యాంగ్ సభ్యులను అరెస్టు చేశారు. రాష్ట్రంలోనే గాక ఏపీ,గోవా, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలకు గ్యాంగ్‌స్టర్ కేసు దర్యాప్తు విస్తరిస్తుందని భావించారు. కానీ, దర్యాప్తు రాష్ట్ర సరిహద్దులను దాటి పోలేదు. ముందు ఇక్కడ నయీం అక్రమాలపై దర్యాప్తు జరిపాకే ఇతర రాష్ట్రాలపై దృష్టిని సారిస్తామని పోలీసు ఉన్నతాధికారులు తొలుత చెప్పారు. దర్యాప్తు సాగుతుండగా నయీంతో అంటకాగి, అతని నేరాలకు ఊతమిచ్చారంటూ పలువురు పోలీసు అధికారులు, రాజకీయ ప్రముఖులు (అధికార,విపక్ష), ఇతర ప్రముఖుల గురించి అతని డైరీలో వివరాలున్నాయని వార్తలు వచ్చాయి. తమను నయీమ్‌తో పాటు వేధించిన నాయకులు, పోలీసుల పేర్లను దర్యాప్తు అధికారుల దృష్టికి కొందరు బాధితులే తీసుకు వచ్చారని ప్రచారం జరిగింది. చివరికి హైకోర్టు సైతం ఈ కేసులో ఒక పిటిషన్‌కు సంబంధించి దర్యాప్తు నివేదికను కోరడం, సిట్ సమర్పించడం జరిగింది. అదే సమయంలో నయీమ్‌ను ఎన్‌కౌంటర్ చేసి, అతని నేర సామ్రాజ్యానికి అడ్డుకట్ట వేసిన పోలీస్‌శాఖే గ్యాంగ్‌స్టర్ మూలాలన్నిటినీ పెకలించి వేస్తుందని బాధితులు ఆశించారు. కానీ, ఇప్పటి వరకూ నయీమ్‌తో కలిసి ఘోరమైన నేరాలకు పాల్పడినట్టు ఆరోపణలున్న కుడిభుజం శేషన్నతో పాటు అతని 30 మంది సభ్యుల ముఠా ఇంకా సిట్‌కు చిక్కక పోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తాము గాలిస్తున్నామని త్వరలో పట్టుకుంటామని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు. అయితే, ఏడాది కావస్తున్నా ఫలితం లేక పోవడంతో బాధితులకు ఆందోళన కలిగిస్తోంది. బెదిరించి ,కిడ్నాప్‌లకు పాల్పడి తమ నుంచి నయీమ్ కబ్జా చేసిన వందల ఎకరాల భూమిని తిరిగి ఇప్పించే విషయమై ప్రభుత్వం నుంచి తగిన చర్యలు లేవని వందలాదిమంది బాధితులు వాపోతున్నారు. అదే సమయంలో శేషన్నవంటి కరడుగట్టిన గ్యాంగ్‌స్టర్ పట్టుబడక పోవడంతో తాము ఫిర్యాదు చేస్తే చిక్కుల్లో పడాల్సి వస్తుందని మరి కొందరు బాధితులు వెనక్కి తగ్గినట్టు తెలుస్తోంది. అదే సమయంలో దాదాపు 20 ఏండ్లకు పైగా నయీమ్‌కు చేయూతనిచ్చి అతని నేరాలు పెరగడానికి కారణమవటమే గాక, తామూ కోట్లాది రూపాయల అక్రమాస్తులను కూడబెట్టుకున్న కొందరు పోలీసు అధికారుల విషయంలో తగిన దర్యాప్తు సాగడం లేదని బాధితుల నుంచి విమర్శలున్నాయి. అలాగే నయీమ్‌తో అంటకాగి ప్రస్తుతం అధికార పార్టీలో ఉన్న కొందరు నాయకుల విషయంలోనూ నిష్పక్షపాతంగా దర్యాప్తు సాగడం లేదని ఆరోపణలొస్తున్నాయి. దాంతో, విమర్శల వేడిని కొంతైనా తగ్గించడానికన్నట్టు పోలీసు ఉన్నతాధికారులు అదనపు ఎస్పీ మద్దిపాటి శ్రీనివాస్, ఏసీపీలు చింతమనేని శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్, సీఐ రాజగోపాల్‌లను సస్పెండ్ చేశారు. మరికొందరు అధికారులు,సిబ్బందిపై శాఖాపరమైన చర్యలుంటాయని తెలిపారు. కానీ, నయీమ్‌తో అంటకాగిన వారిలో కొందరు సీనియర్ పోలీసు అధికారులు కూడా ఉన్నారని, వారిని మాత్రం దర్యాప్తు ఉబిలోకి లాగడం లేదనే అనుమానాలను విపక్షాలు వ్యక్తం చేస్తున్నాయి. నయీమ్‌తో అంట కాగినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై ఒక్కరిపైనా కనీసం కేసులు కూడా నమోదు చేయక పోవడం పట్ల బాధితులు కూడా విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు. మొదట అత్యంత వేగంగా సాగిన నయీమ్ కేసు దర్యాప్తు తర్వాత క్రమంలో మెత్తబడటానికి కారణం రాజకీయ క్రీనీడేనని కొందరు పోలీసు ఉన్నతాధికారులు ఆఫ్‌ది రికార్డుగా చెబుతున్నారు. ఆరోపణలు వచ్చినప్పుడల్లా..ఈ కేసులో ఎంతటి పెద్ద వారున్నా వదలమంటూ ముఖ్యమంత్రి కేసీఆర్, హోంమంత్రి, డీజీపీలు ప్రకటనలతో చల్లబర్చారు. కానీ, నయీమ్‌ను ఇన్నేండ్లుగా పెంచి పోషించిన బలమైన అదృశ్య శక్తులను బట్టబయలు చేయడంలో దర్యాప్తు సంస్థ సిట్ ఆశించినంతగా ఫలితాలను రాబట్టలేక పోయిందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. నయీమ్‌ను హతమార్చాం, ఇంకేం కావాలంటూ అసలు మూలాల్ని తవ్వి తీయకుండా పక్కదారి పట్టించేందుకు యత్నిస్తున్నారు. నయీమ్ కేసులో తాము ఇప్పటివరకూ సాధించింది చిన్నదేమీ కాదని దర్యాప్తు అధికారులు చెబుతున్నారు. అయితే, వారి మాటలు బాధితులకు స్వాంతన చేకూర్చడం లేదన్నది వాస్తవం.

సీసీ టీవీ ఫుటేజ్‌లు అదృశ్యం

(మొదటిపేజీ తరువాయి)

చర్చ షురూ అయ్యింది. బీజేపీ నేత తనయుడు వికాశ్ బరాలా (23), అతడి స్నేహితుడు అశీష్ కుమార్ (27)పై బాధితురాలు ఫిర్యాదుచేయగా, వీరిద్దరినీ అరెస్టుచేసి, అనంతరం బెయిల్‌పై విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో కీలకసాక్ష్యాలుగా భావిస్తున్న సీసీటీవీ ఫుటేజ్‌లు అదృశ్యమైనట్టు పోలీసులు చెప్పటం పలు అనుమానాలకు దారితీస్తోంది. వికాశ్‌ను రక్షించేం దుకే వాటిని అదృశ్యం చేశారన్న విమర్శలు వెల్లువెత్తా యి. సాక్ష్యాలు అదృశ్యం కావడంపై ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి. రాజకీయ పలుకుబడిని ఉపయోగించి కేసును నీరుగార్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపిం చాయి. 'నేను ఐఏఎస్ అధికారి కూతురిని కనుక లైంగికదాడి నుం చి తప్పించుకున్నాను. అదే, నేను ఒక సామాన్యుడి కూతురునై ఉంటే, నా పై లైంగికదాడి, హత్య జరిగి ఉండేదేమో..' అని బాధితురాలు సామాజిక మాధ్యమంలో పోస్టు చేశాక రాజకీయం వేడెక్కింది.

ప్రెస్‌కాన్ఫరెన్స్‌లో సమాధానమివ్వకుండా ఎస్ఎస్‌పీ నిష్క్రమణ

లైంగికదాడి ఘటనపై ఛండీగఢ్ ఎస్ఎస్పీ ఈష్ సింఘాల్ ప్రెస్‌మీట్ నిర్వహించారు. కొన్నిప్రశ్నలకు జవాబిచ్చి..మధ్యలో కొందరు సీసీటీవీ ఫుటేజ్‌పై కీలక ప్రశ్నలు అడగటంతో..చల్లగా జారుకున్నారు.

హర్యానా బీజేపీ అధ్యక్షుడు రాజీనామా చేయాలి.బీజేపీ ఎంపీ రాజ్‌కుమార్ సైనీ

తనయుడు చేసిన తప్పునకు హర్యానా బీజేపీ అధ్యక్షుడు సుభాశ్ బరాలా తన పదవికి రాజీనామా చేయాలని కురుక్షేత్ర నియోజకవర్గ బీజేపీ ఎంపీ రాజ్‌కుమార్ సైనీ డిమాండ్ చేశారు. వికాశ్ బరాలాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.దీనిపై కేంద్ర కమిటీ సత్వరమే చర్యలు తీసుకోవాలని సూచించారు. మరో బీజేపీ ఎంపీ సుబ్రమణ్యస్వామి ట్విట్ చేస్తూ..ఈ ఘటనపై పిల్ వేయనున్నట్టు పేర్కొన్నారు.

అర్థరాత్రి పనేంటి? : బీజేపీ

ఇదిలావుండగా, తప్పుచేసిన వికాశ్‌ను మందలించాల్సం దిపోయి, బాధితురాలిపైనే బీజేపీ హర్యానా శాఖ నిందలుమో పుతోంది. అర్థరాత్రి ఆమె ఎందుకు బయటకు వచ్చిందంటూ ప్రశ్నించడం గమనార్హం. 'రాత్రి 12 గంటలకు ఆమె బయటకు ఎందుకు వచ్చింది? అర్థరాత్రి ఒంటరిగా కారు నడుపుకుంటూ ఎందుకు వెళ్లింది? వాతావరణం బాగోలేనప్పుడు, మనకు మనం జాగ్రత్తగా ఉండాలి' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంవీర్ భట్టి అన్నారు. దీనిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. 'మా కుమారులు తాగి రోడ్డు మీదకొచ్చి కనిపించిన అమ్మాయిలను వేధింపులకు గురిచేస్తారు.. అందులో తప్పులేదు. మీరు బయటకు రాకుండా జాగ్రత్తగా ఉండడన్నది ఆయన వాదలా ఉంది' ప్రజా సంఘాల మండిపడుతున్నాయి.

'వాళ్లే సిగ్గు పడాలి!'

ఛండీగఢ్ : తనను వేధింపులకు గురిచేసిన హర్యానా బీజేపీ అధ్యక్షుడు సుభాష్ బరాలా కుమారుడు వికాస్ బరాలా, అతన్ని స్నేహితుడు అశీష్‌లకు శిక్ష పడేంత వరకు పోరాడతానని, బాధితురాలు, ఐఎఎస్ అధికారి కుమార్తె తెలిపింది. తాను మీడియాకు దూరంగా లేనని, తనకు దాక్కోవలసిన అవసరం లేదని, తనను వేధింపులకు గురిచేసినందుకు వారే సిగ్గు పడాలని ఆమె ఇక్కడ విలేకరులతో అన్నారు. ఆమె మీడియాకు దూరంగా ఉంటున్నారంటూ పత్రికలలో కథనాలు వెలువడిన నేపథ్యంలో సోమవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రి ఎదుర్కొన్న సంఘటనను ఆమె ప్రస్తావిస్తూ సమయానికి పోలీసులు వచ్చి కాపాడారని తెలిపారు. వారికి కృతజ్ఞతలు చెప్పారు. బేటి బచావో అంటూ నినదించే నేతల కుమారులే ఇటువంటి సంఘటనలకు ఒడిగట్టడం విచారకరమన్నారు. ఆమె తండ్రి, ఐఎఎస్ అధికారి మాట్లాడుతూ తన కుమార్తెను వేధింపులకు గురిచేసిన వారికి శిక్ష పడే వరకు నిద్రపోనని తెలిపారు. అయితే ఆయన విలేకరుల ఎదుట హాజరు కాలేదు. తల్లిదండ్రుల అండతో తాను కూడా న్యాయ పోరాటం చేస్తానని బాధిత యువతి చెప్పింది. ఏదో ఒక రోజు నిందితులకు శిక్ష పడుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. సామాజిక మాధ్యమాల్లో తనకు ఊహించని మద్దతు లభిస్తోందని తెలిపింది. రాత్రిపూట బయటకు ఎందుకు వెళ్లాలని బీజేపీ నేత ప్రశ్నించడానికి ఆయన ఎవరని ఆ యువతి నిలదీశారు.

టాప్ 10 వార్తల్లో ....బాధిత యువతి

ఐఎఎస్ కుమార్తెపై హర్యానా బీజేపీ అధ్యక్షుని కుమారుడు సాగించిన దుశ్చర్య వార్త సంచలనం సృష్టిస్తున్నది.ఆ బాధితురాలి పేరు తెలియకపోవడంతో లక్షలాది మంది నెటిజన్లు గూగుల్‌ను ఆశ్రయించారు. ఆమె పేరు కోసం ఈ ఘటనకు సంబంధించి వివిధ సామాజిక మాధ్యమాల్లో వచ్చిన కథనాలను ఆసక్తికరంగా వెతికారు.

మార్పు వెనుక మతలబేంటి.?

(మొదటిపేజీ తరువాయి)

12 శాతం పన్ను విధించటాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామంటూ పైకి కేసీఆర్ చెబుతున్నప్పటికీ అంతర్గతంగా ఇదిగాక మరేమైనా రాజకీయ అంశాలు దాగున్నాయా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ, రాష్ట్రపతి ఎన్నిక, ఆ తర్వాత ఉప రాష్ట్రపతి ఎన్నిక... తదిరాంశాలన్నింటిలో కేసీఆర్ రాష్ట్రంలో బీజేపీని ముందుండి నడిపించారు. ఇంకా చెప్పాలంటే రాష్ట్ర బీజేపీ నేతలే ఆశ్చర్యపోయేలా కేంద్రానికి బ్రహ్మాండమైన మద్దతునిచ్చారు. జీఎస్టీపై ఆఘమేఘాల మీద అసెంబ్లీని సమావేశపరిచి టీఆర్ఎస్ సర్కారు తరపున సంపూర్ణంగా బలపరిచి, ఆ తీర్మానాన్ని కేంద్రానికి పంపారు. అదే శాసనసభలో విపక్షాలు ప్రధాని మోడీపై విమర్శలు గుప్పిస్తే... సీఎం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదంతా చేసి తీరా ఇప్పుడు... జీఎస్టీ నుంచి చాలా దేశాలు వెనక్కి తగ్గాయి.. మన దేశంలో ఏం జరుగుతుందో చూడాలంటూ ఆయన వ్యాఖ్యానించటం గమ నార్హం. పెద్ద నోట్ల రద్దును మొదట పిచ్చి నిర్ణయ మంటూ ఎద్దేవా చేసిన సీఎం.. అటు తర్వాత ఆ చర్యను సమర్థించిన విషయాన్ని ఈ సందర్భంగా రాజకీయ వర్గాలు గుర్తు చేసు కుం టున్నాయి. ఇటీవల ఢిల్లీకి వెళ్లిన సమ యంలో పెద్ద నోట్ల రద్దు వల్ల గందరగోళమేర్పడిందంటూ వ్యాఖ్యా నించిన సీఎం... మరోసారి నిజంగానే గందర గోళానికి, అంతకు మించి విధానాలపరంగా తన నిలకడలేమిని బయటపెట్టు కున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్రంలోని ఎన్డీయే సర్కారుకు అన్ని విషయాల్లోనూ కేసీఆర్ సంపూర్ణంగా బలపరుస్తున్నారు. మోడీ దగ్గర సీఎంకు పూర్తి చనువుందని టీఆర్ఎస్ నేతలు చెబుతుంటారు. ఈ నేపథ్యంలో జీఎస్టీని (ప్రజాప్రయోగ నిర్మాణాలపై 12 శాతం పన్ను)ను సీఎం నిజంగా వ్యతిరేకించేట్టయితే... నేరుగా ప్రధానితో భేటీ అయి, దాన్ని తగ్గించుకో వచ్చుగదా...? అని ఆర్థిక విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. లేదంటే ఇటీవల జరిగిన రాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా... కేంద్రంపై ఒత్తిడి (బీజేపీ అభ్యర్థికి ఓటేయాలంటే 12 శాతం పన్నును తగ్గించాల్సిందే అంటూ) తేవచ్చుగదా..? అని వారు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదే అంశంపై ఓ సీనియర్ అధికారిని అడిగితే... 'జీఎస్టీపై వేసిన కౌన్సిల్‌లో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయి కదా...? ఆ కౌన్సిల్ పలుమార్లు ఢిల్లీలో భేటీ అయిందికదా...? అప్పు డు మన రాష్ట్రం నుంచి సీఎంతో పాటు ఆర్థిక మంత్రి, ఇతర ఉన్నతాధికారులు ప్రతినిధులుగా హాజరై, మద్దతు తెలిపారు గదా..? అప్పుడు మద్దతిచ్చి, ఇప్పుడు కుదరదంటే ఎలా..? ఇలాంటి విషయాలపై ముందే ఆర్థిక నిపుణులతో సమాలో చనలు చేయాలి గదా...? అయినా ఒకసారి జీఎస్టీ కౌన్సిల్ లో చేరితే దాని నిర్ణయాలు కచ్చితంగా అమలు చేసి తీరాల్సిందే.. వాటి నుంచి బయటపడటం కష్టం...' అంటూ సుదీర్ఘమైన వివరణిచ్చారు.

మేధాపాట్కర్ దీక్షభగ్నం

భోపాల్: గత 12 రోజులుగా మేధాపాట్కర్ చేస్తున్న ఆమరణ దీక్షను సోమవారం పోలీసులు భగ్నం చేశారు.ఈ సందర్భంగా పోలీసులు, ఆందోళనకారుల మధ్య తోపులాట జరిగింది. మధ్యప్రదేశ్‌లోని ధార్ వద్ద సర్దార్ సరోవర్ డ్యామ్ కట్టడం వల్ల ముంపు గ్రామాల ప్రజలకు అండగా మేధాపాట్కర్ నిలిచారు. ఆమెతోపాటు మరో 11 మంది ఆమరణదీక్షకు దిగారు. ప్రాజెక్టు నిర్మాణాన్ని 138 మీటర్ల ఎత్తు పెంచటం వల్ల192 గ్రామాలకు ప్రమాదం పొంచిఉన్నదని,40వేల మంది నిరాశ్రయులవుతారని మేధా పాట్కర్ ఆందోళనకు దిగారు. దీక్ష విరమించాలని మధ్యప్రదేశ్ సర్కారు తరపున చంద్రశేఖర్ బోర్కర్,భయ్యు మహరాజ్‌లను పంపింది. కానీ చర్చలు ఫలప్రదం కాలేదు.దీంతో పోలీసులు భారీ సంఖ్యలో దీక్షాస్థలికి పంపారు. ఈ చర్యను స్థానికులతో పాటు ప్రజా సంఘాలు కూడా వ్యతిరేకించాయి. అయితే మేధా పాట్కర్ ఆరోగ్యం క్షీణిస్తు న్నద ంటూ... దీక్షను భగ్నం చేయటానికి మధ్య ప్రదేశ్ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ పోలీసులను పురమాయించారు.


జీఎస్టీపై వేచి చూద్దాం

(మొదటిపేజీ తరువాయి)

పాలనలో తెలంగాణ పట్ల చూపించిన వివక్ష, నిర్లక్ష్యం వల్లనే ప్రత్యేక తెలంగాణ ఉద్యమం చేయాల్సి వచ్చిందని ఆయన గతాన్ని గుర్తు చేసుకున్నారు. ఉద్యమ సమయంలో తాము అనేక మార్లు చెప్పినట్లే, తెలంగాణ రాష్ట్రం ఆదాయ వద్ధి రేటులో ముందంజలో ఉం దని తెలిపారు. తెలంగాణ ఉద్యమం ఎందుకు చేయాల్సి వచ్చిందనే ప్రశ్నకు కూడా ముఖ్యమంత్రి వివరణాత్మక సమాధానం ఇచ్చారు.

అది సామ్రాజ్య వాద కాంక్ష..

"1956లో హైదరాబాద్ రాష్ట్రాన్ని ఆంధ్రరాష్ట్రంతో కలిపి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చేశారు. దీనిపై మొదట్లోనే వ్యతిరేకత వచ్చింది. ఫజల్ అలీ కమిషన్ తెలంగాణ ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగానే ఉంచాలని సిఫారసు చేసింది. అప్పటి ప్రధాన మంత్రి నెహ్రూ కూడా ఆంధ్ర ప్రాంతం వారు తెలంగాణ ప్రాంతాన్ని కోరుకోవడం సామ్రాజ్య వాద విస్తరణ కాంక్ష మాత్రమే అని చెప్పారు. అయినా సరే, ఆంధ్ర వాళ్లు ఢిల్లీలో లాబీయింగ్ చేసి హైదరాబాద్ స్టేట్‌ను కలుపుకున్నారు. నిజాం రాజ్యంలో ఉన్న తెలంగాణ నాయకులకు ఢిల్లీతో పరిచయాలు తక్కువ. ఆంధ్ర ప్రాంతం బ్రిటిష్ రాజ్యంలో ఉండడం వల్ల వారికి మొదటి నుంచి ఢిల్లీ వారితో సన్నిహితంగా ఉండేవారు. ఢిల్లీలో లాబీయింగ్ చేసి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చేశారు. కాని దీనిపై కేవలం తొమ్మిదేండ్లకే ప్రజల్లో వ్యతిరేకత వచ్చింది. తెలంగాణ ప్రాంతంలో ఆందోళన మొదలైంది. 1966లో నిరసన ప్రారంభమయింది. 1969 వచ్చే నాటికి మర్రి చెన్నారెడ్డి నాయకత్వంలో ఉధృతమైన ఉద్యమం వచ్చింది. అప్పుడు నేను 9వ తరగతి చదువుతున్నాను. నేను కూడా లాఠీదెబ్బలు తిన్నాను. మా నాన్న చెన్నారెడ్డికి అనుచరుడు. మా ఇంట్లో చెన్నారెడ్డి 10 రోజులున్నారు. సమైక్య పాలనలో రోజురోజుకూ వివక్ష ఎక్కువైందే తప్ప తక్కువ కాలేదు. ఎన్టీఆర్ పార్టీ పెట్టిన వెంటనే కొత్త రాజకీయం వచ్చింది. నేను కూడా టీడీపీలో చేరాను. దాదాపు రెండు దశాబ్దాలు ఎమ్మెల్యేగా పనిచేశాను. మంత్రిగా కూడా ఉన్నాను. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మంత్రిగా ఉన్న నేను తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై నిత్యం పంచాయితీ పెట్టుకునే వాడిని. చివరికి 1999లో కరెంటు చార్జీలు పెంచడంతో రైతులు బాగా నష్టపోతారని చెప్పాను. అయినా వినలేదు. దీంతో నేను పదవులన్నీ వదిలి ఉద్యమం మొదలు పెట్టాను. కిరణ్ కుమార్ రెడ్డి నిండు అసెంబ్లీలో తెలంగాణకు ఒక్క రూపాయి కూడా ఇవ్వను అని ప్రకటించారు. ఆంధ్ర పాలకుల గర్వానికి, అహంకారానికి అది నిదర్శనం. వివక్ష, నిర్లక్ష్యం అన్ని రంగాల్లో కొనసాగింది. తెలంగాణ ప్రజలు ఉద్యమించి ప్రత్యేక రాష్ట్రం సాధించారు. మేము ఉద్యమ సమయంలో చెప్పినట్టే తెలంగాణ రాష్ట్రం గొప్పగా ముందుకు పోతున్నది. 21 శాతం ఆదాయ వద్ధి రేటుతో దేశంలోనే నెంబర్ వన్‌గా ఉన్నాం"అని ముఖ్యమంత్రి వివరించారు.



రాజ్‌భవన్‌లో రక్షాబంధన్ వేడుకలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాజ్‌భవన్‌లో రక్షాబంధన్ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. గవర్నర్ నరసింహన్‌కు రాఖీలు కట్టేందుకు తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు, వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు, హైదరాబాద్‌లోని 24 పాఠశాలలకు చెందిన 350 మంది విద్యార్థినీలు, 64 మంది టీచర్లు, బ్రహ్మకుమారీలు తరలివచ్చారు. రాఖీలు కట్టిన వారందరికీ గవర్నర్ నరసింహన్, ఆయన సతీమణి విమలా నరసింహన్ విద్యార్థినీలకు దీవెనలు అందించారు. అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్లు ఒకరినొకరు తోడుగా, అండగా ఉండాలని గవర్నర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెలుగు ప్రజలకు గవర్నర్ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

ఒక స్లిప్..రెండు ట్రిప్పులు!

నవతెలంగాణ-కరీంనగర్ ప్రతినిధి

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మధ్యమానేరు డ్యాం నిర్మాణం వేగవంతమైంది. డిసెంబర్ నాటికి 10 టీఎం సీల నీరు నిల్వ చేయాలని భావించిన ప్రభుత్వం ఇసుక తోడేందుకు మూడు నెలల కింద అనుమతిలిచ్చింది. మధ్యమానేరు నీటి నిల్వ ఉండే ప్రాంతంలో 2 కోట్ల16 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక లభ్యమవుతుందని అధికారులు గుర్తించారు. అందులో 10 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక కొదురపాక రీచ్ నుంచి రవాణా చేశారు. ఈ నేపథ్యంలోనే జులై 2న ఇసుక లారీ ప్రమాదంలో జిల్లెళ్లలో ఒకరు మృతిచెందారు. ఈ ఘటన చర్చనీయాంశం కావడంతో తవ్వకం ఆపేశారు. కొడుముంజ రీచ్ నుంచి కూడా 10 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక తరలించేందుకు అనుమతి ఇచ్చారు. ఇంతవరకు 5.5లక్షల క్యూబిక్ మీటర్లు తోడేశారు. ఇంకా ఇసుక తీయడం కొనసాగుతోంది. మధ్యమానేరు రిజర్వాయర్ నుంచి కాళేశ్వరం ప్రాజెక్టు కోసం ఇసుక తరలిస్తున్నారు.

వెయ్యికిపైగా ట్రిప్పులు.. 2 కోట్లపైగా వ్యాపారం

ఇసుక తోడేందుకు నాన్‌గేటెడ్ పద్ధతిన కొన్ని సంస్థలకు ప్రభుత్వం అప్పగించింది. రోజుకు 1000కిపైగా ట్రిప్పులను తరలిస్తున్నారు. సగటున రోజుకు 10వేల క్యూబిక్ మీటర్ల ఇసుక రవాణా అవుతోంది. ఇసుకను జనగామ, జగిత్యాల, సంగారెడ్డి, జీహెచ్ఎంసీ పరిధిలోని డబుల్‌బెడ్‌రూం ఇండ్ల కోసం సరఫరా చేస్తున్నారు. అయితే డబుల్ బెడ్‌రూం ఇండ్ల కోసం కాంట్రాక్టర్లకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామనే సాకుతో ఇష్టానురీతిగా తవ్వకాలు జరుపుతున్నారు. ప్రతిరోజూ వెయ్యికిపైగా ట్రిప్పులు నడుస్తుండగా.. ఆ లెక్కన ఒక్కో టిప్పర్‌కు బయట మార్కెట్‌లో రూ. 25 వేల విలువ కడుతున్నారు. దీన్నిబట్టి వెయ్యి ట్రిప్పుల ఇసుకకు రూ.2 కోట్ల 50 లక్షలు అవుతోంది. టిప్పర్‌కు రవాణా ఖర్చులు సహా రూ.10 వేల చొప్పున మొత్తం రూ.కోటి వరకు ఖర్చవుతున్నది. మిగతా కోటి యాభై లక్షలకు లెక్కతేలాల్సి ఉన్నది.

అదనపు దోపిడీ.. అతివేగం..

ఇసుక తరలింపునకు తహసీల్దార్ ఇచ్చిన పత్రం సరిపోతుంది. కానీ ఒక స్లిప్పుకు అక్రమంగా రెండు ట్రిప్పుల ఇసుక తరలిపోతున్నది. ఇక్కడ్నుంచి రవాణా అవుతున్న వెయ్యి ట్రిప్పుల్లో దాదాపు సగం లారీలు పక్కదారి పడుతున్నట్టు తెలుస్తోంది. దీంతో రోజూ రూ.కోటి 25 లక్షల ఆదాయానికి లెక్కల్లేకుండా పోతోంది. కొందరు కాంట్రాక్టర్లు బయట నుంచి స్లిప్పులు తయారు చేసుకొచ్చి తహసీల్దార్ల సంతకాలు తీసుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోజూ వెయ్యి ట్రిప్పులు తరలించాలంటే అందుకు తగిన వేగం తప్పనిసరి. ఈపనిలో అలసిపోతున్న డ్రైవర్లు మద్యం తాగడం, గుట్కా, పాన్లు వేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు తరచూ సంభవిస్తున్నాయి. ఈమూడు నెలల కాలంలోనే 8 మంది అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ప్రభుత్వ నిర్మాణాలకు ఇసుకతో ఎలాంటి అడ్డంకుల్లేకున్నా అట్టడుగు వరకు తవ్వకాలు జరపడం వల్ల పర్యావరణానికి ప్రమాదమని పలువురు నిపుణులు పేర్కొంటున్నారు.

బాధితుల ఐక్యతను విచ్ఛిన్నం చేసే ప్రయత్నం

నెల రోజులు జైల్లో ఉన్న నేరెళ్ల బాధితులకు ఇటీవలే బెయిల్ దొరికింది. కోర్టు నిర్దేశించిన ప్రకారం వారంతా 30 రోజులపాటు వేములవాడలోనే ఉండాలి. వారిలో ఆరుగురు ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మరో ఇద్దరు మాత్రం ఏకంగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చెన్నమనేని రమేశ్ గూటికి చేరారు. ఆయన కూడా తన నివాసంలోనే వారిద్దరితో కలిసి ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. బాధితులకు తమ పార్టీ అండగా ఉంటుందని ప్రకటించారు. జరిగిన ఘటన దురదృష్టకరమైనదిగా పేర్కొన్నారు. మంత్రి కేటీఆర్ సైతం ఢిల్లీ నుంచి రాగానే బాధితులను పరామర్శిస్తారని తెలిపారు. బాధితుల్లో ఇద్దరిని విడదీసే ప్రయత్నం స్పష్టంగా కనపడుతున్నది. ఘటన ఎస్సీ జాతీయ కమిషన్ స్థాయికి వెళ్లడంతో దాన్ని నీరుగార్చేందుకు ఇద్దరిని విడదీసినట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యే ప్రకటన ప్రభుత్వపరంగా కాకుండా పార్టీపరంగా ఉండటం గమనార్హం. చిత్రహింసల విషయంలో ప్రభుత్వం, పోలీసుల ప్రమేయంతో నిమిత్తం లేకుండా ఎమ్మెల్యే జాగ్రత్తపడ్డారు.

సెన్సెక్స్ ▼ 52	నిఫ్టీ ▼ 09	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)
32,273	10,057	63.80	రూ. 29,005	రూ. 40,800

కోడిగుడ్లు

హైదరాబాద్	320	విజయవాడ	320
ఒక్కగుడ్డుకు	3.80	చెన్నై	355
వరంగల్	322	ముంబయి	365

22న బ్యాంకు ఉద్యోగుల సమ్మె

- 10 లక్షల మంది పాల్గొనే అవకాశం



చెన్నై : బ్యాంకింగ్ రంగంలో ప్రభుత్వ సంస్కరణలను వ్యతిరేకిస్తూ బ్యాంకు ఉద్యోగులు ఈ నెల (ఆగస్టు) 22న సమ్మె బాట పట్టనున్నారు. తొమ్మిది బ్యాంకు యూనియన్ల సమాహారమైన 'యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్' (యూఎఫ్‌బీయూ) ఈ సమ్మెకు పిలుపునిచ్చింది. దేశవ్యాప్తంగా దాదాపు పది లక్షల మందికి పైగా బ్యాంకు ఉద్యోగులు, అధికారులు ఈ సమ్మెలో పాల్గొననున్నారు. బ్యాంకుల ప్రయివేటీకరణ, విలీనం, ఏకీకరణతో పాటు కార్పొరేట్ సంస్థల నిరర్థక ఆస్తులకు (ఎన్‌పీఏ) సంబంధించిన బాకీలను రద్దు చేస్తుండడాన్ని ఉద్యోగ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఎన్‌పీఏల రికవరీకి సంబంధించి పార్లమెంట్ కమిటీ అందజేసిన సూచనలను అమలు చేయాలని, ఉద్దేశపూర్వకంగా బ్యాంకు రుణాల ఎగవేతను క్రిమినల్ నేరంగా ప్రకటించాలని బ్యాంకుల ఉద్యోగ సంఘాల నాయకులు కోరుతూ వస్తున్నారు. కార్పొరేట్ సంస్థల ఎన్‌పీఏల భారం ఇతర బ్యాంకు ఖాతాదారులపై చార్జీల పెంపు రూపంలో పడకుండా చర్యలు చేపట్టాలని బ్యాంకు యూనియన్లు సర్కారును కోరు తున్నాయి. ఈ అంశాలే ప్రధాన డిమాండ్లుగా ఉద్యోగులు సమ్మె బాట పట్టనున్నారు. బ్యాంకింగ్ రంగంలోని సమస్యలతో పాటు ఉద్యోగుల ఇతర సమస్యలు, వేతన సవరణ సంబంధించిన ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని యూఎఫ్‌బీయూ కోరుతూ వస్తోంది. సమ్మెకు సంబంధించిన ఇప్పటికే నోటీసు అందజేసినట్లుగా ఏఐబీఈఏ తెలిపింది.


లాభాల బాటలోకి టాటా స్టీల్

- జూన్ త్రైమాసికానికి రూ. 921 కోట్ల లాభం



న్యూఢిల్లీ: ఉక్కు రంగ దిగ్గజ సంస్థ టాటా స్టీల్ జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి ఆకర్షణీయమైన ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. దేశీయంగా కళింగనగర్ ప్లాంటు అందుబాటులోకి రావడం, అమ్మకాల్లో వృద్ధి కారణంగా టాటాస్టీల్ సంస్థ జూన్ త్రైమాసికంలో నష్టాలను వదిలి లాభాలను నమోదు చేసింది. ఏప్రిల్-జూన్ మధ్య కాలంలో సంస్థ రూ.921 కోట్ల లాభాలను ప్రకటించింది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో సంస్థ రూ.3,183 కోట్ల నష్టాన్ని నమోదు చేసిన సంగతి తెలిసిందే. విదేశీ మారకపు ద్రవ్య విలువలో మార్పుల కారణంగా మొదటి త్రైమాసికంలో సంస్థ రుణ భారం రూ.4,798 కోట్ల మేర పెరిగింది. ఇదే కాలంలో సంస్థ మొత్తం ఆదాయం 19% మేర పెరిగి రూ.26,107 కోట్ల నుంచి రూ.31,129 కోట్లకు చేరుకుంది. భారత్‌లో ఉత్పత్తి సామర్థ్యం పెంచడంతో పాటు ఐరోపా ప్లాంటులో ఉత్పత్తి పెంపునకు పునర్‌నిర్మాణ కార్యక్రమాలు చేపట్టడం మూలంగానే మెరుగైన ఆర్థిక ఫలితాలకు వీలు పడినట్టుగా టాటా స్టీల్ ఫైనాన్స్ అండ్ కార్పొరేట్ విభాగాల డైరెక్టర్ కౌశిక్ ఛటర్జీ తెలిపారు. ఫలితాల నేపథ్యంలో టాటా సంస్థ షేర్ల 4.5 శాతం మేర పెరిగి ఆరేండ్ల గరిష్టాన్ని తాకాయి.

ఎండమావులుగా ఏటీఎంలు!



నోట్ల రద్దుతో ఇంకా నగదుకు కటకటే

- ప్రభను కోల్పోతున్న ఏటీఎం సెంటర్లు
- సంఖ్య తగ్గించేసుకుంటున్న బ్యాంకులు
- నగదు కొరతతో పాత వాటిపైనే దృష్టి

నవతెలంగాణ- వాణిజ్య విభాగం: మోడీ సర్కారు చేపట్టిన పెద్దనోట్ల రద్దు దెబ్బ ప్రభావం ఆర్థిక వ్యవస్థపై ఇంకా కనిపిస్తోంది. రద్దు చేసిన మొత్తంలో ఇప్పటి వరకు తాము 86 శాతం మేర నగదును తిరిగి వ్యవస్థలోకి తెచ్చినట్టు సర్కారు చెబుతున్నా అటు బ్యాంకుల్లో గానీ.. ఇటు ఏటీఎం కేంద్రాల్లో గానీ.. కావాల్సినంత సొమ్ము చేతికందడం లేదు. దీంతో ఒకప్పుడు నగదు లభ్యతకు సులభ కేంద్రాలుగా నిలిచిన ఏటీఎం కేంద్రాలు క్రమంగా ప్రభను కోల్పోతున్నాయి. ఏటీఎంలు ఎడారిలో ఎండమావిలా మారిపోయాయని విమర్శలు వినవస్తున్నాయి. ఏటీఎం కేంద్రం కనబడగానే నగదు లభిస్తుందన్న ఆశ ఒకప్పుడుండేది... అయితే ఇప్పుడు ఏటీఎం కేంద్రం కనిపించినా అక్కడ నగదు మాత్రం అందుబాటులో ఉండడం లేదన్న విమర్శలు పెరిగిపోతున్నాయి.

విస్తరణపై తీవ్ర ప్రభావం..

మోడీ సర్కార్ ముందు చూపు లేకుండా తీసుకున్న పెద్ద నోట్ల రద్దు చర్య వల్ల కొత్త ఏటీఎం కేంద్రాల ఏర్పాటు భారీగా తగ్గిపోయింది. నగదు కొరత వల్ల ఏటీఎంల విస్తరణపై తీవ్ర ప్రభావం పడింది. ముఖ్యంగా బ్యాంకు ఆవరణలో (ఆన్‌సైట్) ఉండే ఏటీఎంలతో పోల్చితే ఇతర ప్రదేశాల్లో(ఆఫ్ సైట్) ఏర్పాటు చేసే ఏటీఎంల సంఖ్య భారీగా తగ్గింది.రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గణాంకాల ప్రకారం జూన్ 2017 నాటికి ఆఫ్ సైట్ ఏటీఎం సంఖ్య 98,092కు పడిపోయింది. 2016 ఏడాది ఇదే కాలం నాటికి ఈ సంఖ్య 99,989గా ఉంది. కాగా బ్యాంకులు పని ఒత్తిడిని తగ్గించుకునేందుకు ఆన్‌సైట్ ఏటీఎంలపై కాస్త దృష్టి సారిస్తున్నట్టుగా తెలుస్తోంది. దీంతో వీటి సంఖ్య మాత్రం స్వల్పంగా పెరిగింది విశేషం. ఈ ఏడాది జూన్ నాటికి ఆన్‌సైట్ ఏటీఎంల సంఖ్య 1,10,385కి చేరింది. గడిచిన ఏడాది ఈ సంఖ్య 1,01,346గా ఉంది. నోట్ల రద్దు తర్వాత గత నవంబర్ నుంచి నగదు సరఫరా తగ్గడంతో కొత్త ఏటీఎంల ఏర్పాటును తగ్గించాలని నిర్ణయించుకున్నాయి. జూన్ 2016 నుంచి జూన్ 2017 మధ్య దాదాపుగా 7,000 కొత్త ఏటీఎంలను ఏర్పాటు చేశారు. ఇంతక్రితం ఏడాది ఇదే కాలంలో ఏకంగా దాదాపు 16,000 ఏటీఎం కేంద్రాలను నెలకొల్పారు. ఇంతకంటే ముందు ఏడాది ఏకంగా 18,500 కొత్త ఏటీఎం కేంద్రాలను అందుబాటులోకి తెచ్చాయి. జూన్ 2017 ముగింపు నాటికి భారత్‌లో మొత్తంగా 2,08,477 ఏటీఎం కేంద్రాలకు పెరిగాయి. గడిచిన ఇదే కాలం నాటికి దేశంలో 2,01,335 ఏటీఎం కేంద్రాలున్నాయి.

క్రమంగా వెనక్కి..

గడిచిన కాలంగా ప్రముఖ ప్రయివేటు రంగ బ్యాంకులు ఐసీఐసీఐ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులు ఆఫ్‌సైట్ ఏటీఎం కేంద్రాల సంఖ్యలో తగ్గుదల చోటు చేసుకుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఆఫ్‌సైట్ ఏటీఎం కేంద్రాలు 6,391 నుంచి 5,845కు తగ్గాయి. ఐసీఐసీఐ బ్యాంకు ఏటీఎంలు 9,274 నుంచి 8,639కి కుదించుకున్నాయి. కాగా భారత్‌లో అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థ అయిన ఎస్బీఐలో మాత్రం ఏటీఎంల సంఖ్య పెరిగింది. భారతీయ మహిళా బ్యాంక్ సహా ఇతర అనుబంధ బ్యాంకులను ఎస్బీఐలో విలీనం చేయడమే ఇందుకు కారణం.

డిజిటల్ మాయలో భాగంగానే..!

కేంద్ర ప్రభుత్వం డిజిటల్ లావాదేవీలకు ప్రాధాన్యత పెంచాలన్న లక్ష్యంలో భాగంగా ఏటీఎం కేంద్రాల్లో నగదు కొరతను సృష్టిస్తున్నారని నిపుణులు పేర్కొంటున్నారు. ఇదే కోణంలో బ్యాంకులు కూడా ఏటీఎంల విస్తరణకు తగ్గముఖం పట్టిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే విషయాన్ని ఓ బ్యాంకు అధికారి కూడా నిర్ధారించారు. మరోవైపు తక్కువ వినిమయం కలిగిన పలు ఏటీఎం కేంద్రాలను ఇతర ప్రాంతాలకు తరలించారు. పెద్ద నోట్ల రద్దు తర్వాత నగదు లభ్యత పడిపోయిందని ఏటీఎం తయారీ కంపెనీ ఎన్‌సీఆర్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ నవరోజ్ దస్తూర్ పేర్కొన్నారు. ఈ ప్రభావం మార్కెట్‌పై తప్పకుండా పడిందన్నారు. దేశంలోని బ్యాంకులు దాదాపుగా సగం వరకూ ఏటీఎంలను ఈ కంపెనీనే అందిస్తుంది. ఇప్పుడున్న అత్యధిక ఏటీఎం మిషన్లను గత ఏడేండ్ల క్రితం ఏర్పాటు చేసినవేనని దస్తూర్ పేర్కొన్నారు. వీటి టెక్నాలజీకి కాలం చెల్లిపోతుందని తెలిపారు.

ఏటీఎంల విస్తరణ..	జూన్ 2014 నాటికి	జూన్ 2015	జూన్ 2016	జూన్ 2017
ఆన్‌సైట్	87,925	92,200	1,01,346	1,10,385
ఆఫ్‌సైట్	78,969	93,284	99,989	98,092
మొత్తం	1,66,894	1,85,484	2,01,335	2,08,477
తేడా		18,590	15,851	7,142

11లక్షల పాన్ కార్డులు రద్దు



న్యూఢిల్లీ : నకిలీ పాన్‌కార్డుల రద్దునకు కేంద్ర ప్రభుత్వం నడుంకట్టింది. ఇందు కోసం ప్రభుత్వంతో పాటు ఆదాయపన్ను శాఖ కూడా చురుగ్గా పని చేస్తోంది. తాజా నివేదికల ప్రకారం జులై 27 నాటికి దేశ వ్యాప్తంగా 11,44,211 నకిలీ పాన్ కార్డులను రద్దు చేసినట్టుగా సమాచారం. అలాగే ఈ నెలాఖరు నాటికి ఆధార్‌తో లింక్ కానీ పాన్ కార్డులు రద్దు కానున్నాయి. ఈ నేపథ్యంలో వినియోగదారులు తమ పాన్ నెంబర్ పని చేస్తోందో లేదో తెలుసుకో వడానికి ఆదాయపు పన్ను శాఖ పలు సూచనలు ఇచ్చింది.

1. ఆదాయం పన్ను ఈఫైలింగ్ పోర్టల్ సందర్శించవచ్చు.
2. ఇందులోని హోమ్ పేజీలో 'సర్వీసులు' అనే టాబ్ కింద 'నో యువర్ పాన్' క్లిక్ చేయాలి.
3. అక్కడ మీరు చేయాల్సిన పని. పేరు, పుట్టిన తేదీ, జెండర్, రిజిస్టర్డ్ మొబైల్ నం బర్‌ను ఇవ్వాలి.
4. రిజిస్టర్ మొబైల్ నంబరుకు వన్ టైమ్ పాస్‌వర్డ్ వస్తుంది. దీన్ని ఎంటర్ చేసి వ్యాలిడేట్ అనే బటన్ క్లిక్ చేస్తే సరిపోతుంది.
5. దీంతో పాన్ చెల్లుబాటులో ఉన్నట్టయితే రిమార్క్ కాలంలో 'యాక్టివ్' అన్న సందేశం వస్తుంది.

ఎస్ఎంఎస్‌తోనూ..

ఆదాయపన్ను శాఖ వెబ్‌సైట్ ద్వారానే కాకుండా 567678 లేదా 56161కు ఎస్ఎం ఎస్ చేయడం ద్వారా పాన్ అనుసంధానం చేసుకోనే వీలుంది. ఈ ప్రక్రియకు గానూ యుఐడిపాన్ అని టైప్ చేసి స్పేస్ ఇచ్చి 12 అంకెలు గల మీ ఆధార్ నంబర్ టైప్ చేసి స్పేస్ ఇచ్చి, మీ 10 అంకెల పాన్ నెంబర్ ఎంటర్ చేసి పైన తెలిపిన నెంబర్‌కు ఎస్ఎంఎస్ చేయాలి. దీన్ని నిర్థారిస్తూ మొబైల్‌కు ఒక సందేశం వస్తుంది.

దీంతో కీలకమైన ఆధార్‌తో పాన్ అనుసంధానం ముగుస్తుంది. ఆదాయ పన్ను దాఖలుకు ఆధార్‌తో పాన్‌కార్డు లింక్ తప్పనిసరి చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 31లోపు ఆధార్‌తో లింక్ కానీ పాన్ కార్డులు రద్దువుతాయని ఆదాయ పన్ను శాఖ ఇది వరకే హెచ్చరించింది.

పెరిగిన ఆదాయపు పన్ను పరిథి

- ఐటీఆర్ దాఖలులో 25% వృద్ధి



న్యూఢిల్లీ: పన్ను పరిధిలో చూపని సొమ్మును నియంత్రించేందుకు ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ చేపడుతోన్న చర్యలు క్రమంగా మంచి ఫలితాలనే ఇస్తున్నాయి. ఐటీ రిటర్నులు దాఖలు చేసిన వారి సంఖ్య గణ నీయంగా పెరగడమే ఇందుకు నిదర్శనం. 2016-17 ఆర్థిక సంవత్స రానికి గాను ఐటీ రిటర్నులు దాఖలు చేసిన వారి సంఖ్య 25 శాతం మేర పెరిగి 2.82 కోట్లకు చేరినట్టుగా సర్కారు వెల్లడించింది. ఇందులో వ్యక్తిగతంగా తమ ఆస్తులను వెల్లడించి పన్ను పరిధిలో చూపిన వారి సంఖ్య గణనీయంగా పెరిగినట్టుగా అధికారులు చెబుతున్నారు. పెద్ద నోట్ల రద్దు, నల్లధన నియంత్రణకు తీసుకుంటున్న వరుస చర్యల కారణంగానే ఈ సంఖ్యలో గణనీయమైన వృద్ధి నమోదైందని అధికారు లు చెబుతు న్నారు. గత ఏడాది రిటర్నులు దాఖలు చేసిన వారి సంఖ్య కేవలం 2.26 కోట్లుగానే ఉందని సర్కారు గణాంకాలు చెబుతున్నాయి. ఆదాయపు పన్ను శాఖ రిటర్నుల దాఖలునకు ఆఖరి తేదీ ఈ నెల 5తో ముగిసిపోయిన సంగతి తెలిసిందే. పెద్దనోట్ల రద్దు కారణంగా కొత్తగా పన్ను పరిధిలోకి వచ్చి చేరిన వారి సంఖ్యలో గణనీయమైన వృద్ధి కనిపిం చినట్టుగా ఆర్థిక శాఖ అధికారులు వెల్లడించారు. ఈ నెల 5వ తేదీ నాటి కి ముందస్తు పన్ను చెల్లింపులు దాదాపు 41.79 శాతం మేర పెరిగడమే ఇందుకు నిదర్శనమని సర్కారు వర్గాలు చెబుతున్నాయి. దీనికి తోడు.. సెల్ఫ్ అసెస్‌మెంట్ ట్యాక్స్ రూపంలో వ్యక్తిగత ఆదాయపు పన్ను చెల్లింపులు అంతకు ముందు ఏడాదితో పోలిస్తే 34.25 శాతం మేర పెరిగాయని ప్రభుత్వం తెలిపింది.

18న విజయవాడలో కృష్ణా బోర్డు సమావేశం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి



కృష్ణాబోర్డు సమావేశం ఈ నెల 18న విజయవాడలో జరగనున్నది. విభజన చట్టం ప్రకారం ఏర్పడిన కృష్ణాబోర్డు సమావేశాలన్నీ ఇప్పటి వరకూ హైదరాబాద్‌లోనే జరిగాయి. బోర్డు కార్యాలయం కూడా హైదరాబాద్‌లోనే ఏర్పాటు చేశారు. బోర్డు సమావేశాన్ని తమ రాష్ట్రంలో కూడా నిర్వహించాలని ఏపీ కోరడంతో అందుకు తెలంగాణ కూడా అంగీకరించింది. తెలుగు రాష్ట్రాలకు తాగు, సాగునీరందించే శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు నీరు రాక పోవడంతో తాగు నీటి కోసం కర్నాటక నుంచి నీరు విడుదల చేయాలని తెలుగు రాష్ట్రాలు కోరుతున్నాయి. కర్నాటక ప్రాజెక్టుల నుంచి నీరు విడుదల చేయకపోతే ప్రస్తుతం శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో ఉన్న కొద్దిపాటి నీటిని రెండు రాష్ట్రాల్లో తాగునీటి అవసరాల కోసం వినియోగించుకోవాల్సి ఉంది.

కృష్ణా నది ఎగువ ప్రాంతంలో వర్షాలు పడితే నారాయణపూర్ నుంచి నీరు విడుదల చేస్తే శ్రీశైలం ప్రాజెక్టుకు నీరు వచ్చే అవకావం ఉన్నది. బోర్డు సమావేశం లోగా నీరు వస్తే అప్పటి పరిస్థితిని సమీక్షించి రెండు రాష్ట్రాలకూ నీటి కేటాయింపులు చేసే అవకాశాన్ని బోర్డు పరిశీలిస్తుంది. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా బ్యారేజీకి గోదావరి నీరు తరలిస్తున్నందువల్ల ఈ మేరకు కృష్ణా ప్రాజెక్టుల నుంచి తమకు అదనపు నీటి వాటా కావాలని తెలంగాణ కోరుతోంది. దీనిపై బోర్డు సమావేశం చర్చించనుంది. రెండు రాష్ట్రాల్లోని ప్రాజెక్టుల వద్ద ఏర్పాటు చేస్తున్న టెలీమెట్రీలు, బోర్డు నిర్వహణ, ప్రాజెక్టుల పరిధి వంటి అంశాలపై కూడా ఈ సమావేశంలో చర్చ జరగనున్నది.

15 టీఎంసీలు విడుదల చేయండి
కర్నాటక ప్రభుత్వానికి లేఖ

తక్షణ తాగునీటి అవసరాల కోసం నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి 15 టీఎంసీల నీరు విడుదల చేయాలని కర్నాటక రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని నీటిపారుదల శాఖ నిర్ణయించింది. కర్నాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంలకు భారీగా నీరు వచ్చినప్పటికీ కిందకి నీరు విడుదల చేయక పోవడంతో లేఖ రాయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఇంజనీర్ ఇన్ చీఫ్ మురళీధరరావు ముసాయిదా లేఖను తయారు చేసి నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషికి పంపించారు. ఈ లేఖను రాష్ట్ర ప్రభుత్వం తరపున మంగళవారం కర్నాటకు పంపే అవకాశం ఉన్నదని అధికారులు తెలిపారు.

కనెక్షన్లు సరే.. నీళ్ల మాటేంటీ ?

భగీరథ నల్లాలకు మీటర్లు !

- సర్కారు సంస్థలూ సొమ్ము కట్టాల్సిందే
- తాగునీటి పంపిణీకి ప్రత్యేక ముసాయిదా
- అధికారుల చర్చోపచర్చలు
- సర్కారుకు ప్రతిపాదన

ఫైల్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రపంచబ్యాంకు తరహా సంస్కరణలు తెలంగాణ డ్రింకింగ్ వాటర్ సప్లయ్ ప్రాజెక్టు(టీడీడబ్ల్యూఎస్‌పీ) ద్వారా మరోసారి అమల్లోకి రాబోతున్నాయి. తాగునీటిని వినియోగ వస్తువుగా మార్చేసి, అందుకు తగినంత మేర యూజర్ ఛార్జీలను పేద ప్రజల నుంచి ముక్కుపిండి వసూలుచేసేందుకు భారీవ్యూహారచన సాగుతున్నది. ముఖ్యంగా తాగునీటి విషయంలో రాజీ పడరాదని, అది ఎంత మాత్రం సేవల కింద చూడకూడదని ప్రభుత ఆలోచన. ఉచితంగా అసలే ఇవ్వరాదని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం సైతం గత ఏడాది జులైలో రాష్ట్ర ప్రభుత్వాలకు సూచిం చింది. ఈనేపథ్యంలో తెలంగాణ సర్కారు సైతం కేంద్రం మార్గదర్శకాలను తూచ తప్పకుండా పాటించడానికి సిద్ధమైంది. మిషన్ భగీరథ ప్రాజెక్టు పూర్తయ్యాక అమల్లోకి తెచ్చే సమయంలో మీటర్లు బిగించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఇందుకోసం ఇప్పటి నుంచే తెలంగాణ డ్రింకింగ్ వాటర్ సప్లయ్ కార్పొరేషన్ లిమిటెడ్(టీడీడబ్ల్యూఎస్‌పీఎల్), గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) సమాలోచనలు చేస్తున్నాయి. నీటిని ఉచితంగా ఇవ్వడంలో అర్థంలేదని, చుక్క చుక్కకు కచ్చితంగా లెక్కకట్టి వినియోగదారుల నుంచి కాసులు పిండేందుకు అధికార యంత్రాంగం ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు సమాచారం. లేకపోతే భగీరథ పథకం ఉనికి కోల్పోయే ప్రమాదం ఉందనే అభిప్రాయాన్ని ప్రచారంలో పెట్టి, తాగు నీటి పన్ను వసూలుకు రంగం సిద్ధం చేస్తున్నారు. తొలుత ఇంటింటికి ఇచ్చే నల్లాలకు కాకుండా, గ్రామాలకు వాటర్ మీటర్లు బిగిస్తారు. ఆ తరువాత ఇంటింటికి ఇచ్చే నల్లాలకు మీటర్లు పెడతారని సమాచారం. భగీరథ ద్వారా సరఫరా చేసే నీటికి యూజర్ ఛార్జీలు తీసుకుంటారా? అని అడిగితే "అంతేకదా.. లేకపోతే ఇంత పెద్ద పథకం ఎలా నడుస్తుంది.. కోట్లు పెట్టి చేపడుతున్నాం..మీటర్లు పెడతాం..యూజర్ ఛార్జీలు వసూలు చేస్తాం' అనిపేరు రాయడానికి ఇష్టపడని ఒక ఉన్నతాధికారి స్పష్టం చేశారు. ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అమలు జరుగుతున్న మీటర్ల విధానాన్ని కూడా పరిశీలించి, మిషన్ భగీరథకు వర్తింపజేయాలని భావిస్తున్నారు. నేరుగా అధికారుల ద్వారా యూజర్‌ఛార్జీలు వసూలు చేస్తే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని, ఇందుకోసం ప్రత్యేకంగా గుజరాత్ తరహాలో పానీ కమిటీలు వేయాలని అనుకుంటున్నారు. అందులో ప్రజలను భాగస్వాములను చేసే పేర ప్రధానంగా మహిళలకు నీటిఛార్జీలు వసూలు చేసే బాధ్యతను అప్పగిస్తారని సమాచారం. వారి ద్వారానే నీటి వాడకాన్ని నియంత్రిస్తారు. తెలంగాణలోని 31 జిల్లాల్లోని 26 వేల జనావాసాలకు ఈ ప్రాజెక్టు ద్వారా మంచినీటి సరఫరా జరగనుంది. దాదాపు రూ. 47 వేల కోట్లతో చేపట్టిన ఈ భారీ ప్రాజెక్టు కోసం ఇప్పటికే 26 సెగ్మెంట్లల్లో పనులు జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ వాటర్, పవర్, అండ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ (వ్యాప్కోస్) సేవలను సైతం ఈ ప్రాజెక్టు కోసం వాడుకుంటుకుంటున్న సంగతి తెలిసిందే. ఈపథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబాలకు 100 ఎల్పీసీడీ, మున్సిపాల్టీల్లో 135 ఎల్పీసీడీ, కార్పొరేషన్లల్లో 150 ఎల్పీసీడీ నీటిని అందిస్తారు. అలాగే మొత్తం 10 శాతాన్ని పరిశ్రమలకు సరఫరా చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు వారం రోజుల కిందే ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. ముఖ్యమంత్రి అమోదం అనంతరం జీవో విడుదల చేయనున్నారు.

తాజా పరిణామలు



భగీరథ ప్రాజెక్టు ప్రధాన పనులు 50 శాతానికిపైగా పూర్తయినట్టు ఇంజినీర్లు చెబుతున్నారు. తాగునీటి పంపిణీ, నిర్వహణ, సెస్ తదితర అంశాలపై భగీరథ యంత్రాంగం చర్చిస్తున్నది. ఇందుకోసం ఒక ముసాయిదాను రూపొందిం చే పనిలో పడింది. దీని ఆధారంగానే భవిష్యత్‌లో భగీరథ ప్రాజెక్టు స్వరూపం, బాధ్యత ఏవిధంగా ఉండాలనే విషయం లో చర్చలు సాగుతున్నట్టు సమాచారం. దీనికి ఇప్పటికే వాణిజ్య, హడ్కో, నాబార్డు తదితర సంస్థలు రూ. 22 వేల కోట్ల మేర అప్పులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆంధ్రా బ్యాంకు ప్రత్యేకంగా కన్సార్టియం సైతం ఏర్పాటు చేసింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడాలని భావిస్తున్నది. ఇప్పటికే జీహెచ్ఎంసీలో ఉపయోగిస్తున్న 'స్కాడా' టెక్నాలజీ ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

పంపిణీ ఎలా ?

భగీరథ నీటి పంపిణీ విషయమై అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం భావిస్తున్నది. తాగునీటి అవసరాలను తీర్చడంతోపాటు పారిశ్రా మిక ప్రయోజనాలను నెరవేరుస్తామని ముందే ప్రకటించిన సంగతి తెలిసిందే. గ్రామ, మండల, జిల్లా, మున్సిపాల్టీలు, కార్పొరేషన్లల్లో కనెక్షన్లు ఇవ్వడం, పంపిణీ తదితర అంశాలపై చర్చలు జరుగుతు న్నాయి. ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలకు రకరకాల పద్దతుల్లో పంపిణీ చేయాలని అనుకుంటున్నారు. ప్రయివేటు సంస్థల నుంచి భారీగానే సెస్ వసూలు చేయనున్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా కనెక్షన్ ఉచితంగానే ఇస్తారు. ప్రాజెక్టు పనులు పూర్తయిన అనంతరం నిర్వహణ బాధ్యతలను స్థానికంగా ఉండే పంచాయతీలకు ఇవ్వాలని భావిస్తున్నారు.

అపార్ట్‌మెంట్లకు 'నో'

మండల కేంద్రాల్లోనూ తాగు నీటి కనెన్షన్లు ఉచితంగానే ఇస్తారు. ఇక్కడ అభివృద్ధి వేగంగా జరుగుతు న్న నేపథ్యంలో అపార్ట్‌మెంట్లు, బహుళ అంతస్థుల భవనాలు విస్తరి స్తున్నాయి. అయితే వీటికి నీటి కనె న్షన్లు మంజూరు చేయడంవల్ల ఇబ్బందులు వస్తాయన్నది అధికారులు భావనగా ఉంది. ఈ నేపథ్యంలో వీటికి కనెక్షన్లు ఇవ్వరాదని అనుకున్నట్టు తెలిసింది. మున్సిపాల్టీల్లోనూ ఛార్జీలు వసూలు చేస్తారు. స్థానిక పురపాలక సంఘాలకే నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తారు.



బల్క్ సరఫరా

విద్యాసంస్థలు, గేటెడ్ కమ్యూనిటీలు, పోలీస్ బెటాలియన్లు, ఎన్ఎస్‌జీ, డిఫెన్స్ సంస్థలకు బల్క్ నీటి సరఫరా చేయాలని చేయనున్నారు. ఈ సంస్థలకు 25వేల లీటర్ల కంటే ఎక్కువ నీటిని సరఫరా అవసరముంటుంది. దీంతో వినియోగ ఛార్జీలను ఆయా సంస్థల నుంచి వసూలు చేస్తారు. హోటళ్లు, చిన్న ఆసుపత్రులు, సంస్థలు, చిన్న పరిశ్రమలకూ నీటిని సరఫరా చేయనున్నారు. వీటిని వాణిజ్య విభాగం కింద గుర్తించి ఆ మేరకు ఛార్జీలను వడ్డిస్తారు.

ప్రభుత్వ శాఖలు, సంస్థలు

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఆసుపత్రులు, పోలీస్ స్టేషన్లు, ఆయా శాఖలు, సంక్షేమ హాస్టళ్లు, అంగన్వాడీ కేంద్రాలకు నీటి సరఫరాను అందించనున్నారు. కానీ నల్లా కనెక్షన్‌కు ఇచ్చేందుకు అయ్యే ఖర్చులో 50 శాతం వసూలు చేస్తారు. వీటి నుంచి యూజర్ ఛార్జీలను తీసుకుంటారు.

రెండు రకాలుగా

భగీరథ నిర్వహణ, అమలు బాధ్యతలను రెండు రకా లుగా విభజించాలని అధికారులు భావిస్తున్నారు. ఈమేరకు పలు దఫాలుగా చర్చలు సాగాయి. గ్రామాలు, మున్సి పాల్టీల్లో స్థానిక సంస్థలకే అప్పగిస్తారు. మరమ్మతులు, అపరే షన్లు, ఇతర పనులు మాత్రం 10 సంవత్సరాల వరకు కాంట్రాక్టర్లే నిర్వహిస్తారు. అనంతరం భగీరథ కార్పొరేషన్ చేపడుతుంది.

భూరికార్డుల ప్రక్షాళనకు సర్వే

రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్

- వీఆర్వోలకు అదనపు బాధ్యతలు
- కొత్త పాసుబుక్కుల పంపిణీ : రెవెన్యూశాఖ సమీక్షలో సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

రాష్ట్రంలోని భూరికార్డులన్నీ ప్రక్షాళన చేయడానికి స్పెషల్ డ్రైవ్‌నిర్వహించాలని ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. ఏ భూమి ఎవరి పేరు మీదున్నదనే సంగతి నిగ్గుతేల్చి బహిరంగ పర్చాలని సూచించారు. ఇకపై భూమి అమ్మకాలు, కొనుగోళ్లన్నీ పూర్తి పారదర్శకంగా జరగాలని చెప్పారు. పట్టాదార్ పాస్ పుస్తకాలు, పహానీ పత్రాలు మరింత సరళంగా ఉండాలని, గందరగోళానికి దారితీసే అంశాలకు తెరవేయాల ని స్పష్టం చేశారు. బ్యాంకుల్లో లావాదేవీలు ఎంత పారదర్శకం గా జరుగుతాయో, అంతే పారదర్శ సరళతరంగా భూరికార్డుల నిర్వహణ చేపట్టాలని అభిప్రాయపడ్డారు. భూరికార్డులను ప్రక్షాళన చేయడంతో పాటు, భవిష్యత్తులో సులభమైన పద్దతుల్లో లావాదేవీలు చేయడానికి వీలుగా అనుసరించాల్సిన విధానం ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామం యూనిట్‌గా జరిగే సర్వే కార్యక్రమానికి సంబంధించిన కార్యాచరణను రూపొందించి, వీలైనంత తొందరగా అమలుచేయాలని అన్నారు. భూమి రికార్డుల ప్రక్షాళనకు అనుసరించాల్సిన విధానం ఖరారు చేయడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్లో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఏడు గంటల పాటు సాగిన సుదీర్ఘ సమీక్షలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. "నిజాం కాలంలో 1936లో చేసిన బందోబస్తు తప్ప మళ్లీ భూమి రికార్డులన్నీ ప్రక్షాళన చేసే కార్యక్రమం జరగలేదు. దీనివల్ల అనేక ఇబ్బందులు, వివాదాలు నెలకొన్నాయి, శాంతి భద్రతల సమస్యలకు కూడా భూ వివాదాలు కారణమవుతున్నాయి. ఈ భూ వివాదాలకు స్వస్తి చెప్పడానికి రాష్ట్రంలోని భూభాగాన్నంతా సర్వే చేయాలి. ఏ భూమి ఎంత విస్తీర్ణంలో ఎవరి పేరు మీదుందో సర్వే నిర్వహించాలని, దీనికోసం సర్వే ఆఫ్ ఇండియాతో పాటు దేశంలోని ఆయా సర్వే ఏజన్సీల సహకారం తీసుకోవాలి. వచ్చే ఏడాది నుంచి రైతులకు ఎకరానికి రూ.4 వేల చొప్పున రెండు పంటలకు గాను రూ.8 వేల పెట్టుబడిగా అందివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో సర్వే నిర్వహించారు. కానీ వ్యవసాయాధికారులు నిర్వహించిన సర్వేలో వెల్లడయిన వివరాలు రెవెన్యూ రికార్డులతో సరిపోలడం లేదు. భూ వివాదాల వల్ల హత్యలు కూడా జరుగుతున్నాయి. వీటన్నింటికీ చరమగీతం పాడాలంటే ఏ భూమి ఎవరికి చెందుతుందనే విషయంలో మరోసారి స్పష్టతకు రావడం అవసరం. దీనికోసం రెవెన్యూ శాఖ స్పెషల్ డ్రైవ్ చేయాలి. గ్రామం యూనిట్‌గా సర్వే జరగాలి. గ్రామంలో ఎంత భూమి ఉంది? ఏ భూమి ఎవరి పేరు మీద ఉంది? అనే విషయంలో స్పష్టతకు రావాలి. మొత్తం రాష్ట్రంలోని 2.70 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో కూడా ఏ భూమి దేని కింద ఉంది అనే వివరాలు తయారు చేయాలి" అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు.



ఒక్కో వీఆర్వోకు మూడు గ్రామాలు

"భూమి పెరగదు. తగ్గదు. ఎంత ఉండాల్నో అంతే ఉంటుంది. ఏది ఎవరి పేరు మీద ఉందనే విషయం తెలిస్తే సరిపోతుంది. గ్రామాల పరిధిలో వివరాలు సరిగ్గా నమోదు చేయాలి, రాష్ట్రంలోని 10,850 రెవెన్యూ గ్రామాల్లో సర్వే జరగాలి. దాదాపు 3500 మంది రెవెన్యూ అధికారుల్లో ఒక్కొక్కరికి మూడు గ్రామాలను ఇన్‌చార్జిగా నియమించాలి. ఒక్కో గ్రామంలో పదిహేను రోజుల్లో గ్రామస్తులు, గ్రామరైతు సంఘం ఆధ్వర్యంలోనే సర్వే చేయాలి. సర్వే నిర్వహించడానికి అనేక ఆధునిక సాంకేతిక పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. సర్వే ఆఫ్ ఇండియాతో పాటు ఇతర సర్వే ఏజన్సీల సహకారం తీసుకోవాలి. ఇంత మంచి కార్యక్రమం కాబట్టి ప్రజలు కూడా సహకరిస్తారు. కలెక్టర్‌తో పాటు రెవెన్యూ అధికారులకు ఈ సర్వే పూర్తయ్యే వరకు మరో పని అప్పగించేది లేదు. ప్రస్తుతం ఇస్తున్న పట్టాదార్ పాస్ పుస్తకాలు, పహాణీ పత్రాలు కూడా గందరగోళంగా ఉన్నాయి. అన్ని కాలమ్స్ అవసరం లేదు. సరళంగా ఉండాలి. ఒకసారి ప్రక్షాళన జరిగిన తర్వాత ఆ వివరాలన్నీ ఆన్‌లైన్‌లో పొందుపరచాలి. సర్వే పూర్తయిన తర్వాత కొత్త పాస్ పుస్తకాలు ఇవ్వాలి. ప్రతి వ్యక్తి భూమికి ప్రత్యేక నెంబర్ కేటాయించాలి. అవసరమైతే భూములకు హద్దు రాళ్లు కూడా పాతాలి. గ్రామస్థాయిలో నిర్వహించే రికార్డుల్లో ఉన్న వివరాలే సిసిఎల్‌ఎ దగ్గర కూడా ఉండాలి. ఎక్కడ ఏ మార్పు జరిగినా ఆన్‌లైన్లోనే అన్ని చోట్లా రికార్డులు మారాలి. బ్యాంకులో వేసిన డబ్బులు ఏ ఎటిఎంలో తీసుకున్నా వెంటనే మెసేజ్ రావడం, బ్యాంకు రికార్డుల్లో వివరాలు నమోదు కావడం, ఎస్ఎంఎస్ రావడం ఎలా జరుగుతుందో భూమి రికార్డుల నిర్వహణ కూడా అలాగే ఉండాలి. బ్యాంకులు అవలంభిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని దీనికి ఉపయోగించాలి" అని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ .సింగ్, సీనియర్ అధికారులు ఎస్.నర్సింగ్ రావు, బీఆర్ మీనా, తదితరులు పాల్గొన్నారు.


లక్ష్మీదేవర

భారతీయ ఇతిహాసాలైన మహాభారతం, రామాయణం వంటి వాటితో ఆదివాసీ ఆచార సంప్రదాయాలు ముడివడి ఉండడం అరుదుగా ఉంటుంది. నాయకపోడుల ఆచార సంప్రదాయాలు ఇందుకు మంచి ఉదాహరణగా చెప్పవచ్చు. ఈ ఆదివాసీలకు వారికంటూ ప్రత్యేక దేవుళ్లు, దేవతలు ఉన్నా శ్రీకృష్ణుడు, పాండవులు, రుక్మిణి వంటి ఐతిహాసిక పాత్రలను మామూలు హిందువుల్లా పూజించడం కనిపిస్తుంది. ఆసక్తికరమైన నాయకపోడుల సంస్కృతికై 'జాతర' అందిస్తున్న ప్రత్యేక వ్యాసం మీకోసం...



నాయకపోడులు

ఆదిలాబాదు, వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో ఎక్కువగా నాయక పోడులు అనే ఆదివాసీలు. నివసిస్తారు. 'దుస్స, కర్రగోల, బుట్టి, వీరి సంస్కృతికి చిహ్నాలు. ఆదిలాబాదులో గోండు, రాజగోండు, నాయక పోడులుగా... గోండు తెగలో విలీనం చేయబడి ప్రభుత్వ రికార్డుల్లో ఆరవ సంఖ్యలో ఉన్నారు. మిగతా జిల్లాల్లోని ప్రభుత్వ రికార్డుల్లో కుల పట్టికలో లేకుండా రకరకాల పేర్లతో కుల ధృవీకరణ పత్రం తీసుకుంటున్నారు. నాయకపోడులకు కొర్రరాజులు, పూజారులు అనే కులాలవారు హక్కుదార్లుగా ఉన్నారు. వీరి ఇలవేల్పు లక్ష్మీదేవర. పాండవులు ఇతరదేవతల్ని కూడా పూజిస్తారు. పూజారులు, కొర్రరాజులు పటం వేసి ఐదురోజులపాటు కథలు చెబుతారు. పటాన్ని చూపెడుతూ మొదటిరోజు లక్ష్మీదేవర పుట్టుక, రెండవ రోజున కీచక వధ, మూడవ రోజున ఉత్తర గోగ్రహణం, నాల్గవ రోజున సుభద్రాకళ్యాణం, ఐదవ రోజున శశిరేఖా కళ్యాణం తదితర పాండవుల గురించిన ఇతివృత్తాలు చెబుతారు. వరంగల్ జిల్లా ఏటూరు నాగారం మండలానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న రొయ్యూరు అనే గ్రామం లక్ష్మీదేవరకు ప్రసిద్ధి. ఈ ఊర్లో నాయకపోడు జనాభా ఎక్కువ.

రొయ్యూరు గ్రామానికి తూర్పు దిశలో లక్ష్మీదేవర గుడి ఉంది. గడ్డి గుడిసెనే గుడిగా భావిస్తారు. గుడిలో ఈశాన్యం వైపున తటారం వేసి దాని ప్రతిమలున్న పెద్ద బుట్టను ఉంచుతారు. (తటారం అంటే భూమి నుండి ఎత్తుగా ఉండునట్లు పందిరి వలె వేయడం). బుట్టలో లక్ష్మీదేవర, పోతురాజు, శ్రీకృష్ణుడు, భీమార్జున, నకులసహదేవులు, రాక్షసులు, గుర్సింగా భోజుడు గొత్తెలు, పందిరాజు చెండి, ముండి అక్క చెల్లెళ్లు, సాంబశివుడు ప్రతిమలు లేక మాస్కులు; గొడ్డలి, తుపాకి, విల్లంబులు ఉంటాయి. వీటిలో లక్ష్మీదేవర ప్రతిమ గుర్రం తల రూపంలో ఉంటుంది.

లక్ష్మీదేవర కథ

నాయకపోడువారు కర్రగోల, దుస్స, బుట్టి పట్టుకొని గడ్డలు, పండ్లు ఏరుకోవడానికి అడవిలో తిరుగుతున్నప్పుడు చెట్లు, పొదల మధ్య మద్ది చెట్టు వేరు దగ్గర పడి ఉన్న ఓ తల కిల కిల నవ్వుతుంది. నాయకపోడులు ఎటు చూసినా ఏమీ కనిపించదు. చివరకు ఓ తల కనిపిస్తుంది. ఎవరు నీవు అని అడిగితే "నేను శ్రీకృష్ణుని భార్యను. నా పేరు రుక్మిణి. నా అన్న కర్ణుని పెండ్లి గురించి జరిగిన యుద్ధంలో నా తల తెగి ఇక్కడ పడింది" అని చెప్పి మగధ రాజ్యంలో ఉన్న శ్రీకృష్ణునికి తన తలను అప్పగించమని కోరింది. నాయకపోడులు ఆ తలను తీసుకొని కృష్ణుని దగ్గరకు తీసుకొని వెళ్ళారు. ఆ సమయంలో కృష్ణుడు రుక్మిణి మొండేనికి గుర్రం తలను పెట్టి సంజీవని మంత్రం ఉపయోగించబోతున్నాడు. అప్పుడు కృష్ణుడు గుర్రం తలను పక్కన పెట్టి రుక్మిణి తలను ఆమె కళేబరానికి పెట్టి సంజీవనీ మంత్రాన్ని పఠిస్తాడు. దీంతో రుక్మిణికి ప్రాణం వస్తుంది.

రుక్మిణి నాయకపోడువారిని పిలిచి మీరు నా వెంబడి ఉండేవాళ్లు కాదు. అడవిలో ఉండేవారు. నాకు ప్రాణదానం చేసినవారు. అంటూ ప్రాణం వచ్చిన గుర్రం తలను ఇచ్చి ఈమె మీ పాలిట లక్ష్మీదేవర. ఈమెను భక్తిశ్రద్ధలతో పూజించండి. మీకు కావలసిన వరాలిచ్చి మీకు రక్షణగా ఉంటుందని చెప్పింది. అప్పటి నుండి లక్ష్మీదేవర నాయకపోడుల ఇలవేల్పయిందనే కథ ప్రచారంలో ఉంది.

రొయ్యూరులో లక్ష్మీదేవర

ఉగాదిరోజున నాయకపోడులు సామూహికంగా లక్ష్మీదేవర పండుగ చేస్తారు. ఈ రోజు లక్ష్మీదేవర తల్లిగారింటికి వెళ్తుంది. రొయ్యూరుని ఆనుకొని శంకరాజుపల్లి అనే గ్రామం ఉంది. ఆ ఊర్లో అనపర్తి పాపయ్య అనే రైతు ఇల్లుని లక్ష్మీదేవర తల్లిగారి ఇల్లుగా భావిస్తారు. అనపర్తి పాపయ్య నాగలి దున్నుతూ దాహం వేస్తే పక్కనే ఉన్న గోదారికి పోయి చెలిమ తీసి నీళ్లు తాగుతుండగా దోసిట్లోకి లక్ష్మీదేవర వచ్చి "నేను మీ ఇంటికి వస్తాను. నన్ను ఏలుకోమని చెప్పింద"ంట. ఆ రోజున లక్ష్మీదేవరను ఇంటికి తీసుకువెళ్ళి చానాళ్లు ఏలుకున్నాడు. కొన్నాళ్లకు నాయకపోడువారిని పిలిచి ఇక నేను లక్ష్మీదేవరను ఏలుకోలేను, మీరే ఏలుకోండి అని చెప్పిండంట. అప్పటి నుండి నాయకపోడువారు లక్ష్మీదేవరకు గుడిని నిర్మించి ఇలవేల్పుగా పూజిస్తూ ఏలుకుంటున్నారు. ఇప్పటికీ ప్రతి ఏడాది లక్ష్మీదేవర ఉగాదినాడు తల్లిగారింటికి వెళ్ళి నెల రోజుల పాటు ఉంటుంది. ఆ తరువాత నాయకపోడువారు అందరూ అక్కడికి పోయి ఆటపాటలతో సంబురం చేస్తారు.

ఉగాది రోజు ఏం జరుగుతుంది?

నాయకపోడువారు వ్యవసాయదారులు. తెల్లవారు ఝామున స్నానం చేసి బురుదారి, ఆరె, జీలుగు నారలతో కొత్త తాళ్లు పేనుకొని బండి, ఎడ్లను, నాళ్లను కడిగి శుద్ధి చేసి పసుపు కుంకుమలు పెట్టి, పొలంలో పెంటపొయ్యటం, నాగడి కట్టడం లాంటి సాగుబాటు చేస్తారు. ఆడవాళ్లు ఇల్లు శుద్ధి చేసి, చిన్న పెద్ద స్నానం చేసి తెల్లారేవరకే తయారవుతారు. పూజారులు, కులపెద్దలు కలిసి ఉదయమే లక్ష్మీదేవరను గోదావరి నదికి తీసుకుపోతారు. లక్ష్మీదేవర ప్రతిమ, మిగతా దేవతల మాస్కులున్న పెద్ద బుట్టను గోదావరికి తీసుకుపోతారు. పూజారులు గోదావరి నదిలో ఏడు చెలుమలు తోడి పసుపు, కుంకుమలు బొట్లు పెట్టి; ఆరె, గారె, మారె, నిమ్మ, ఎటకయాది, మంచి తులిసె వంటి ఆకులు వేస్తారు. ఆ తరువాత వాటిల్లో లక్ష్మీదేవర ప్రతిమతో పాటు మిగతా దేవతామూర్తులనూ కడుగుతారు. ఇసుకపై గుడ్డ పరిచి ప్రతిమలన్నింటినీ మరోసారి పాలతో కడిగి, వాటిని ఎత్తుకొని ఇంటికి బయలుదేరతారు. ఇంటికి వచ్చేటప్పుడు మిగతా విగ్రహాలను బుట్టలో పెడతారు. లక్ష్మీదేవర విగ్రహాన్ని మాత్రం పూజారి ఎత్తుకుంటాడు. డప్పు చప్పుళ్లతో లక్ష్మీదేవర బయలుదేరి వస్తుండగా గ్రామంలో నాయకపోడు ఇతర కులాలవారు వయసు, లింగ భేదాలతో నిమిత్తం లేకుండా అందరూ ఎదుర్కొంటారు. గ్రామంలో ప్రతి ఇంటికీ లక్ష్మీదేవర పోతుంది. లక్ష్మీదేవర కాళ్లు కడిగి పసుపుకుంకుమలు బొట్లు పెట్టి మొక్కిన మొక్కుబడులు తీర్చుకొని కానుకలు సమర్పించుకుంటారు.



లక్ష్మీదేవర ఆవహించడం

లక్ష్మీదేవర పూజారి చాలా నియమ నిష్ఠలతో ఉండాలి. పూజారితనం కూడా వంశపారంపర్యంగా వస్తుంది. లక్ష్మీదేవిని ఎత్తుకునే రోజున స్నానం చేసి, సింగులు గట్టిగా పోసిఎర్రని గుడ్డను నడుముకు కట్టి, పసుపుపచ్చని గుడ్డ రుమాలు చుడతారు. రెండు కాళ్లకు కడియాలు, కాళ్లకు గజ్జెలు, గలువ (గడప) నుండి పైకి ఎర్రని గుడ్డ కడతారు. ఇవన్నీ అలంకరించి డప్పులు కొడుతూ ఊదు పొగవేస్తూ , వచ్చిన వాళ్లంతా కో... కో... కో... అని అరుస్తుంటే ఒక గంట వరకు పూజారిని దేవత ఆవహిస్తుంది. ఆవహించి ఉగ్రం రాగానే లక్ష్మీదేవరను పైకి ఎత్తుతారు. లక్ష్మీదేవరకు అనేక రకాల చీరలు కడతారు. పూజారిని దేవర ఆవహించగానే భూమిని, ఆకాశాన్ని దేవతలందరినీ, తల్లిదండ్రులను గ్రామదేవతలందరినీ తలుచుకుంటారు. నీళ్లు తెచ్చి కాళ్లపై పోస్తూ పసుపు కుంకుమ బొట్లు పెట్టి మొక్కుతారు. ఆ తరువాత అనారోగ్యంగా ఉన్నవారు, పిల్లలు లేనివారు పంటకు పురుగు తగిలినవారు అందరూ వచ్చి దేవత ముందు నిలబడి దయతలచమంటే లక్ష్మీదేవర ఏమిటో తెలియజెబుతుంది. అప్పుడు భక్తులు ఆమె చెప్పిన విధంగా మసలుకుంటారు.


- డా.యం.డి.రాజమహ్మద్

మూలవాసులను నాశనంచేసిన క్రూరులు

ఆర్యులు దాదాపు నాలుగు వేల సంవత్సరాల క్రితమే మధ్య ఆసియా నుండి పంజాబ్ ప్రాంతానికి వచ్చి స్థిరపడ్డారని చెప్పవచ్చు. దండయాత్రికులై వచ్చి స్థిరపడిన వారి గురించి చరిత్రకారులకు రుగ్వేదం నుంచి తగినంత సమాచారం లభించింది. రుగ్వేద శ్లోకాలను రచించినవారు నిస్సందేహంగా ఇక్కడ ఉన్నవారికన్నా మెరుగైన నాగరికతనే అభివృద్ధి చేసుకున్నారు. అయితే తమ సొంత ఇళ్లను వదిలి సుదూర దేశాలకు తరలి వచ్చే సాహసీకులు సాధారణంగా ఉన్నత కుటుంబాలకు చెందినవారై ఉండరు. దృఢమైన శరీర నిర్మాణంతో అమిత ధైర్యశాలురైన కింది తరగతులకు చెందినవారే అయి ఉంటారు. తొలినాటి ఆర్య దండయాత్రికులు కూడా ఇంతే. మినహాయింపు ఏమీ లేదు. వారు దృఢమైనవారు. ధైర్యశాలులు. అధర్మానికైనా జంకనివారు. మూఢవిశ్వాసాలు కలిగినవారు. తమ మార్గానికి అడ్డువచ్చిన వారిపైన శక్తివంతమైన దక్షిణ హస్తాన్ని ప్రయోగించడానికి ఏమాత్రం వెనుదీయని క్రూరమైన సాహసికులు. వారు ఏ ప్రాంతానికైతే వచ్చారో ఆ ప్రాంతంలో తమకు కావలసిన దానిని పొందటానికి ఎంతటి బలప్రయోగానికైనా సిద్ధపడతారు.

వాళ్లు తమ ఉన్నతమైన నాగరికతతో సంస్కృతితో ఇక్కడి అనాగరికులను సంస్కరించాలనే సదుద్దేశంతో రాలేదన్నది స్పష్టమైన విషయమే. భారతదేశంలో తమ సంస్కృతికన్నా వెనుకబడి ఉన్న జాతుల్ని, వారు గమనించినప్పటికీ తమతో సమాన స్థాయికి వారిని అభివృద్ధి చేసే ప్రయత్నమైతే వారు చేయలేదు. అందుకు పూర్తి భిన్నంగా తమకన్నా తక్కువ అనుకున్న వారిపట్ల క్రూరమైన వైఖరినే వారు అవలంభించారు. గంగాలోయ ప్రాంతంలో తమకు సరిసమానంగా అభివృద్ధి చెందిన ప్రాంతంతో మాత్రమే ఆర్యులు స్వేచ్ఛగా కలగలిసిపోగలిగారు. ఆర్యులు ప్రాథమికంగా యుద్ధ ప్రియులు. దేశంలోని సహజ సంపదలను కొల్లగొడుతూ ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి తరలివెళ్లారు. వారు గంగా మైదానంలో శక్తివంతమైన సామ్రాజ్యాలను స్థాపించుకొనేంతవరకు ఈ క్రమం కొనసాగింది. ఆర్యులు సాహసోపేతమైన జీవితాన్నే కోరుకునేవారు. ప్రపంచంలోని అందమైన ప్రతి అంశాన్ని సొంతం చేసుకొని ఆనందకరంగా జీవించాలని కోరుకుంటారు.

భారత దేశపు మూలవాసులను రాక్షసులనీ, ఆర్యులు పిలిచేవారు. వారిని నాశనం చేయమని తమ దేవతలకు ప్రార్థనలు చేసేవారు. రుగ్వేదంలోని ఎన్నో శ్లోకాలు భారతీయులను సంహరించవలసిందిగా తమ దేవతలను అర్థిస్తూ చేసిన ప్రార్థనలే. "వారు అవిశ్వాసులు. వారి ఆచారాలన్నీ భిన్నమైనవి. శత్రు సంహారా! వారిని హతమార్చు. వారి జాతిని సర్వనాశనం చేయి"(రుగ్వేదం 1100-8). ఇటువంటి ద్వేషోన్మాదం ప్రధానంగా కనిపించే శ్లోకాలను ఎన్నింటినో మనం చూడవచ్చు. భూమి మీద ఉన్న సుఖ సంపదల్ని, సౌభాగ్యాన్ని తమ సొంతం చేసుకోవడం ఒక్కటే ఆర్యుల ఏకైక లక్ష్యం. వాటిని సంపాదించేందుకు మతం వారికొక సాధనం. ఈనాటి హిందువులలో చాలామందికి మతం అంటే ఇహలోకపు అస్తిత్వానికి మించిన పారలౌకికమైన మార్మిక అంశం. అయితే రుగ్వేద కాలంనాటి ఆర్యులు తమ దేవుళ్లతో బిడ్డలు తమ ప్రియతముడైన తండ్రితో సంభాషించినట్లుగా శ్లోకాల ద్వారా మాట్లాడేవారు.వాళ్ల విజయాల్లోను, వైఫల్యాల్లోను, బాధలలోను, ఆనందాల్లోను, యుద్ధకాలాన, శాంతిసమయాన, వ్యవసాయంలోను, పశుపోషణలోను బిడ్డలకోసం, సకాల



వర్షాలకోసం, తమ రక్షణ కోసం, తమ ఆస్తుల రక్షణకోసం అన్ని పరిస్థితుల్లోను తమ దేవతలకు హృదయపూర్వకంగా చేసే ప్రార్థనలే రుగ్వేదంలో విస్తారంగా కనిపిస్తాయి. అయితే ఆర్యులు ఎప్పుడు తమ పనిని నిర్లక్ష్యం చేయలేదు. వారెప్పుడు అలుపెరుగక శ్రమించేవారిగానే ఉన్నారు.

ఇంద్రుడు, వరుణుడు, అగ్ని, వాయువు, ప్రకృతిలో కనిపించే ఇతర శక్తులే ఆర్యుల దేవతలు. ఆధునిక హిందువులు పూజించే శివుడు, విష్ణువు, ఇతర అవతారాలు ఆర్యులు ఎరుగనే ఎరుగరు. వాళ్ల ఆరాధనా పద్ధతి కూడా భిన్నమైనది. వారికి విగ్రహాలు కాని, దేవాలయాలు కాని లేవు. వారి దైనందిన ఆరాధనంతా వారి ఇళ్లలోనే కొనసాగేది. రోజు ఉదయం, సాయంత్రం వారు మామూలుగా ఆహారంగా తీసుకునే నెయ్యి , మాంసం, సోమరసం తదితర అంశాలని అగ్నికి నైవేద్యంగా పెట్టడమే వారి పూజ. కొన్ని సందర్భాల్లో ప్రత్యేకమైన యజ్ఞం జరిగేది. అప్పుడు మేకలని, ఆవులని, ఎద్దులని, గుర్రాలని తమ దేవతలకు బలి ఇస్తారు. ఆ యజ్ఞం సమయంలో రుగ్వేద శ్లోక పఠనం జరిగేది. యీ రుక్కులు, లేదా శ్లోకాలను కూర్చినవారిని రుషులు అనేవారు. రుషి అంటే గీత (శ్లోక) రచయిత అని అర్థం. ఈనాటి హిందువులు రుషి అంటే దైవికమైన జ్ఞానానికి సంబంధించినవారని, వారు అడవుల్లో తపస్సు చేసుకుంటారని అనుకుంటారు. దాంతో రుషులు చెప్పే మాటలు ప్రశ్నించే వీలు లేని వేదవాక్కులుగా చలామణి అయ్యాయి. రుషుల్లో అరుదైన జ్ఞానం కలిగిన మహాపురుషులు, స్త్రీలు ఉన్నారు. అయితే వారు కూడా మిగతా వారిలాగానే పెళ్లి చేసుకొని సంసారజీవితం గడిపారు. ఆస్తులను సంపాదించుకున్నారు. భూమిని సాగుచేశారు. పెద్దఎత్తున పశు పోషణ సాగించారు. కొంతమంది రుషులు రాజప్రాసాదాల్లో నివసించి రాజులకోసం యజ్ఞాలు నిర్వహించారు. ప్రతిఫలంగా వందలాది ఆవుల్ని, బంగారాన్ని , వస్త్రాల్ని పొందారు. కొంతమంది రుషులు యుద్ధాలు కూడా చేసి మూలవాసులైన భారతీయులను వందలాదిగా వేలాదిగా సంహరించారు. వారి పాండిత్యాన్ని మినహాయిస్తే వారు కూడా సమాజంలోని ఇతర స్త్రీపురుషులతో అన్ని రకాలుగా సమానమైనవారే. ఆనాటి కాలంలో రాజులు రుషులతో సహా ప్రజలందరిని "విస్" లేదా "విసా"లని పిలిచేవారు. ఈ మాటే కాలక్రమంలో "వైశ్య"గా మారింది. అప్పుడు బ్రాహ్మణులు కాని, క్షత్రియులు కాని లేనే లేరు. అప్పుడు వర్ణ వ్యవస్థ లేదు. ప్రజలందరూ ఒకే జాతి. ఒకే చోట జీవించారు. కలిసి తిన్నారు. కలిసి తాగారు. వివాహాలకు సంబంధించిన నిషేధాలేమీ లేవు. కేవలం యజ్ఞాలు జరిగేటప్పుడు మాత్రమే ఆ యజ్ఞాన్ని నిర్వహించేవారు యజ్ఞోపవీతాన్ని ధరించేవారు. రాజులు లేదా విస్‌పతులు ఆయా తెగల నాయకులు కూడా మామూలు జనంతోనే కలిసి జీవించేవారు. స్త్రీలకు ఎటువంటి విధి నిషేధాలు లేవు. బాల్యవివాహాలు సర్వసాధారణంగా జరిగేవి కావు. సతీసహగమనం అనేది వారికి తెలియదు. తర్వాత కాలంలో వచ్చిన పురోహిత వర్గం పాటించిన దురాచారాలేవీ ఆనాటి ఆర్యులకు తెలియదు. ఆనాటి కాలంలో ఉన్న ఒకే ఒక్క శక్తివంతమైన దురాచారం ఏమిటంటే సురాపానం. దేవతలకు సైతం ప్రీతిపాత్రం అని చెప్పే సోమరసం అమూల్యమైనది. సోమరసాన్ని కీర్తించే శ్లోకాలు రుగ్వేదం నిండా అనేకం ఉన్నాయి. ఆనాటి ప్రజలు ఎంతటి కల్లాకపటం లేనివారో, ఎంతటి బాల్యచాపల్యురోవాటిద్వారా అర్థమవుతుంది. ఈ మితిమీరిన మద్యపానం వలన, క్రూరమైన జంతుబలుల వల్ల ఒక దశలో ఆర్యుల్లో చీలిక కూడా సంభవించి ఒక చీలిక వర్గం దేశాన్ని కూడా విడిచిపెట్టి ఇరాన్‌కి వెళ్లి అక్కడ పార్శీజాతిని, మతాన్ని స్థాపించింది.

(స్వామి ధర్మతీర్థ రచన "హిందూ సామ్రాజ్యవాద చరిత్ర" నుంచి...)

మియావో జీవితం



మియావో ప్రజలు చాలా దీర్ఘకాల చరిత్ర కలిగి ఉన్నారు. ప్రచారంలో ఉన్న కథల ప్రకారం వీరు ఐదు వేల ఏండ్ల క్రితం ఎల్లో నది, యాంగ్జినదీలోయల్లో స్థిరపడ్డారు. ఆ తరువాత వారు దక్షిణ చైనాలోని పర్వతాలు, అడవులకు వలసపోయారు. అక్కడ వీరు గుయిఝు ప్రావిన్స్‌లోనే ఎక్కువగా నివసించారు. ఆ తరువాత వీరిపై 18, 19 శతాబ్దాల్లో అనేక సైనిక దాడులు జరగటంతో గువాంగ్జీ, యునాన్, హుబీ వంటి ప్రావిన్సులకు వెళ్లిపోయారు. కొందరైతే చైనా సరిహద్దులు దాటి వియత్నాం, కంపూచియా, లావోస్, థాయిలాండ్, బర్మా వంటి ప్రాంతాలకు వెళ్లిపోయారు.

వీరు మొదటి నుంచి ఆదిమ వ్యవసాయపద్ధతినే అనుసరిస్తూ వస్తున్నారు. ఒక కుటుంబం ఐదేండ్లకు మించి ఒక ఇంట్లో జీవించదు. భూసారం తగ్గిపోయిందంటే మరో ప్రాంతానికి వలసవెళ్లిపోతారు. అయితే చాలామంది మియావో ప్రజలు ఇరవయ్యవ శతాబ్దం మధ్య నాటికి స్థిర నివాసానికి అలవాటుపడ్డారు. దక్షిణ చైనాలోని సుమారు ఏడువందల పట్టణాలు, కౌంటీల్లో మియావో ప్రజలు నివసిస్తున్నారు. సీనో-టిబెటన్ భాషాకుటుంబం (మియావో-యావో కుటుంబం)కి చెందిన భాష మాట్లాడుతారు. వీరి భాష థాయి భాషను పోలి ఉంటుంది.

తమ చుట్టూ ఉన్న ప్రతిదాన్లోనూ ఉన్న అతీత శక్తి తమ తలరాతను నిర్దేశిస్తుందని వారు నమ్ముతారు. ఈ ప్రపంచంలో పెరిగే, కదిలే ప్రతిదీ ఆత్మ కలిగి ఉంటుందని నమ్ముతారు. వీరు సూర్య చంద్రులను, పిడుగును, అగ్నిని, నదులను, పెద్ద వృక్షాలను, పెద్ద పెద్ద బండలను, జంతువులను పూజిస్తారు. చనిపోయినవారి ఆత్మలు దెయ్యాలుగా మారి వారి కుటుంబాలను, జంతువులను బాధిస్తాయని, అనారోగ్యంపాలు చేయడమో లేక చంపడమో చేస్తాయని నమ్ముతారు. షమన్‌లు అనే వైద్యపూజారులు ఈ దెయ్యాలకు తమ గురించిన సమాచారం అందించేందుకు సహాయపడతారనీ వీరు నమ్ముతారు. అట్లాగే వీరు తమ పూర్వీకులను పూజిస్తారు. అయితే 19వ శతాబ్దం నుంచి చాలామంది మియావోలు క్రైస్తవాన్ని స్వీకరిస్తున్నారు.



వారి నమ్మకాలు విచిత్రంగా ఉంటాయి. ఒక గట్టి బండరాయిని గట్టి సంతానంతో సమానంగా భావిస్తారు. తమ పిల్ల/పిల్లవానికి మూడేండ్లు వచ్చిన తరువాత తల్లిదండ్రులు ఓ పెద్ద రాతిబండ దగ్గరికి బహుమతులు తీసుకెళ్లి సమర్పించుకుంటారు. అగరు బత్తీలు వెలిగించి శిరస్సు వంచి ఆశీస్సులతో రక్షించమని ప్రార్థిస్తారు.

మియావో అమ్మాయిలు, అబ్బాయిలు పదమూడు, పధ్నాలుగేండ్ల వయసు వచ్చేటప్పటికి డేటింగ్‌కి సిద్ధమవుతారు. కొన్ని జిల్లాల్లో పన్నెండేండ్లకే ఆడపిల్లలు డేటింగ్‌కి దిగుతారు.

చనిపోయినవారి దేహాలను పాతిపెడతారు. షమన్ మార్మికమైన ఎన్నో గీతాలను పాడతాడు. చనిపోయినవారి ఆత్మను తిరిగి కుటుంబానికి చేర్చే బాధ్యతను అతడు నిర్వహిస్తాడని, పిల్లల్ని ఆశీర్వదింప చేస్తాడని, ఆత్మకు తమ పూర్వీకులతో ఎలా కలిసి పోవాలో చెబుతాడని ఈ ప్రజలు నమ్ముతారు. అందుకే ఈ తంతులన్నీ జరిపించడానికి షమన్‌ని ఆశ్రయిస్తారు.

మియావో ప్రజలు దయాహృదయులు. అతిథులను ఆదరించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. వైన్, పాటలతో అతిథులను ఆహ్వానిస్తారు. ఇంటి బయట ఉండగానే వారికి నమస్కరించి లోపలికి తీసుకువెళ్లి తిండి పెట్టి, తాగించి తమతో పాటు పాటలు పాడిస్తారు.


- హరితస్

సింధు-4, శ్రీకాంత్-8



ప్రపంచ ఛాంఫ్‌లో టాప్ సీడింగ్స్

న్యూఢిల్లీ : గ్లాస్గోలో ఈ నెల 21 నుంచి జరిగే బ్యాడ్మింటన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఒలింపిక్ రజత పతక విజేత పివి సింధుకు టాప్ సీడింగ్ లభించింది.ప్రతిష్టాత్మకమైన ఈ టోర్నీలో సింధు భారత క్రీడాకారుల్లో టాప్‌సీడ్‌గా ఏ విధంగా రాణిస్తుందన్నది ఆసక్తి కరంగా మారింది. మహిళల కేటగిరిలో సింధు నాలుగో సీడింగ్ లభించడం విశేషం. రియో స్వర్ణ పతక విజేత కరోలినా మారిన్(స్విస్), అకెన్ యమగుచ్చి(జపాన్), సుంగ్ జి హ్యున్(కొరియా)లు టాప్ సీడ్స్‌గా బరిలో దిగుతున్నారు. ఒలింపిక్ కాంస్య పతక విజేత సైనా నెహ్వాల్ 12వ సీడ్‌గాను పోటీ పడుతోంది. ఈ సీజన్‌లో వరుసగా ఇండోనేషియా, ఆస్ట్రేలియా సూపర్ సిరీస్ టైటిళ్లతో మెరిసిన గుంటూరు కుర్రాడు కిడాంబి శ్రీకాంత్ ఉన్నతంగా ర్యాంకింగ్స్‌లో ఎగబాకాడు.దీంతో పురుషుల విభాగంలో ఎనిమిదో సీడ్‌గా శ్రీకాంత్ సాయి ప్రణీత్(15) అజయ్ జయరామ్ (13)లు బరిలో దిగుతున్నారు. టాప్ సీడ్‌గా కొరియాకు చెందిన సాన్ వాన్ తన సత్తా చాటేందుకు పావులు కదుపుతున్నాడు. భారత మిక్స్‌డ్ డబుల్స్ జోడి ప్రణయ్ జెర్రీ చొప్రా, సిక్కిరెడ్డి 15 సీడ్‌గా బరిలో దిగుతున్నారు.





దూకి.. స్వర్ణం పట్టేసిన బౌయి

లండన్ : ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో 100 మీటర్ల మహిళల పరుగులో నాటకీయ పరిణామాల మధ్య అమెరికన్ స్ప్రింటర్ స్వర్ణమయం చేసుకుంది. చివరి మజిలీ లో ఒక్క ఉదుటున ఫినిషింగ్ లైన్ వద్ద దూకేసి విజేతగా అవతరించింది. 26 ఏళ్ల బౌయి చివరి 40 మీటర్ల లక్ష్య సాధనలో ఐవరి కోస్ట్ స్ప్రింటర్ మారియి- జోసి తా లౌ వెన క్కి నెట్టేసి స్వర్ణం సాధించింది. ఈ హఠాత్ పరిణా మంతో ఫేవరేట్ రేసర్, ఒలింపియన్ ఎలీనా థాంప్సన్ 10.98 సెకన్లతో ఐదో స్థానంతో సరిపెట్టుకో వాల్సి వచ్చింది. తొలి వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌లో బౌయి స్వర్ణం సాధించడం విశేషం.

భారత్ నెం:1 బాంబ్రీ

- ఏటిపి ర్యాంకుల్లో 159కు చేరిన వైనం



న్యూఢిల్లీ : యువ టెన్నిస్ ఆటగాడు యూకీ బాంబ్రీ భారత్ నెంబర్ వన్ ర్యాంకుకు చేరుకున్నాడు. ఇప్పటి వరకు 179 ర్యాంకుతో రామనాథన్ రామ్‌కుమార్ ఈ స్థానంలో కొనసాగుతున్నాడు. వాషింగ్టన్‌లో జరిగిన సిటి ఓపెన్‌లో అనుహ్యా ప్రతిభతో బాంబ్రీ క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. మాజీ టాప్ టెన్ టెన్నిస్ ఆటగాడు కెవిన్ అండర్సన్ చేతిలో క్వార్టర్స్‌లో పరాజయం పాలైన విషయం తెల్సిందే. ఈ టోర్నీ ముందు వరకు 200 ర్యాంకులో ఉండే బాంబ్రీ అనుహ్యంగా 41వ స్థానాలు పైకి ఎగబాకాడు.దీంతో 159 ర్యాంకులో భారత్ నెంబర్ -1 సీడ్‌గా అవతరించాడు. బాంబ్రీ, రామనాథన్ రామ్‌కుమార్ ఏటిపి 250 టోర్నమెంట్ ద్వారా ఈ నెల 28 నుంచి జరిగే యూఎస్ ఓపెన్ మెయిన్ డ్రాకు అర్హత సాధించారు. డబుల్స్ భారత్ స్టార్ సానియా మీర్జా ఉన్నత ర్యాంకులో కొనసాగుతోంది.

అతనూ గొప్ప అథ్లెట్

గాట్లిన్ పట్ల నాకెప్పుడూ గౌరవమే: బోల్ట్



లండన్: ఎంత ఎత్తుకు ఎదిగినా అణిగి ఉండాలని పెద్దలు అంటుంటారు. అందుకు చక్కగా అతికిపోయేలా బోల్ట్ వ్యవహరించాడు. ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా జరిగిన 100మీటర్ల పరుగు పందెంలో జమైకా చిరుత ఉసేన్ బోల్ట్ కాంస్యంతో సరిపెట్టుకున్న విషయం విదితమే. అమెరికాకు చెందిన జస్టిన్ గాట్లిన్, కోల్‌మన్‌లకు స్వర్ణ, రజత పతకాలు దక్కాయి.. ఈ సందర్భంగా బోల్ట్ మాట్లాడుతూ.. 'నేను ఎదుర్కొన్న గొప్ప అథ్లెట్స్‌లో గాట్లిన్ ఒకడు. అతని పట్ల నాకెప్పుడూ గౌరవమే ఉంటుంది. గొప్ప అథ్లెట్‌గా పేరు తెచ్చుకునేందుకు అతను ఎంతగానో కష్టపడ్డాడు.. నా సామర్థ్యం మేరకు నేను పరిగెత్తాను. పోటీల్లో గెలుపు ఓటములు సర్వ సాధారణం. ప్రస్తుత ఛాంపియన్‌షిప్‌లో నేను స్వర్ణం సాధించలేదని నా పరుగు ఇక్కడితో ఆగిపోదు. దీని వల్ల నా కెరీర్‌లో ఎలాంటి మార్పులు ఉండవు' అని అన్నాడు. బోల్ట్ గురించి గాట్లిన్ మాట్లాడుతూ..'ఉసేన్ బోల్ట్ గొప్ప అథ్లెట్. త్వరలో అతను అథ్లెటిజంను వదిలేస్తున్నాడు. అతన్ని నేనెప్పటికీ గౌరవిస్తూనే ఉంటాను. ఎప్పుడు పోటీల్లో పాల్గొన్నా.. పోటీల అనంతరం నేను బోల్ట్‌ని అభినందిస్తాను. అంతేకాదు కౌగిలించుకుని అభినందనలు చెప్పాడు' గాట్లిన్.

ఇంగ్లాండ్ విజయం

- 177 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా ఓటమి
- మోయిన్‌కు ఐదు వికెట్లు

మాంచెస్టర్: ఇంగ్లాండ్ బౌలర్ మోయిన్ అద్భుతంగా రాణించటంతో దక్షిణాఫ్రికా ఓటమిపాలైంది. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్‌లో362 పరుగులు చేయగా,రెండో ఇన్నింగ్‌లో .243 పరుగులు చేసింది.ఆ తర్వాత దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్‌లో 226 పరుగులకే ఆలౌట్ అయ్యింది. రెండో ఇన్నింగ్‌లో కేవలం 62.5 ఓవర్లు ఆడి 202 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఇంగ్లాండ్ తరఫున ఆడిన మోయిన్ 75 పరుగులు చేయటంతో పాటు ప్రత్యర్థి జట్టులో కీలకమైన ఐదు వికెట్లు కూలగొట్టాడు.



శ్రీశాంత్‌పై నిషేధం ఎత్తివేయండి

- బీసీసీఐను ఆదేశించిన కేరళ హైకోర్టు



కోచి: భారత మాజీ పేసర్ శ్రీశాంత్‌కు కేరళ హైకోర్టులో ఊరట లభించింది. అతనిపై భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) విధించిన జీవిత కాల నిషేధం ఎత్తివేయాలని కేరళ హైకోర్టు ఆదేశించింది. 2013లో ఇండియన్ ప్రీమియర్ లీగ్-6లో స్పాట్ ఫిక్సింగ్ వ్యవహారంపై బీసీసీఐ జీవిత కాల నిషేధం విధించింది. తనపై నిషేధం ఎత్తివేయాలని శ్రీశాంత్ ఈ ఏడాది మార్చిలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై విచారించిన హైకోర్టుపై అతనిపై జీవితకాల నిషేధం ఎత్తివేయాలని ఆదేశించింది. స్పాట్ ఫిక్సింగ్ కేసుతో సంబంధం ఉందనే ఆరోపణలపై శ్రీశాంత్, అజిత్ చండీమాల్, అంకిత్ చవాన్‌లపై 2013 మే నెలలో ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం వారిని తీహార్ జైలుకు తరలించారు. శ్రీశాంత్ బెయిల్‌పై విడుదలైన విషయం తెల్సిందే.

అజహర్‌కు బకాయిల చెల్లింపుపై బీసీసీఐ దృష్టి



న్యూఢిల్లీ: భారత మాజీ కెప్టెన్ అజారుద్దీన్‌కు సుదీర్ఘ కాలం క్రితం బకాయి పడిన వేతనాలు, ఎక్స్‌గ్రేషియా తదితర అంశాలపై బిసిసిఐ దృష్టి సారించింది. 2000 సంవత్సరం వరకు అజహర్ భారత జట్టుకు ప్రాతినిథ్యం వహించాడు. 17 ఏళ్ల క్రితం నుంచి అతను ఫెన్షన్, వన్‌టైమ్ ఎక్స్‌గ్రేషియా పేమెంట్ తదితరాలను బిసిసిఐ విత్‌హెల్డ్‌లో పెట్టింది. అజారుద్దీన్‌ను క్రికెట్ నుంచి నిషేధించిన విష యం తెల్సిందే. గత ఐదేళ్ల క్రితం ఆంధ్రా హైకోర్టులో తన బకాయిల చెల్లింపుపై కోర్టును ఆశ్రయించాడు.అతనిపై ఛార్జ్ నమోదైన కార ణంగా అప్పట్లో చెల్లించాల్సిన బకాయిలు కొన్ని కోట్లకు చేరి ఉంటుందని అంచనా. దీనిపై ఈ నెల 9న జరిగే బిసిసిఐ పాలక మండలి సమావేశంలో చర్చించి తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

టెక్స్‌టైల్ పార్కు నిర్మాణంలో జాప్యం..!

రాష్ట్ర ప్రభుత్వం వరంగల్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టెక్స్‌టైల్ పార్కు నిర్మాణం రోజురోజుకీ జాప్యమవుతున్నది. మూడేండ్లు గడిచినా నేటికీ భూ సేకరణ పూర్తవ్వలేదు. పర్యావరణ అనుమతులు లభించినా...ప్రాజెక్టు రూపకల్పన కాగితాలకే పరిమితమైంది. వెరసి..ప్రపంచమే నివ్వెరపోయేలా వరంగల్‌లో జౌళి పార్కు(టెక్స్‌టైల్ పార్కు) నిర్మిస్తమని జిల్లా వాసులకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ బుట్టదాఖలైంది. ఇంకోవైపు ఇప్పటిదాకా సేకరించిన భూమికి పరిహారం చెల్లింపులో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నది. చెల్లింపుల్లో ఎకరాకు నాలుగైదు గుంటలకు కోత పెడుతున్నారు.





నవతెలంగాణ-జ9గా2బ ప్రతినిధి

వరంగల్ నగరానికి సమీపంలో మూడు వేల ఎకరాల్లో టెక్స్‌టైల్ పార్కు నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం సంకల్పించింది. మొదటగా వరంగల్ అర్బన్ జిల్లా ధర్మసాగర్ ప్రాంతంలో భూముల్ని అధికారులు పరిశీలించారు. రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో వరంగల్ రూరల్ జిల్లా సంగెం, గీసుకొండ మండలాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పలు గ్రామాల రైతులతో మాట్లాడి భూములు సేకరిస్తామని హామీ ఇచ్చారు. టెక్స్‌టైల్ పార్కు చేపడితే సుమారు 330 యూనిట్లు రానుండగా మౌలిక వసతుల కల్పనకు అయ్యే ఖర్చే 372 కోట్లు. పార్కు నడవడానికి 220 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణం చేయాలి. ప్రతి రోజు 25 మెట్రిక్ లీటర్ల నీరు అవసరం. ఈ పార్కు నిర్మాణానికి కడియం శ్రీహరి వరంగల్ ఎంపీగా ఉన్న సమయంలోనే ఆయన సారథ్యంలో రెండేండ్ల కిందే సూరత్, భీవండి తదితర ప్రాంతాలను బృందం అధ్యయనం చేసి వచ్చింది. టెక్స్‌టైల్ పార్కుతో 10వేల మందికి ప్రత్యక్షంగా, 20వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని అధికారులు ప్రకటించారు. టెక్స్‌టైల్ పార్కు స్థలాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ హెలిక్యాప్టర్ ద్వారా పరిశీలించారు. జిల్లాకు వచ్చిన రెండు సందర్భాలలో టెక్స్‌టైల్ పార్కు అతివేగంగా పూర్తిచేస్తామని హామీనిచ్చారు. కానీ, ఏ పనులూ మొదలు పెట్టలేదు.

పూర్తికాని భూసేకరణ

గీసుగొండలోని శాయంపేట, రాయినికుంట, వెంకటాపూర్, ఊకల్, సంగెం మండలంలోని చింతలపల్లి, కాట్రపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో భూమిని 2800 ఎకరాలను సేకరించాలని నిర్ణయించారు. ఇప్పటి వరకూ 1200 ఎకరాలు సేకరించినట్టు అధికారులు చెబుతున్నారు. ఎకరాకు రూ.9.95లక్షల చొప్పున రైతులకు పరిహారం ఇవ్వాలని నిర్ణయించారు. దీనికోసం 110కోట్లు చెల్లించారు. ఆ పరిహారం రైతులకు పూర్తిస్థాయిలో అందలేదు. బావులు, బోర్లు ఉన్న రైతులకు అదనంగా డబ్బులు చెల్లిస్తామన్న హామీ నోటిమాటలకే పరిమితమైంది. పరిహారం ఇచ్చేటప్పుడు కూడా ఐదు నుంచి పది గుంటలకు డబ్బులు చెల్లించకుండా తిప్పించుకుంటున్నారు. భూములు, ఇండ్లు కోల్పోయే వారికి రోడ్డును ఆనుకొని ప్లాట్లు ఇస్తామని చెప్పారు. ప్లాట్లు ఇచ్చారు. అయితే ఆ ప్లాట్ డబ్బులను వీరికి రావాల్సిన నగదు నుంచి మినహాయించుకున్నారు. ఇప్పుడు రైతులంతా దానిపై గగ్గోలు పెడుతున్నారు. తమకు ఉపాధి కల్పించాలని 470 కుటుంబాలకు చెందిన కూలీలు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. మొదటి విడత రైతులకే పరిహారం చెల్లింపులో అన్యాయం జరగటంతో భూమి ఇవ్వటానికి ఎవరూ ముందుకు రావట్లేదు.

పరిహారం చెల్లింపుల్లో కోత

- పర్యావరణ అనుమతులు వచ్చినా ఫలితం శూన్యం
- పార్కు పూర్తిచేస్తే 330 యూనిట్లు రాక

పర్యావరణ అనుమతులు వచ్చినా...

ఇటీవల టెక్స్‌టైల్ పార్కుకు పర్యావరణ అనుమతులు వచ్చాయి. భూ సేకరణ పార్కు ఏర్పాటుకు ఆటంకంగా మారింది. విద్యుత్ ఉపకేంద్రాన్ని 220 కేవీ సామర్థ్యంలో ఏర్పాటు చేయాల్సి ఉంది. దీనికి అవసరమైన నీటి కోసం రిజర్వాయర్ నుంచి నీటి పంపింగ్ ఏర్పాటు చేయాలి. అది జరగట్లేదు.





(ఫైల్)

అప్పనంగా గుంజుకున్నారు

టెక్స్‌టైల్ పార్కు కోసం ఏటా మూడు పంటలు పండే నా ఆరెకరాలను అప్పనంగా గుంజుకున్నరు. ఎకరాకు 10లక్షల ధరఉండగా మూడురెట్లు అదనంగా చెల్లించాల్సింది పోయి ఎకరాకు 9లక్షల 95వేల రూపాయలు మాత్రమే ఇచ్చారు. అందులోనూ 10 గుంటల భూమికి డబ్బులివ్వలేదు. బావి, బోరు ఉంటే అదనంగా పరిహారం చెల్లిస్తామని చెప్పిన అధికారులు దాని ఊసే ఎత్తటం లేదు. రోడ్డు పక్కన ఇంటి స్థలం చూపించి తమకు వచ్చే వాటిలోనే కట్ చేసుకున్నారు. మా కుటుంబం రోడ్డున పడ్డది. పట్నంబోయి కూలినాలి చేసుకోవాల్సిన దుస్థితి వచ్చింది.

రైతు నాగయ్య, రాయినిగూడెం

కాల పరిమితిలో పనిచేయాలి

ఈ పార్కు పూర్తయితే ఉపాధి కోసం ఐదు లక్షల మంది చేనేత కార్మికులు వరంగల్‌కు వచ్చే అవకాశం ఉంది. వరంగల్ వస్త్ర నగరి విషయంలో కాలపరిమితి లేక రోజులు గడుస్తున్నాయే తప్ప పనులు జరగట్లేదు. కాలపరిమితి పెట్టి పనిచేయాలి. పార్కు కోసం బడ్జెట్‌లో 800 కోట్లు కేటాయించారు. నాలుగు మాసాలైనా పైసా విడుదల చేయలేదు. ఇలా చేస్తే ఇంకో ఇరవై ఏండ్లయినా వస్త్ర నగరి పూర్తవ్వదు.

కూరపాటి రమేష్, తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి

భూ సేకరణ జరుగుతున్నది

టెక్స్‌టైల్ పార్కు కోసం భూ సేకరణ జరుగుతున్నది. ఇప్పటికే 1200 ఎకరాలకు పైగా భూమిని కొన్నం. మరో 800 ఎకరాలు గుర్తించినం. రైతులకు డబ్బులు పూర్తిగానే చెల్లిస్తున్నాం. త్వరలోనే భూ సేకరణ పూర్తి చేస్తాం.

మహేందర్‌జీ, వరంగల్ రూరల్ ఆర్డీఓ

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.